నెపోలియన్
రూ॥ 180/-
పేజీలు: 190



నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ, హిమాయత్‌నగర్ (హైదరాబాద్) హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



మోదీ ప్రభుత్వ గొప్పలు – పేదలకు తప్పని తిప్పలు
షేక్ హసీనాకు ఆరు నెలల జైలు
దేవాలయాల వెలికితీతకు గ్రీన్‌సిగ్నల్
లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 213 | గురువారం | 03-07-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


9న దేశవ్యాప్త సార్వత్రిక

## సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు

**జాతీయ సమితి సమావేశం తీర్మానం**

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా జూలై 9న సార్వత్రిక సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర రంగ సమాఖ్యలు, సంఘాల ఇచ్చిన పిలుపునకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేసేందుకు సిపిఐ శ్రేణులు అందులో ప్రత్యక్షంగా పాల్గొనాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు న్యూఢిల్లీలోని అజయ్‌భవన్‌లో బుధవారం ప్రారంభమైన సిపిఐ జాతీయ సమితి సమావేశం ఏకగ్రీవ తీర్మానం చేసింది.ఈ సమ్మెకు సంయుక్త కిసాన్ మోర్చా,వ్యవసాయ కార్మికుల సంఘాల సంయుక్త వేదిక మద్దతు ప్రకటించాయని, తమ డిమాండ్లతో పాటు, కార్మిక సంఘాల డిమాండ్లకు మద్దతుగా గ్రామీణ భారతదేశంలో భారీగా ప్రజలను సమీకరించాలని నిర్ణయించాయని పేర్కొంది. కార్మిక సంఘాలు, రైతులు, వ్యవసాయ కార్మికుల డిమాండ్లకు సిపిఐ జాతీయ సమితి మద్దతు ప్రకటించింది. 'జూలై 9న జరగనున్న కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక, దేశ వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మెకు పిలుపు సంఘాలు పిలుపు ఇచ్చాయి. ప్రభుత్వ రంగ సంస్థలు,ప్రజా సేవలను ప్రైవేటీకరించడం, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు , క్యాజువల్ కార్మికుల విధానానికి వ్యతిరేకంగా, కార్మికులకు వ్యతిరేకంగా, యజమానులకు అనుకూలంగా రూపొందించిన నాలుగు కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు పోరాడుతున్నాయ'ని తీర్మానంలో సిపిఐ పేర్కొంది. 'ఈ చట్టాలు కార్మిక సంఘాల ఉద్యమాన్ని అణచివేయడానికి, నిర్వీర్యం చేయడానికి ఉద్దేశించినవి. పనిగంటల పెంపు, సామూహిక బేరసారాల హక్కును లాక్కోవడం, సమ్మె హక్కును లాక్కోవడం, యజమానులు కార్మిక చట్టాల ఉల్లంఘనలను నేరరహితం చేయడం, అదే సమయంలో కార్మిక సంఘాల కార్యకలాపాలను నేరంగా పరిగణించడం వంటి వాటికి వ్యతిరేకంగా కార్మిక సంఘాలు పోరాడుతున్నాయ'ని వివరించింది. నిరుద్యోగాన్ని పరిష్కరించాలని, మంజూరైన పోస్టుల్లో నియామకాలు చేపట్టాలని, మరిన్ని ఉద్యోగాలను సృష్టించాలని, ఉపాధి హామీ కార్మికుల పనిదినాలను, వేతనాలను పెంచాలని, పట్టణ ప్రాంతాలకు కూడా ఇలాంటి చట్టాన్ని అమలు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని సిపిఐ జాతీయ సమితి తెలిపింది.

రాష్ట్రంలో 9 నుంచి 12వ తరగతి

# విద్యా విధానం

అమలు చేసే అంశాన్ని అధ్యయనం చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం



- పది పాసైనా ఇంటర్ పూర్తి కావడంలేదు
- అందుకే 9–12 తరగతి విధానం పరిశీలన
- ఇంటర్మీడియట్ విద్య మెరుగుకు అన్ని దశల్లో చర్చించి శాసనసభలోనూ చర్చకు పెడతామని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో '9–12వ తరగతి'(9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు) విధానాన్ని అమలు చేసే అంశాన్ని అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. ఇంటర్మీడియట్‌ను,12వ తరగతి వరకు పాఠశాలలు ఉన్న రాష్ట్రాల్లో అధికారులు అధ్యయనం చేసి, ఈ విధానంపై సమగ్ర నివేదిక సమర్పించాలని, ఈ విషయంలో విద్యా కమిషన్, ఆ విభాగంలో పని చేసే ఎన్‌జిఒలు, పౌర సమాజం సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్ విద్య మెరుగుకు అన్ని దశల్లో చర్చించి శాసనసభలోనూ చర్చకు పెడతామని తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన ప్రతి ఒక్క విద్యార్థి తప్పని సరిగా ఇంటర్మీడియట్‌ను పూర్తి చేసేలా చూడాలని, పదో తరగతిలో పెద్ద సంఖ్యలో ఉత్తీర్ణత కనిపించినప్పటికీ ఇంటర్మీడియట్ పూర్తయ్యేసరికే ఆ సంఖ్య గణనీయంగా తగ్గిపోవడానికి గల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సిఎం సూచించారు. విద్యాశాఖపై హైదరాబాద్‌లోని ఐసిసిసిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వ హించారు. విద్యార్థి జీవితంలో

తరువాయి 12లో

గాజాలో 60 రోజులు

## కాల్పుల విరమణ

ఇజ్రాయెల్ అంగీకారం
వెల్లడించిన ట్రంప్

**వాషింగ్టన్ :** గాజా స్ట్రిప్‌లో 60 రోజులపాటు హమాస్‌తో కాల్పుల విరమణను ఖరారు చేసేందుకు వీలుగా అమలు చేయాల్సిన షరతులకు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ అంగీకారం తెలియజేశారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్ ట్రంప్ ఈ విషయం చెప్పారు. 'వచ్చే వారమే కాల్పుల విరమణ, ఇంకా సజీవులుగా ఉన్న బందీల విడుదల జరుగుతుంది, నేతన్యాహూ కూడా ఇదే కోరుకుంటున్నారు'' అని ట్రంప్ స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా నెతన్యాహూ వచ్చేవారం అమెరికా పర్యటనకు స్వదేశంలో ఎదురైన ఆటంకాలన్నీ తొలగిపోయాయి. ''రెండు నెలలపాటు కాల్పుల విరమణ అమలు చేసేందుకు, యుద్ధ విరమణకు వీలుగా ఈ సమస్యతో ముడిపడిన అందరితో కలిసి మేం కృషి చేస్తాం'' అని తన సొంత సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ పోస్టింగ్ పెట్టారు. అమెరికాలో పర్యటిస్తున్న ఇజ్రాయెల్ వ్యూహాత్మక వ్యవహారాల మంత్రి రోన్‌డెర్మెర్‌తో వైట్‌హౌస్‌లో అధికారులు సంభాషణలు చేశారు. ఈ సంభాషణల సారాంశాన్ని క్రోడీకరిస్తూ ట్రంప్ సోషల్ మీడియాలో బుధవారం పోస్టింగ్ పెట్టారు. ఇజ్రాయెల్‌ను ఒప్పించే బాధ్యత అమెరికా స్వీకరించగా, హమాస్‌ను కాల్పుల విరమణకు ఒప్పించి సానుకూల తుదినిర్ణయం తీసుకునేవిధంగా లొంగదీసే బాధ్యతలను ఖతార్,

తరువాయి 2లో

కుల గణనపై స్వతంత్ర నిపుణుల కమిటీ

## అధ్యయన నివేదిక సిద్ధం



- 242 కులాల వారీగా సిబిఐ స్కోర్, ర్యాంకింగ్
- వారం రోజుల్లో సిఎం, డిప్యూటీ సిఎంకు అందజేయనున్నట్లు కమిటీ వెల్లడి

ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్రంలో చేపట్టిన కుల గణనను అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన స్వతంత్ర నిపుణుల కమిటీ (ఐఇడబ్ల్యుజి) తన నివేదికను రూపొందించింది. ఈ నివేదికను త్వరలో ప్రభుత్వానికి అందించడానికి సిద్ధం చేస్తోంది. తెలంగాణ ప్రభుత్వం 2024 నవంబర్, డిసెంబర్ నెలలలో నిర్వహించిన కుల గణన సర్వే డేటాను అధ్యయనం, విశ్లేషణ, ధృవీకరణ

తరువాయి 2లో



## 14 నుంచి కొత్త రేషన్ కార్డులు

- తుంగతుర్తి నియోజకవర్గంలో సిఎం చేతులమీదుగా ప్రారంభం : మంత్రి ఉత్తమ్
- అందరి సహకారంతో నల్లగొండ జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి
- ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి లక్ష్మణ్ కుమార్

ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి

జిల్లా మంత్రులు, ఎంపీలు ,ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో నల్లగొండ జిల్లాను ముందుకు తీసుకు వెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ తెలిపారు. బుధవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఉదయాదిత్య భవన్ లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో జిల్లా ఇన్చార్జి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని రకాలుగా అండగా ఉంటుందని, ప్రతిరోజు రైతులకు సంబంధించిన అంశాలపై మండల స్థాయి అధికారులతో జిల్లా అధికారి పర్యవేక్షణ చేయాలన్నారు. రైతు భరోసా, రైతు బీమా, ఎరువులు, విత్తనాల విషయంలో ప్రత్యేక దృష్టి నిలపాలని చెప్పారు. గత ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేసిందని, అలాకాకుండా తమ ప్రభుత్వం రైతులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి రైతు భరోసా వంటి ప్రతిష్టాత్మక పథకాలను అమలు చేస్తున్నదని అన్నారు. జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులన్నింటిని పూర్తిచేసేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఇరిగేషన్ ప్రాజెక్టులు, వ్యవసాయ విద్యుత్


తరువాయి 2లో

చేనేత కార్మికులకు

## రూ.33 కోట్లు రుణమాఫీ

5,691 మంది చేనేత కార్మికులకు లబ్ధి : మంత్రి తుమ్మల

ప్రజాపక్షం/హైదరాబాద్



సుదీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్న చేనేత కార్మికుల రూ.33 కోట్ల రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం పరిపాలన అనుమతులను జారీ చేసిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు చేనేత కార్మికులకు లక్ష వరకు ఉన్న రుణాలను మాఫీ చేయనున్నామని తద్వారా. 5,691 మంది చేనేత కార్మికులకు లబ్ధి చేకూరనుందన్నారు. ఇంతకుముందు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం 2017 ఏప్రిల్ 1వ తేది నుండి 2024 మార్చి 31 వరకు అన్ని బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల్లో చేనేత వస్త్రాల ఉత్పత్తి, వృత్తి సంబంధిత కార్యకలాపాలకు సంబంధించి తీసుకున్నరూ. లక్ష వరకు రుణాల (అసలు, వడ్డీ కలిపి) మాఫీ వర్తిస్తుందని మంత్రి తెలిపారు. మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాల వారిగా లబ్ధిదారుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతుందని, ఇది పూర్తైన వెంటనే కార్మికుల ఖాతాలలో రుణమాఫీ నిధులను జమ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం చేనేత కార్మికులు కోరుకుంటే మళ్లీ ఆ మేరకు రుణాన్ని బ్యాంకులు మంజూరు చేస్తాయని మంత్రిపేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఇప్పటీ వరకు దాదాపు రూ.920 కోట్లు ఖర్చు చేశామని మంత్రి వెల్లడించారు. చేనేత కార్మికులకు ఎల్లప్పుడు పనికల్పించాలనే ఉద్దేశ్యంతో అన్ని ప్రభుత్వ శాఖలు టిజిసిఓ నుండే వస్త్రాలు కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీచేశామని, దీంతో ఇప్పటికే రూ.579 కోట్ల విలువైన వస్త్రాలకు వివిధ ప్రభుత్వ శాఖల నుండి ఆర్డర్లు వచ్చాయని మంత్రి వెల్లడించారు. ఇందిరా మహిళాశక్తి చీరల పథకం ద్వారా సిరిసిల్లలోని 16 వేల మరమగ్గాలకు నిరంతరం పని కల్పించడానికి చర్యలు తీసుకున్నామన్నారు.రూ 193 కోట్లు చేనేత అభయహస్తం పథకాన్ని అమలు చేస్తున్నామని, అంతేకాకుండ గత ప్రభుత్వం కార్మికులకు చెల్లించకుండా వదిలేసిన రూ.290 కోట్లను తమ ప్రభుత్వం నేతన్నకు చేయూత పథకం కింద కార్మికుల ఖాతాలలో జమ చేసిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.



ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి అమలు

## బాధ్యత కలెక్టర్లదే

**8 జిల్లాల కలెక్టర్లతో సచివాలయంలో సమావేశం**

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం దార్శనికతతో తీసుకువచ్చిన భూభారతి చట్టం, పేదల కలలను సాకారం చేసే ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంబంధింత అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా రూపుదిద్దుకున్న ఈ రెండు పథకాల ఫలితాలు పేదల గుడిసే వరకు చేర్చాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లదేనని మంత్రి స్పష్టం చేశారు. డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని బుధవారం మంత్రి తన కార్యాలయంలో నిర్మల్, నారాయణపేట్, జోగులాంబ గద్వాల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల , వనపర్తి జిల్లాల కలెక్టర్లతో భూభారతి, ఇందిరమ్మ ఇండ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ 'ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడితే స్వరాష్ట్రంలో గత 10 ఏళ్లుగా ఎదుర్కొన్న భూ సమస్యలకు విముక్తి లభిస్తుందని , సొంతింటి కల నెరవేరుతుందని తెలంగాణ ప్రజానీకం అత్యంత నమ్మకం ,విశ్వాసంతో తమకు అధికారం అప్పగించారన్నారు. వారి నమ్మకాన్ని విశ్వాసాన్ని ఏమాత్రం వమ్ము చేయకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా భూభారతి చట్టానికి, అలాగే ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. చట్టాన్ని రూపొందించడం ఒక ఎత్తైతే దాన్ని అమలు చేయడం మరో ఎత్తు అని, ఈ చట్టం ఫలితాలు ప్రతి పేదవానికి అందినప్పుడే చట్టం సార్థకత నెరవేరుతుందని, ఈ చట్టాన్ని క్షేత్ర స్థాయిలో పటిష్టంగా అమలు చేయాల్సిన గురుతరమైన బాధ్యత కలెక్టర్లపై ఉందని మంత్రి పేర్కొన్నారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రెవెన్యూ కార్యాలయానికి వచ్చే సామాన్యుడు సైతం సంతోషపడేలా రెవెన్యూ యంత్రాంగం పనిచేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి

తరువాయి 2లో

సిగాచి తరహా దుర్ఘటనలో

## ప్రభుత్వాలదే ఎక్కువ బాధ్యత

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని ఎఐటియుసి డిమాండ్



**న్యూఢిల్లీ :** తెలంగాణలోని సంగారెడ్డిలో సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో మరణించిన 40 మంది కార్మికులు, ఢిల్లీలోని రిథాలాలోని అక్రమ ఫ్యాక్టరీలో మరణించిన నలుగురికి, తమిళనాడులోని శివకాశిలోని బాణాసంచా ఫ్యాక్టరీలో మరణించిన మరో నలుగురికి ఎఐటియుసి సంతాపం తెలియజేసింది. మరణించిన ప్రతి వ్యక్తి కుటుంబానికి

తరువాయి 2లో

## సిగాచీ మృతుల లెక్క తేలలే!

- ఇప్పటికి 40 మంది గుర్తింపు .. మరింత పెరిగే అవకాశం
- రూ. కోటి పరిహారం ప్రకటించిన యాజమాన్యం



ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామిక వాడాలోని సిగాచి పరిశ్రమలో రియాక్టర్ పేలుడు అంతులేని విషాదంగా మారింది. మూడ్రోజులైన ఎంత మంది చనిపోయారు,అనే లెక్క ఇప్పటికి తేలలేదు. సహాయక చర్యలు జరగుతున్న పరిస్థితి అంత గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటి వరకు అధికారులు ధృవీకరించిన లెక్కలకు , పరిశ్రమలో

తరువాయి 2లో

### పేలుళ్లపై అధ్యయానికి నిపుణుల కమిటీ ఏర్పాటు

ప్రజాపక్షం/హైదరాబాద్

సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి కంపెనీలో చోటు చేసుకున్న పేలుడు ఘటనపై ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. సిఎస్‌ఐఆర్–ఐఐసిటి ప్రముఖ శాస్త్రవేత్త బి.వెంకటేశ్వరరావు ఛైర్మన్‌గా సిఎస్‌ఐఆర్ చీఫ్ శాస్త్రవేత్త టి.ప్రతాప్ కుమార్, సిఎస్‌ఐఆర్–సిఎల్‌ఆర్‌ఐ విశ్రాంత శాస్త్రవేత్త సూర్యనారాయణ, సిఐఎస్‌ఆర్–ఎన్‌సిఎల్ పుణె భద్రతాధికారి సంతోష్ ఘుగే సభ్యులతో నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం

తరువాయి 2లో

## 'హస్తం'... సమాయత్తం..



స్థానిక సంస్థల ఎన్నికలకు కేడర్‌ను సన్నద్ధం చేస్తున్న కాంగ్రెస్

రేపు హైదరాబాద్‌లో పార్టీ గ్రామ అధ్యక్షుల సమ్మేళనం

హాజరుకానున్న ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గే

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ సన్నద్ధమైంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని సిద్ధం చేయడం, ప్రభుత్వ ప్రతిష్టపెంపు, పార్టీ కేడర్‌ను క్రియాశీలంగా చేయడం లక్ష్యంగా చర్యలు చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రధాన ప్రతిపక్షాన్ని ఎదుర్కొవడంపైనే కాంగ్రెస్ పార్టీ ఎక్కువగా దృష్టిపెట్టింది. ఇక పార్టీని సంస్థాగతంగా పటిష్టవంతం చేసేందుకు సమయాత్తమైంది. ఇందులో భాగంగా ఇప్పటికే

తరువాయి 12లో

### ఖర్గే సభను విజయవంతం చేయండి

డిప్యూటీ సిఎం భట్టి

ఈనెల 4న హైదరాబాదు ఎల్‌బి స్టేడియంలో జరగనున్న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభను విజయవంతం చేయాలని గ్రామ శాఖ అధ్యక్షులు, మొదలు మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంపిలకు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. మల్లికార్జున ఖర్గే

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS


## ఐఏఇఏతో కటీఫ్ ఉత్తర్వుపై ఇరాన్ అధ్యక్షుడు సంతకం



టెహ్రాన్ : ఐక్యరాజ్యసమితి అనుబంధ అణుశక్తి పర్యవేక్షణ సంస్థ (ఐఏ ఇఏ)తో సహకారాన్ని రద్దుచేసుకుంటున్నట్లు ప్రకటించిన ఇరాన్ బుధ వారంనాడు ఈ మేరకు ఒక ఉత్తర్వు జారీ చేసింది. అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ ఈ ఉత్తర్వుపై సంతకాలు చేశారు. ఐఏఇఏ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని ఇరాన్ విమర్శించింది. ఇజ్రాయెల్-అమెరికా దేశాలు అసాధారణ రీతిలో ఇరాన్ అణుస్థావరాలపై దాడులు చేసిన 12 రోజుల యుద్ధం తర్వాత, ఐఏఇఏతో సంబంధాలను రద్దుచేసుకుం టామని ఆ దేశ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి ప్రకటించారు.గతవారంలో ఇరాన్ పార్లమెంటు ఐఏఇఏను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఒక తీర్మానం చేసింది. దాని కొన సాగింపుగా దేశాధ్యక్షుడు ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఉక్రేన్‌లో యుద్ధం ఆపండి
## కారణం పశ్చిమదేశాలే కదా

### పుతిన్‌-మేక్రాన్ మధ్య రెండు గంటలు ఫోన్ సంభాషణ



మాస్కో: రెండున్నర సంవత్సరాల తర్వాత మొదటిసారి ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మళ్ళీ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా అనేక ప్రపంచిక విషయాలను వారు చర్చించారు. వారిద్దరు రెండు గంటలసేపు సుదీర్ఘ ఫోన్ సంభాషణ కొనసాగింది. ఉక్రేన్‌లో కాల్పుల విరమణ పాటించాలని ఈ సందర్భంగా పుతిన్‌ను మేక్రాన్ కోరారు. ఐతే కాల్పుల విరమణకు పశ్చిమదేశాలే ప్రధాన ఆటంకంగా ఉన్నాయని, ఈ యుద్ధానికి పశ్చిమదేశాలే ప్రధాన కారణమని వెంటనే పుతిన్ ఆయనకు తెలియజేశారు. ఉక్రేన్ సార్వభౌమాధికారానికి, ప్రాదేశిక సమగ్రతకు ఫ్రాన్స్‌దేశం గట్టి మద్దతు ఇస్తుందని మేక్రాన్ ఆయనకు చెబుతూ రెండు దేశాలు చర్చలకు రావాలని కోరారు. సంప్రదింపుల ద్వారా ఒక స్థిరమైన, కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవాలని పుతిన్‌ను ఆయన కోరారు. పశ్చిమ దేశాలు అనుసరిస్తున్న విధానాల ప్రత్యక్ష పర్యవసానమే ఉక్రేన్‌లో యుద్ధమని పుతిన్ ఆయనకు తెలియజేశారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికా సాగించిన 12 రోజుల యుద్ధం పూర్తయిన వారం రోజుల తర్వాత వీరిమధ్య జరిగిన సంభాషణలో ఇరాన్ విషయం కూడా ప్రధానంగా చర్చకు వచ్చింది. ఇరాన్‌కు యురేనియం శుద్ధిచేసుకునే హక్కు ఉందని మేక్రాన్‌కు పుతిన్ స్పష్టం చేశారు. శాంతియుత ప్రయోజనాలకోసం అణుశక్తిని ఎవరైనా ఉపయోగించుకోవచ్చునని, ఇరాన్‌కు ఆ హక్కు ఉందని పుతిన్ ఉద్ఘాటించారు. ఫ్రాన్స్ చొరవతోనే, వారి అభ్యర్థన మేరకు పుతిన్‌తో మేక్రాన్ టెలిఫోన్ సంభాషణ జరిగిందని రష్యా అధ్యక్షుడి అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ ఉటంకిస్తూ టాస్ వార్తాసంస్థ బుధవారంనాడు ప్రకటించింది. 2022 వ సంవత్సరం వరకు రష్యా-ఫ్రాన్స్‌దేశాల అధ్యక్షులు నిరంతరాయంగా టెలిఫోన్ ద్వారా అనుసంధానంలో ఉండేవారు. కానీ ఉక్రేన్‌లో యుద్ధం ప్రారంభమైన తర్వాత పుతిన్‌తో మేక్రాన్ ఈ సంబంధాలను వదులుకున్నారు. కానీ ఇప్పుడు ఆకస్మికంగా ఫ్రాన్స్ ప్రభుత్వం అభ్యర్థన మేరకే పుతిన్‌తో మేక్రాన్ సంభాషణ జరిగిందని దిమ్రిత్రీ పెస్కోవ్ చెప్పారు. జులై ఒకటో తేదీన నాయకులిద్దరిమధ్యా ఈ ఫోన్ సంభాషణ జరిగిందని ఆయన చెప్పారు. నాయకులిద్దరిమధ్యా సంభాషణలు కేవలం లాంఛనపూర్వకంగానే జరిగాయని ఇటు క్రెమ్లిన్, అటు ఎలైసీ ప్యాలెస్‌లు అధికారిక ప్రకటనలు చేశాయి.

## షేక్ హసీనాకు ఆరు నెలల జైలు



ఢాకా: పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా కోర్టు విచారణ ప్రక్రియకు ఆటంకం కలిగించి ఉల్లంఘన నేరానికి పాల్పడిందనుకున్నారు ఆమెకు ఢాకాలోని ఐసిటి ఇంటర్నేషనల్ క్రిమినల్ ట్రిబ్యునల్ ఆరునెలల జైలుశిక్ష ప్రకటించింది. బంగ్లాదేశ్‌లో ఆమె చేసిన నేరాలకుగాను ఒకవైపు విచారణ ప్రక్రియ కొనసాగుతుండగా హసీనా చేసిన వ్యాఖ్యలను ఉల్లంఘన చర్యగా ఐసిటి పరిగణించింది. జస్టిస్ మొర్తుజా మొజుందార్ సారథ్యంలోని ముగ్గురు సభ్యుల ఐసిటి ధర్మాసనం పైవిధంగా స్పందించింది. షేక్ హసీనా ఫోన్ సంభాషణలు బయటకు పొక్కాయి. అవన్నీ సోషల్ మీడియాలోకి అప్‌లోడ్ అయ్యాయి. వీటిని ఐసిటి క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఆమె వ్యాఖ్యలను కోర్టు ప్రక్రియను అణగదొక్కే చర్యగా, ఉల్లంఘన చర్యగా పరిగణించి ఆరునెలలు జైలుశిక్ష విధిస్తున్నట్లు మొజుందార్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం బుధవారంనాడు తీర్పు చెప్పింది. ''నాపై 227 కేసులు నమోదయ్యాయి, అంటే నేను 227 మంది హత్య చేయడానికి లైసెన్స్ లభించింది'' అని బయటకు పొక్కిన ఫోన్ సంభాషణలో హసీనా చెబుతున్నట్లు సోషల్ మీడియా ద్వారా తెలుస్తున్నది. గోవింద్ గంజ్ ఉపజిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు షకీల్ అకాండ బుల్బుల్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ హసీనా పై వ్యాఖ్యలు చేసిన వీడియోలు, వాయిస్‌లు సోషల్ మీడియాకు ఎక్కాయని చెబుతున్నారు. ఈ వ్యాఖ్యలు కోర్టును అణగదొక్కే హసీనా ప్రత్యక్ష చర్యలుగా ఐసిటి న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీన చీఫ్ ప్రాసిక్యూటర్ తజుల్ ఇస్లామ్ హసీనా వ్యాఖ్యలను కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆ గొంతు హసీనాదే అని క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ కూడా ధ్రువీకరించిందని ఆయన ఐసిటికి చెప్పారు.

### రాజకీయ దురుద్దేశంతోనే నాపై నేరాలు మోపారు:హసీనా

మానవత్వానికి వ్యతిరేకంగా దారుణ హత్యలకు పాల్పడినట్లు ఐసిటిలో చేసిన అభియోగాలను బంగ్లాదేశ్ మాజీ ప్రధాన మంత్రి షేక్ హసీనా తిరస్కరించారు. తాను ఎలాంటి నేరాలకు పాల్పడలేదని పేర్కొన్నారు. ఆమె తరపున వాదనలు చేయడానికి బంగ్లాదేశ్ ప్రభుత్వం నియమించిన న్యాయవాది ఈ విషయం వెల్లడించారు. గత ఏడాది జులైలో విద్యార్థుల తిరుగుబాటు సందర్భంగా 1,400 మందిని హతమార్చినట్లు ఐక్యరాజ్యసమితి తన నివేదికలో పేర్కొంది. అధికారం నిలబెట్టుకోవడంకోసం విద్యార్థుల ఉద్యమాన్ని అణిచివేయాలని ఆమె ప్రభుత్వం జారీ చేసిన విఫల ఉత్తర్వుల సమయంలో ఈ మరణాలు సంభవించాయని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. అనుకూల పరిస్థితులు, కోసం, కుట్ర, ప్రేరేపణ, సామూహిక హత్యల నివారణలో వైఫల్యం వంటి అభియోగాలను హసీనాపై మోపారు. ఇవన్నీ మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరాలుగా ఐసిటి పరిగణించింది. బంగ్లాదేశ్‌లో నిషేధానికి గురైన ఆమె పార్టీ అవామీలీగ్ సోమవారంనాడు లండన్‌లో ఒక ప్రకటన చేస్తూ, రాజకీయ దురుద్దేశాలతో, తమకు అనుకూలంగా ఒక సానుకూలమైన వాతావరణం ఏర్పాటు చేసుకోవడంకోసం తమపై ఈ విధంగా నేరాలు మోపారని ఆ ప్రకటన పేర్కొంది.

## గాజాలో దాడుల్లో ఇండోనేసియా ఆసుపత్రి డైరెక్టర్ కుటుంబం మృతి

గాజా: గాజాలో ఇజ్రాయెల్ బుధవారం ఉదయం నుండి చేసిన దాడుల్లో 43 మంది పాలస్తీనియన్లు మరణించారు. ఈ దాడుల్లో గాజాలో ఉన్న ఇండోనేసియా ఆసుపత్రి డైరెక్టర్ మార్వాన్ అల్ సుల్తాన్ సహా ఆయన మొత్తం కుటుంబం హతమైంది. మృతుల్లో అల్ సుల్తాన్‌తోపాటు ఆయన భార్య పిల్లలు కూడా ఉన్నారు. గాజా సిటీ నైరుతీ ప్రాంతంలో ఉన్న ఆయన నివాసిత భవనంపై గగనతల దాడులు చేయడంతో ఆయన కుటుంబం హతమైంది. గాజాలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు బాహ్య ప్రపంచానికి తెలియజేయడంలో మార్వాన్ అల్ సుల్తాన్ ప్రధానపాత్ర పోషిస్తున్నారు. గాజాలోకి విదేశీ జర్నలిస్టులను అనుమతించడంలేదు. ఇండోనేసియా ఆసుపత్రిని ఇజ్రాయెల్ సైన్యం దిగ్బంధనం చేసింది, గాజాలో ఉన్న జర్నలిస్టులకు, వైద్య సేవకులకు పూర్తి భద్రత ఇవ్వాలని ఆయన పదే పదే బాహ్య ప్రపంచానికి విజ్ఞప్తులు చేస్తూ వస్తున్నారు. ఇదిలా ఉండగా తుల్కెరామ్ శరణార్థ శిబిరం వద్ద 400 పాలస్తీనా కుటుంబాలు సమీకృతమయ్యాయి. శిథిలాల నుండి తమ నివాసాలను పునరుద్ధరించుకునేందుకు వారు ప్రయత్నం చేస్తున్నారు. వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెలీ దళాల ఆదేశంతో 100 ఇళ్ళు కూల్చేశారు. 400 కుటుంబాలు నిరాశ్రయమయ్యాయి. 2023 అక్టోబరు ఏడో తేదీన గాజాలో మొదలైన యుద్ధం ఈ బుధవారంనాటికి 635వ రోజుకు చేరుకుంది.

## అమెరికా పర్యటనకు వీలుగా నెతన్యాహూకు ఇజ్రాయెల్ కోర్టు క్లియరెన్స్



టెల్‌అవీవ్ : ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ వచ్చేవారం అమెరికా పర్యటనకు వెళ్ళడానికి ఆటంకాలన్నీ తొలగిపోయాయి. స్వదేశంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నెతన్యాహూ తప్పనిసరిగా కోర్టుకు రావాల్సిందేనని తొలుత హుకుం జారీ చేసిన న్యాయస్థానం తర్వాత తన పట్టుసడలించి, జాతీయ అత్యవసర వ్యవహారాలు చక్కబెట్టాల్సిన బా ధ్యతలున్నందువల్ల ఈ అనుమతి మంజూరు చేసింది. క్రిమినల్ కేసు విచారణ నిమిత్తం జెరూసలెం జిల్లా కోర్టుకు వచ్చేవారం నిర్ణీత ప్రకారం నెతన్యాహూ హాజరుకావాల్సి ఉంది. సాక్ష్యం ఇచ్చేందుకు కోర్టుకు రాకుండా న్యాయస్థానం ఆయనకు అనుమతి ఇచ్చింది. గాజాలో కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి కీలకమైన చర్చలు ఉన్నందువల్ల ఆయన అమెరికా పర్యటన చేయాల్సి ఉం దని నెతన్యాహూ కార్యాలయం కోర్టును కోరింది. వచ్చే ఆదివారం నుండి మంగళవారం వరకూగానీ లేదా శు క్రవారంగానీ నెతన్యాహూ అమెరికా పర్యటన ఉం టుందని ఆయన అటార్నీ అమిత్ హదద్ చెప్పారు. పర్యటన సందర్భంగా ట్రంప్‌తోపాటు అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్, విదేశాంగమంత్రి మార్కో రుబియో, మధ్యప్రాచ్య వ్యవహారాల ప్రత్యేక ప్రతినిధి విట్‌కాఫ్, రక్షణమంత్రి పెటే హెగ్సెత్, ఇతర సీనియర్ కాంగ్రెస్ సభ్యులతో నెతన్యాహూ చర్చలు జరుపుతారు. అందువల్ల అటూ ఇటూగా దాదాపు ఒక నెల రోజులపాటు ఆయన స్వదేశంలో కోర్టు వ్యవహారాలకు దూరంగా గడిపేందుకు అవకాశాలు ఉన్నాయి.

## ఎక్కువ బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

రూ.50 లక్షలు, తీవ్రంగా గాయపడి వికలాంగులుగా మారిన ప్రతి వ్యక్తికి రూ.5 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ బుధవారం ఒక పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ఈ ప్రమాదాలకు యజమానులు మాత్రమే కాకుండా, ప్రభుత్వాలే ఎక్కువ బాధ్యత వహించాలని ఆమె డిమాండ్ చేశారు. పని ప్రదేశాలలో భద్రతపై అంతర్జాతీయ కార్మిక సంఘం (ఐఎల్ఒ) 155, 188 సదస్సుల తీర్మానాలను ఆమోదించాలని, కారిత్రాఏక చట్టాలను రద్దు చేయాలని అమర్‌జీత్ కౌర్ డిమాండ్ చేశారు. గత పదకొండు సంవత్సరాలుగా మోడీదీ ప్రభుత్వం ( ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (సులభతర వ్యాపారం) పేరుతో యజమానులకు లాభం చేకూర్చే విధంగా, కార్మికులకు వ్యతిరేకంగా కార్మిక చట్టాలను నీరుగార్చిందని విమర్శించారు. తనిఖీలను రద్దు చేయడం, యజమానుల ఉల్లంఘనలను నేరరహితం చేయడం, పనిగంటలను పెంచడం, సమ్మె హక్కును లాగేసుకోవడం వంటి చర్యలు పాల్పడిందని అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం నిరభ్యంతర పత్రం(ఎన్ఒసి) పొందడంలో సడలింపులు ఇవ్వడమే కాకుండా, కార్మికుల హక్కులను, పారిశ్రామిక సంస్థల పరిసరాల్లో నివసించే ప్రజల జీవితాలను విస్మరించి ఈ చట్టాలపై కొన్ని సంవత్సరాలు మారటోరియం కూడా విధించిందని తెలిపారు. నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కార్మికులను గినియా పిగ్‌లుగా పరిగణిస్తోందని, కార్మిక చట్టాల మార్పులన్నీ పని ప్రదేశాలలో జరుగుతున్న ఉల్లంఘనలను చట్టబద్ధం చేయడానికి ఉద్దేశించినవని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక, దేశ వ్యతిరేక ప్రభుత్వ విధానాలకు నిరసనగా జూలై 9న జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయడానికి, నిరంతర పోరాటాలను కొనసాగించడానికి కార్మిక వర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

## అధ్యయన నివేదిక సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యతలను ఐఇడబ్ల్యుజికి అప్పగించింది. డాక్టర్ మర్రి చెన్నా రెడ్డి మానవ వనరుల సంస్థ (ఎంసిహెచ్ఆర్‌డి)లో బుధవారం కమిటీ చైర్మన్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కమిటీ సమావేశంలో నివేదికకు తుది రూపమిచ్చారు. కుల గణనలో పేర్కొన్న 242 కులాల వెనుకబాటుతనానికి సంబంధించి 'కంపొజిట్ బ్యాక్‌వర్డ్‌నెస్ ఇండెక్స్ (సిబిఐ) సూచీని నివేదికలో పొందుపర్చింది. మొత్తం 300 పేజీలకుపైగా రూపొందించిన నివేదికలో 242 కులాల వారీగా వెనుకబాటుపై సిబిఐ స్కోర్, ర్యాంకులను సూచించింది. మరో వారం రోజుల్లో నివేదిక సిద్ధమవుతుందని, నివేదికను అందించడానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను కమిటీ సమయం కోరిందని కమిటీ ఒక ప్రకటనలో తెలియజేసింది. సమావేశంలో కమిటీ వైస్ చైర్మన్ కంచ ఐలయ్య, కన్వీనర్ ప్రవీణ్ చక్రవర్తి, సభ్యులు ప్రొఫెసర్ శాంతా సిన్హా, డాక్టర్ సుఖ్దేవ్ థొరోట్, డాక్టర్ హిమాన్షు, నిఖిల్ డే, ప్రొఫెసర్ భాంగ్య భుక్య, ప్రొఫెసర్ పురుషోత్తమ్ రెడ్డి, రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కమిటీ కార్యదర్శి అనుదీప్ దూరిశెట్టి పాల్గొన్నారు.

## బాధ్యత కలెక్టర్లదే (మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నాకూడా దాని ప్రభావం ఈ పథకంపై పడకుండా ప్రతి సోమవారం నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. లబ్దిదారుల ఎంపిక, ఇండ్ల మంజూరు, నిర్మాణ పనుల పర్యవేక్షణ. ఈ మూడు అంశాలను కలెక్టర్లు పకడ్బందీగా పర్యవేక్షించాలని సూచించారు. అనర్హులని తేలితే ఇంటి నిర్మాణం మధ్యలో ఉన్నాకూడా రద్దు చేయడానికి వెనుకాడ వద్దని ఆదేశించారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఒక్కో ఇంటికి 40 మెట్రిక్ టన్నుల ఇసుక అందేలా పర్యవేక్షించాలని, అలాగే ఇంటి నిర్మాణానికి అవసరమైన స్టీల్, సిమెంట్ ఇటుకల కోసం మండల స్థాయిలో ధరల నియంత్రణ కమిటీలను ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, వీలైనంత త్వరితగతిన ఈ కమిటీలు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలి' అని సూచించారు.

## కాల్పుల విరమణ (మొదటి పేజీ తరువాయి)

ఈజిప్టు ప్రభుత్వాలు స్వీకరించాయని ట్రంప్ పేర్కొన్నారు. ''మధ్యప్రాచ్యానికి ఇక మంచి జరుగుతుందని నేను ఆశాభావంతో ఉన్నాను. హమాస్ ఈ ఒప్పందాన్ని అంగీకరించాలి, ఎందుకంటే ఇంతకంటే మంచి అవకాశం, మేలైన అవకాశం హమాస్‌కు లభించదు, దీనిన్ని వారు చెడగొట్టుకోకూడదు'' అని ట్రంప్ రాశారు. అనేక నెలలుగా ఈ తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందంపై కసరత్తు జరుగుతోందని ఆయన తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు. యుద్ధాన్ని తిరిగి చేపట్టగలశక్తిసామర్థ్యాలు తమకు ఉన్నాయని ఇజ్రాయెల్ చెబుతుండగా, ఈ తాత్కాలిక కాల్పుల విరమణను శాశ్వతం చేయాలని చాలాకాలంగా హమాస్ కోరుతున్నది. దీంతో 21 నెలలుగా గాజాలో సాగుతున్న మారణహోమం అంతమయ్యేందుకు శుభఘడియలు సమీపించాయని భావిస్తున్నారు. ఐతే ఒప్పందం కుదరడానికి ఇంకా కొన్ని ముఖ్యమైన ఆటంకాలను తొలగించాల్సి ఉందని అరబ్‌దేశాల మధ్యవర్తులు చెబుతున్నారు. నిర్ణీత ప్రకారం నెతన్యాహూ వచ్చేవారం వాషింగ్టన్ పర్యటనకు సన్నద్ధం అవుతున్నారు. గాజాలో యుద్ధ విరమణకు తాను చాలా చాలా కృతనిశ్చయంతో ఉన్నానని ఇటీవల అనేకసార్లు ట్రంప్ ఉద్ఘాటనలు చేస్తున్నారు. ఇంతకుముందు కూడా ఈ ఏడాది మార్చి ఒకటో తేదీ వరకూ 45 రోజులపాటు ఇజ్రాయెల్‌-హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం విమర్శలు, పరస్పర ఆరోపణలమధ్య బలవంతంగా అమలు జరిగింది. ఆ తర్వాత కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించేందుకు మళ్ళీ చర్చలు జరిపేందుకు రావాలని హమాస్ ప్రతిపాదించినప్పటికీ ఇజ్రాయెల్ తిరస్కరించింది. ఎలాంటి చర్చలూ లేకుండా కాల్పుల విరమణను యథాతథంగా కొనసాగించాలని చేసిన ప్రతిపాదనను హమాస్ తిరస్కరించింది. ఇక తర్వాత మార్చి రెండో తేదీ నుండి గాజాలోకి అంతర్జాతీయంగా అందుతున్న మానవతా సహాయాన్ని అనుమతించకుండా ఇజ్రాయెల్ అడ్డుకుని పాలస్తీనాలో కరువుకాటకాలకు ఆజ్యం పోసింది. విరామం తర్వాత మార్చి 18వ తేదీ నుండీ గాజాలో మళ్ళీ యుద్ధం ప్రారంభించి ఇప్పటివరకూ దాదాపు ఆరువేలమందిని హతమార్చింది. 2023 అక్టోబరు 7వ తేదీన యుద్ధం మొదలైన తర్వాత ఇప్పటివరకు 56 వేలమందిపైగా పాలస్తీనియన్లు మరణించారు. మరో 14వేలమంది శిథిలాల్లో కూరుకుని మరణించారని అంతర్జాతీయ అధ్యయన సంస్థలు అంచనావేశాయి.ఈ బుధవారంనాటితో ఇజ్రాయెల్ – హమాస్ మధ్య గాజాలో యుద్ధం 635 రోజులు పూర్తిచేసుకుంది.

## మృతుల లెక్క తేలలే

(మొదటి పేజీ తరువాయి)

పనిచేస్తున్న కార్మికుల లెక్కలకు పొంతన కుదరడం లేదు. ఇం కా పదుల సంఖ్యలో కార్మికుల ఆచూకి లభ్యం కావడం లేదు. దీంతో భాదిత కుటుంబ సభ్యులు పరిశ్రమ వద్ద ఆందోళన కొనసాగిస్తునే ఉన్నారు. వారి ఆ చూకి తెలపాలంటూ అధికారులకు ప్రాధేయపడుతున్నారు. మంగళవారం రాత్రి నుంచి భారీ వర్షం కురుస్తుండడంతో సహాయ చర్యలకు తీవ్ర అటంకం ఏర్పడడంతో తాత్కాలికంగా సహాయక చర్యలను నిలిపి వేశారు. బుదవారం ఉదయం నుంచి రెస్క్యూ టీం పనులు మొదలు పెట్టారు . శిథిలాల కింద ఇంకా కార్మికులున్నారని భావిస్తున్నారు. అయితే అధికారికంగా 40 మంది చనిపోయినట్లు అధికారులు ప్రకటించిన మరణాల సంఖ్య అంతకు మించి ఉందని అధికారులు చెప్పుతున్నా లెక్కకు బయట జరుగుతున్న పరిస్థితులకు పొంతన కుదరడం లేదని భాదిత కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుదవారం రాత్రి వరకు ప్రమాదానికి సంబందించిన పూర్తి వివరాలు బయటకు వచ్చే అవకాశముందని అధికారులు చెపుతున్నారు.

### సహాయక చర్యలు కొనసాగుతున్నాయి : దామోదర్ రాజనర్సింహా

సిగాచి పరిశ్రమ వద్ద వేగంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ఏ మాత్రం నిర్లక్ష్యం చేయడం లేదని మంత్రి దామోదర్ రాజనర్సింహా భాదిత కుటుంబాలకు తెలిపారు. బుదవారం ఉదయం ఆయన సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న క్రమంలో మంత్రిని భాదిత కుటుంబాలు,బందువులు పెద్ద సంఖ్యలో పరిశ్రమ వద్దకు చేరుకుని అడ్డుకున్నారు విదులకు హాజరై ఆచూకి లేకుండా పోయిన కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. తమ వారి ఆచూకి గురించి అధికారులు సరైన సమాచారం ఇవ్వడం లేదని బాధితులు పెద్ద ఎత్తున ఆందోళన చేసారు. మూడు రోజులు గడుస్తున్నా తమ వారి గురించి సమాచారం ఇవ్వడం లేదని బోరున విలపించారు. పోలీసులు అడ్డుకోవడంతో అందోళనకు దిగారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ సహాయక చర్యలు పర్యవేక్షించారు. కలెక్టర్ ప్రావీణ్య ,ఎస్పీ పరితోష్ ఫంకజ్‌కు పలు సూచనలు ఇచ్చారు. ప్రమాదానికి గల కారణాలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. బాదిత కుటుంబాలను ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి నచ్చ చెప్పారు. ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

### మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం

తమ కంపెనీలో జరిగిన ఘోర ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున పరిహారం అందజేస్తామని సిగాచి కంపెనీ (సెక్రటరీ వివేక్ కుమార్) యాజమాన్యం వెల్లడించింది. పరిశ్రమలో పేలుడు జరిగిన మూడు రోజులకు యాజమాన్యం స్పందించింది. ఈ దుర్ఘటనలో 40 మంది కార్మికులు మృతి చెందగా 35 మంది వరకు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారని యాజమాన్యం ప్రకటించింది. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్‌కి యాజమాన్యం లేఖ వ్రాసింది. రియాక్టర్ పేలి ప్రమాదం జరగలేదని పూర్తి విచారణ తరువాత ఎందుకు .. ఏలా ఈ ప్రమాదం జరిగిందో వెల్లడిస్తామని పేర్కొన్నది. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుల వైద్య ఖర్చులు యాజమాన్యం భరిస్తుందన్నారు. మంగళవారం ఘటన స్థలాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించి పరిశ్రమ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేసారు. కంపెనీ యాజమాన్యం ఎక్కడ ఉన్నదని , అధికారులు ఏమి చేస్తున్నారని మండిపడ్డారు. మానవత్వ కోణంలో నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కాగా ముఖ్యమంత్రి ఆగ్రహంతో దిగి వచ్చిన యాజమాన్యం రూ. కోటి రూపాయాల చొప్పున పరిహారం ప్రకటించింది. .

### భాదితులను పరామర్శించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఏఐసీసీ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ ,పిసీసీ చీప్ మహేష్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, పిసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, పిసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డిలు మొదటగా ఆసుపత్రి లో చికిత్స పొం దుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరిశ్రమ వద్దకు వచ్చి సహాయక చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారు.

## నిపుణుల కమిటీ ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీ సిగాచి కంపెనీలో చోటు చేసుక్న ప్రమాదానికి గల కారణాలతో పాటు కంపెనీలో భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నారా లేదా తదితర అంశాలను క్షుణంగా అధ్యయనం చేసి నెల రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక అందజేయనుంది. అదేవిధంగా భవిష్యత్‌లో కెమికల్ కంపెనీల్లో ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండ ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలను సూచించాల్సిందిగా ప్రభుత్వం కోరింది. ఈ కమిటీకి కావాల్సిన సహాయ సహకారాలను అందించాలని డైరెక్టర్ ఆఫ్ ప్యాక్టరీస్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

## కొత్త రేషన్‌కార్డులు

(మొదటి పేజీ తరువాయి)



కనెక్షన్లకు సంబంధించి విద్యుత్ శాఖ అధికారులు శాసనసభ్యుల విజ్ఞప్తుల మేరకు సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి పక్షం రోజులకు ఒక సారి సమీక్ష సమావేశం నిర్వహించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాడ ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 14న రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా తుంగతుర్తి నియోజకవర్గం, తిరుమలగిరిలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అప్పటివరకు రేషన్ కార్డుల కై వచ్చిన దరఖాస్తులన్నింటిని ఈనెల 13 లోగా పరిశీలించి అర్హులైన వారందరినీ ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఎస్ఎల్బీసీ పనుల పునః ప్రారంభానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని, భారత సైన్యం లో పనిచేసిన అధికారులను డిప్యూటేషన్ పై తీసుకొని ఎలక్ట్రో మాగ్నెటిక్ లీడర్ సర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డిండి,హెచ్ ఎల్ సి లైనింగ్ , నెల్లికల్ లిఫ్ట్ ఇరిగేషన్ బునియాధిగాని కాలువ, పిల్లాయిపల్లి కాలువ, ధర్మారెడ్డి కాలువలను పూర్తి చేస్తామని అయితే వీటి భూసేకరణను పూర్తి చేసే విషయంపై శాసనసభ్యులు దృష్టి నిలపాలని కోరారు. అధికారులు ఆయా పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో అవినీతికి ఆస్కారం లేకుండా చూడాలని, నిజాయితీ, పారదర్శకతతో ప్రజలకు కనిపించేలా పని చేయాలని, నెలలో రెండుసార్లు సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

### ఎస్ఎల్ బిసి, టన్నెల్ పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తాం : మంత్రి కోమటిరెడ్డి

రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆర్అండ్‌బి ద్వారా జిల్లాకు ఎక్కువ నిధులు తేవడం జరిగిందని, భవిష్యత్తులో మరిన్ని నిధులు ఇచ్చేందుకు కృషి చేస్తానని 45 కోట్లతో సంగెం బ్రిడ్జికి మంజూరు ఇవ్వడం జరిగిందని, నల్లగొండ మల్లేపల్లి దేవరకొండ రహదారులను హామ్ రోడ్ కింద మంజూరు చేశామని,రాష్ట్రవ్యాప్తంగా 1200 కోట్ల రూపాయలతో అన్ని మండల కేంద్రాల నుండి జిల్లా కేంద్రాలకు హాం పథకం కింద డబుల్ రోడ్ల నిర్మాణానికి మంజూరు చేయడం జరిగిందని, పంచాయతీరాజ్ రోడ్లను సైతం హామ్ కింద కు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎల్ బిసి, టన్నెల్ పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని,ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ పై ప్రత్యేకంగా రివ్యూ చేస్తామని ,ఇన్చార్జి మినిస్టర్ జిల్లాకు ఎక్కువ సమయం కేటాయించాలని, ప్రాథమిక వైద్యం, విద్య ప్రభుత్వానికి అతి ముఖ్యమైనవని, వీటిపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని కోరారు.ఎస్డిఎఫ్ కింద ప్రతి ఎమ్మెల్యేలకు తక్షణమే ఐదు కోట్ల రూపాయలు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని , ఇందుకు సంబంధించి టోకెన్లు రైజ్ చేయాలని ఎమ్మెల్యేలతో కోరారు. నల్లగొండ ఎంపి కుందూరు రఘువీర్ రెడ్డి,భువనగిరి పార్లమెంట్ సభ్యులు చమల కిరణ్ కుమార్ రెడ్డి,ప్రభుత్వ విప్,ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య,భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి,నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి,దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్,నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం,నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, నీటిపారుదల ,విద్య, వ్యవసాయం, వైద్యం ,ఆరోగ్యం, భూభారతి, మహిళా శక్తి, సంక్షేమం తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశానికి వివరించారు.ఈ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ,రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి ,మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ,నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



### బేస్మెంట్ నిర్మించుకున్న వారికి సడలింపు ఇవ్వాలే

ఫార్మా కంపెనీల అనుమతులు రద్దు చేయాలి : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

గత ప్రభుత్వంలో వివక్షతకు,నిర్లక్ష్యం గురైన సాగు నీటి ప్రాజెక్టుల పూర్తి చెయాడనికి ప్రజా ప్రభుత్వంలో జిల్లాలకు చెందిన ఇద్దరు మంత్రులు కోమటిరెడ్డి వెంకట రెడ్డి,ఉత్తమ్ కుమార్ రెడ్డిల భుజస్కందాల పైన ఉందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో సత్యం మాట్లాడుతూ బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ద్వారా మునుగోడు మండలం కిష్టాపురం వరకు నీరు అందించేందుకు భూ సేకరణ పనులు పూర్తి కావడం జరిగిందని కిష్టాపురం వరకు నీరు అందించాలని కోరారు. మునుగోడు నియోజకవర్గం పరిధి లోని శివన్నగూడెం ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులు రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందలేదని వారికి నష్ట పరిహారం అందించాలని కోరారు. అదేవిధంగా ఫ్లోరైడ్‌తో దశాబ్దాలుగా పోరాటం చేసిన మునుగోడు ప్రాంతాని నాశనం చేసేందుకు మరోవైపున ఫార్మా కంపెనీలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయని వాటి అనుమతులు రద్దు చేయాలని కోరారు. కిష్టాపురం గట్టుప్పల తదితర ప్రాంతాలలో నిర్మాణం చేసే ఫార్మా కంపెనీలకు వ్యతిరేకంగా ఆ ప్రాంత ప్రజల ఉద్యమాలు చేస్తున్నారని,పరిధిలో గల చౌటుప్పల్,పంతంగి చుట్టుపక్కల గ్రామాలైన వెలిమినేడు,గుండ్రాంపల్లి లాంటి గ్రామాలలో ఇప్పటికే కంపెనీలు వెలసి భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయని పేర్కొన్నారు.గత పది సంవత్సరాలుగా నిరుపేదలకు ఇండ్లు రాలేదని కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇస్తున్న ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలు పారదర్శకంగా జరిగినప్పటికీ కొంతమంది నిరుపేదలు ఇప్పటికే ఇండ్ల నిర్మాణానికి బేస్మెంట్ నిర్మించుకోవడం జరిగిందని అలాంటి వారికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఆంక్షలు సడలింపాలని కోరారు. సంస్థాన్ నారాయణపురం మండల ప్రాంతంలో ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత తీవ్రంగా ఉందని వాటి పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలన్నారు. రెండో విడత ఎక్కువ మందికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలన్నారు. జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రులలో పేదలను రకరకాల టెస్టుల పేరుతో విపరీతంగా డబ్బులు గుంజుకుంటున్నారని అలాంటి ఆసుపత్రుల పట్ల చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రైవేటు విద్యాసంస్థలలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల యజమానులు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి విపరీతంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని అధిక ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.





# జనరల్
STATE & REGIONAL NEWS

## హిందీ పుస్తక ప్రపంచంలో పండితురాలు విభా భారతి మృతి




**ప్రజాపక్షం/హైదరాబాద్:**మిలింద్ ప్రకాశన్ ప్రచురణ సంస్థ సంచాలకురాలు, హిందీ పుస్తక ప్రపంచంలో పండితురాలు, ప్రముఖ సమాజ సేవకురాలు విభా భారతి మంగళవారం కాచిగూడలోని ఆమె స్వగృహంలో మరణించారు. హైదరాబాదులో హిందీ పుస్తకాలకు చిరునామాగా ఉన్న మిలింద్ ప్రకాశన్ వ్యవస్థాపకులు శృతికాంత్ భారతి సతీమణి విభా భారతి. దేశవ్యాప్తంగా ప్రముఖ ప్రచురణ సంస్థల హిందీ పుస్తకాలను పంపిణీ చేస్తూ ప్రజల అందుబాటులోకి మిలింద్ ప్రకాశన్ సంస్థ తీసుకువచ్చింది.

**హైదరాబాదు బుక్ ఫెయిర్ సంతాపం:**విభా భారతి మరణంపట్ల హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ సంతాపాన్ని, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేసింది.

# దేవాలయాల వెలికితీతకు గ్రీన్ సిగ్నల్

* స్పెషల్ సెక్రటరి నేతృత్వంలో కమిటి
* పర్యవేక్షిస్తున్న మంత్రి కొండా సురేఖ





**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో శతాబ్దా ల క్రితం నుంచి వివిధ కారణాలతో కనుమరుగైన పురాతన, ప్రాచీన హిందూ దేవాలయాలను గుర్తించి, వెలికి తీసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కసరత్తు ప్రారంభించారు. త్వరలో ప్రధాన ప్రత్యేక కార్యదర్శి నేతృత్వంలో ఒక కమిటీ ని వేయనున్నారు. ఈ కమిటీలో దేవాదాయ శాఖతో పాటు మున్సిపల్ శాఖ, ఫైనాన్స్ శాఖ, ఇతర శాఖల ఉన్నతాధికారులు ఉంటారు. ఈ కమిటి తెలంగాణలోని అన్ని జిల్లాలో పర్యటించి కనుమరుగైన పురాతన, ప్రాచీన దేవాలయాలను గుర్తిస్తారు. ఆ దేవాలయాలు ఎందుకు కనుమరుగయ్యాయి, వాటి ప్రాముఖ్యత ఏమిటి, దూపదీప నైవేద్యాలకు అవి ఎందు కు నోచుకోలేదు, దశాబ్దాల నుంచి వాటిని ఇంతవరకు ఎందుకు గుర్తింపులోకి రాలేదు, ప్రస్తుతం వాటి ఆనవా ళ్లు, పరిస్థితులు, నిర్మాణాలు, పునరుద్ధరించేందుకు కావాల్సిన ఆర్థిక వనరులపై ఈ కమిటీ అధ్యాయ నం చేస్తుంది. ఆ తరువాత ఒక నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి అందించనుంది. ఈ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ శాఖ ఆలయాల పునరుద్దరణకు చర్యలు తీసుకోనుంది. నిజాం కాలం లో దాడులవల్ల తెలంగాణలో కొన్ని దేవాలయాలు ధ్వంసంఅయి కనుమరుగయ్యాయి. ఇలాంటి దేవాలయాలను గుర్తించి వాడుకలోకి తీసువస్తారు.

తెలంగాణలో ఇప్పటికే 6ఎ కింద (వంద కోట్లకు పైగా వచ్చే ఆదాయం) దేవాలయాలు రాజరాజేశ్వర దేవాలయం, వేములవాడ, కొండగట్టు, చిల్కూర్ బాలాజీ దేవాలయం, యాదగిరి గుట్ట దేవాలయం, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం, లక్ష్మీ నరసింహ ఆలయం ధర్మపురి, కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవాలయం, రంగనాథస్వామి దేవాలయం, జియాగూడ ఛాయా సోమేశ్వరాలయం, వర్గల్ సరస్వతి ఆలయం, శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయం, కీసరగుట్ట దేవాలయం, సురేంద్రపురి శ్రీ రంగనాయక స్వామి దేవాలయం ఉన్నాయి. అలాగే రూ.50 కోట్లనుంచి రూ. 100 కోట్ల వరకు ఆదాయం కలిగి ఉండే దేవాలయాలు సుమారు 16 వరకు ఉన్నాయి.

**సిఎస్ఆర్ నిధుల ద్వారా ఆలయాల అభివృద్ధి..?**

పురాతన ఆలయాల అభివృద్ధిలో కార్పొరేట్ సంస్థలను భాగస్వాములను చేయాలని దేవాదాయ శాఖ యోచిస్తున్నట్టు సమాచారం. రాష్ట్రంలో పురాతన ఆలయాలను గుర్తించి, వాటిని కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధులతో అభివృద్ధి చేసే అవకాశాలపై చర్చిస్తోంది. దేవాదాయ పురాతన ఆలయాలను గుర్తించిన తర్వాత ఆయా ఆలయాల ప్రత్యేకతలు, ప్రాముఖ్యతను గుర్తించి, వాటికి సిఎస్ఆర్ నిధులను అనుసంధానం చేయనున్నట్టు తెలిసింది. దీనికి సంబంధించిన కసరత్తు మొదలు పెట్టారు.దేవాదాయ శాఖ వివిధ సంస్థలతో కలిసి మరింత సంరక్షణ చర్యలు చేపడితే, రాష్ట్రంలోని ప్రాచీన సంపద మరోసారి వెలుగులోనికి తీసుకు రాగలదు. ప్రజల భాగస్వామంతో కొన్ని గ్రామాల్లో పై రూ.3 కోట్లను స్వయంగా సమకూర్చి 11 వ శతాబ్దపు పంచకుట శివాలయం తిరిగి నిర్మాణం జరిగింది..

**కనుమరుగైన కొన్ని దేవాలయాలు ఇవే..**

● పెద్దాపల్లి జిల్లా మంథనీలో 13వ శతాబ్దం కాకతీయ శిల్పకళను కలిగిన గౌతమేశ్వర దేవాల యం సహా పలు చిన్న పుణ్యక్షేత్రాలు గోడలు కూలిపోయాయి. విగ్రహాలు పగులగొట్టి ఉన్నాయి. శిల్పా లు శిధిలమయ్యాయి.

● ఖమ్మంపల్లిలో గోదావరి నదీ ఉడత ప్రాంతంలో ఉంది. మూడు ద్వారాల శివాలయం ఇది. ఇక్కడ విగ్రహాలు పడిపోయి ఉన్నాయి. కళ్లు, చేతులుపై భారీ ధ్వంసం జరిగింది .

● జగిత్యాల తాటిపెల్లి కొండ దేవాలయం.. దక్షిణచాళుక్యుల శిల్పకళను కలిగిన 9వ,10వ శతాబ్దపు నరసింహ స్వామి విగ్రహాలు కొండపై కనుగొనబడ్డాయి. దేవాలయం నిర్మాణం పూర్తిగా ధ్వంసం అయ్యింది. ఔత్సాహిక సంరక్షణ లేకపోవడంతో ఇప్పుడు ఓ రహస్య స్థితిలో ఉంది.

● రాజా మజిలి తరహాలో కాకతీయ కాల శివాలయాలు రంగారెడ్డి జిల్లాలో పురాతన స్థితిలో ఉన్నాయి; అక్కడి స్థానికులు పురాతత్వ శాఖతో కలిసి అభివృద్ధి ప్రయత్నాలు చేస్తున్నారు .

వీటితో పాటు హైదరాబాద్, దేవరకొండ, నల్గొండ, రంగారెడ్డి, వరంగల్ జిల్లాలలో పలు దేవాలయాలు కనుమరుగైన స్థితిలో ఉన్నాయి.

**కారణాలు ఇవే...**

యుద్ధాల పర్యవశాత్..భారత్‌లోని మంగోల్లు, బహ్మనీలు, కుతుబ్ షాహీలు ధ్వంస సమయంలో ఆలయాలు ధ్వంసం చేశారు .

ధన సంపాదన కోరిన విగ్రహ దొంగతనాలు.. 201120 దాకా స్కాండల్ కారణంగా ఆలయాలు దొంగిలించబడుతూ, కొన్నిసార్లు నష్టం కలిగింది .

రోడ్డు విస్తరణ, నిర్లక్ష్య సంరక్షణ.. కమ్యూనిటీ లేదా ప్రభుత్వ ఆధ్వర్యం లేక ఆర్కియాలజికల్ పరిరక్షణ లేకపోవడం వల్ల స్వాభావిక కారణాలతో శిల్పాలు పాడయ్యాయి.

# తెలంగాణ జీవన విధానంపై పరిశోధనలు

ఉస్మానియా విశ్వవిద్యాలయానికి కోటి రూపాయలు మంజూరు

విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులకు మంత్రి జూపల్లి కృష్ణారావు సూచన



**ప్రజాపక్షం/హైదరాబాద్:**తెలంగాణ సంస్కృతి, జీవన విధానంపై పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పరిశోధనలకోసం ఉస్మానియా విశ్వవిద్యాలయానికి తమశాఖ ద్వారా కోటి రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్ట్స్, సోషల్ సైన్సెస్‌లో విభిన్న అంశాల సంవాదం, సంభాషణ అనే అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జీవన విధానం గతితప్పడం ఎన్నో సమస్యలకు కారణమవుతుందన్న మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.

సామాజిక రుగ్మతలు, దురలవాట్లు, తాహతుకు మించిన ఆడంబరాల వల్ల కుటుంబాలు చితికి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థు లు, పరిశోధకులు, అధ్యాపకులు తెలంగాణ జీవన విధానంపై పరిశోధనలు జరిపి.... మార్పు తీసుకొచ్చే దిశగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వ నుంచి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మానవీయ, సామాజిక శాస్త్రాలలో పరిశోధనలు విస్తృతమైనప్పుడే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆకాంక్షించారు.

కార్యక్రమానికి చీఫ్ ప్యాట్రన్‌గా వ్యవహరించిన ఒయు ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం మాట్లాడుతూ... ప్రస్తుత పోటీ ప్రపంచంలో విభిన్న అంశాల్లో ప్రావీణ్యం పొందాల్సిన అనివార్యతను నొక్కి చెప్పారు. విద్యార్థులలో పరిశోధనాత్మక విలువలను పెంపొందింపజేసే పను లు చేస్తున్నందుకు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌ని ఈ సందర్భంగా అభినందించారు.

రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో మల్టీ డిసిప్లినరీ అత్యంత కీలకమని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ సైన్సెస్ డైరెక్టర్ ఆచార్య రేవతి అభిప్రాయపడ్డారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.కాశీం మాట్లాడుతూ సామాజికార్థిక విషయాలే కాకుండా విజ్ఞాన శాస్త్రాంశాలను కూడా సాహిత్యం సృజనాత్మకంగా చిత్రించిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో యుజిసి డీన్ ప్రొ.లావణ్య, వైస్ ప్రిన్సిపాల్స్ డా.కొండా నాగేశ్వరరావు, డా. బాలు నాయక్, డాపి. స్వాతి, డా సిఎస్. స్వాతిలతో పాటు వివిధ శాఖల అధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థు లు పెద్ద యెత్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసారు. ఆరువందలమంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి పరిశోధకులు వచ్చి వారి పరిశోధనా పత్రాలను సమర్పించారు. ప్రొఫెసర్ నాగేశ్వర్, ప్రొఫెసర్ గట్టు సత్యనారాయణ, ప్రొఫెసర్ మధుసూదన్, ప్రొఫెస ర్ పార్థసారధి, ఎన్ వేణుగోపాల్, డా. మామిడి హరికృష్ణ, ప్రొఫెసర్ కృష్ణ పాల్గొని మాట్లాడారు.

**ఎరువుల కొరత లేకుండా చూడాలి**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎరువుల కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు సమన్వయంతో పని చేయాలని, జిల్లా కలెక్టర్ల నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. జిల్లాల వారీగా విత్తనాలు, ఎరువులకు డిమాండ్ ప్రస్తుత నిల్వలు ఎంత అవసరం ఉంటుందనే అంశాలను పరిశీలించి ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. సరఫరా విషయంలో ప్రాథమిక సహకార సంఘం, మార్క్‌ఫెడ్ శాఖల వద్ద ఎలాంటి జాప్యం జరగకూడదని అన్నారు.

వ్యవసాయ విస్తరణాధికారులు.. ప్రభుత్వ, ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు చేసి, స్టాక్ ఉందో లేదో పరిశీలించాలని, ఇవాల్టి నుంచి ఎరువుల సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని చెప్పారు. డిమాండ అనుకూలంగా ఎరువులు సరఫరా చేయాలని, వ్యవసాయ శాఖ ప్రధాన కార్యాలయంతో సమన్వయం చేసుకోవాలని, ఇండెంట్ ప్రకారం స్టాక్ ఉండాలని, ఎక్కడైనా ఎరువుల కొరత ఉందని దృష్టికి వస్తే సంబంధిత వ్యవసాయాధికారిదే బాధ్యత అని స్పష్టంచేశారు.




న్యూఢిల్లీలో జరుగుతున్న సిపిఐ జాతీయ సమితి సమావేశంలో బుధవారం ప్రసంగిస్తున్న జాతీయ సమితి సభ్యులు కె.శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్



## తెలంగాణ రైతులపై వివక్ష విడనాడాలి

తక్షణమే ఎరువులను సరఫరా చేయాలి : అన్వేష్‌రెడ్డి డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:**తెలంగాణ రైతులపై కేంద్ర ప్రభుత్వం వివక్షను విడనాడి తక్షణమే ఎరువులను పంపిణీ చేయాలని సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి తెలంగాణకు అన్ని సందర్భాల్లో వివక్ష చూపుతూనే ఉన్నారని తెలిపారు. హైదరాబాద్‌లోని హాకా భవన్‌లో బుధవారం ఉర్దూ అకాడమి చైర్మన్ తాహేర్ బిన్ హందాన్, రైతు నాయకులు నల్లమల వెంకటేశ్వర్లతో కలిసి అన్వేష్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రం రాష్ట్రానికి ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ నెలల్లో మొత్తం 5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించగా ఇందులో సగంకూడా సప్లై చేయలేదన్నారు. దీంతో రైతులకు సరిపడా ఎరువులు లేక అన్నదాతలు తీవ్ర ఇబ్బంది పడ్తున్నారని తెలిపారు. రాష్ట్రం నుంచి 8 మంది బిజెపి ఎంపిలు ఉండగా ఇందులో ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్నా కూడా దండగేనన్నారు. ఒక్కరంటే ఒక్కరు కూడా ఎరువుల సమస్యపై ఇప్పటివరకూ మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు.. తెలంగాణ నుంచి కేంద్రానికి ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రులా.. లేక మరో రాష్ట్రానికి చెందిన మంత్రులా? అన్న అనుమానం కల్గుతోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర రైతాంగానికి అశనిపాతంలా మారిన ఎరువుల సమస్యపై ప్రధాని మోదీ, కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా, వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లపై కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ఎందుకు ఒత్తిడి తీసుకురావడంలేదని ప్రశ్నించారు.. బిజెపి నాయకుల వైఖరి చూస్తుంటే.. రైతాంగాన్ని, వ్యవసాయాన్ని విధ్వంసం చేసి ఆ పాపాన్ని కాంగ్రెస్ మీదకు నెట్టేలా ఒక కుట్రపూరిత వైఖరి అవలంబిస్తోందన్న అనుమానం కలుగుతోందన్నారు. జెపి నడ్డా, శివరాజ్ సింగ్ చౌహాన్‌లపై తెలంగాణ బిజెపి ఎంపిలు ఒత్తిడి తీసుకువచ్చి రైతులు అవసరమైన ఎరువులను అందేలా చూడాలని అన్వేష్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# టిజిఎస్‌డిఎంఇ పునర్వ్యవస్థీకరణ

సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొని, వీలైనంత వరకు ప్రాణ, ఆస్థి నష్టం జరగకుండా ఉండే విధంగా 'తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ' (టిజిఎస్‌డిఎంఇ)ను పునర్వ్యవస్థీకరించినట్లు రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయిలో వర్షాలు, వరదలకు సంబంధించి, నీటి పారుదల, విద్యుత్, వైద్య ఆరోగ్య, వ్యవసాయం, పోలీస్, రవాణ తదితర విభాగాలకు ప్రత్యేక నోడల్ అధికారులను నియమిస్తున్నామని వెల్లడించారు. ప్రకృతి వైపరీత్యాలను అడ్డుకోలేమని కానీ వాటి ప్రభావాన్ని మాత్రం తగ్గించేందుకు ముందస్తుగా పటిష్టమైన చర్యలు తీసుకుంటే, నష్టాన్ని వీలైనంతవరకు తగ్గించగలుగుతామని ఆయన చెప్పారు. 'గోదావరి, కృష్ణా'నదీ పరివాహక జిల్లాల్లో వరద నిర్వహణ అంశంపైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్‌తో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో హైదరాబాద్‌లోని సచివాలయంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (తెలంగాణ రాష్ట్ర విప త్తు నిర్వహణ సంస్థ)ను బలోపేతం చేస్తున్నామని, ఈ సంస్థకు ముఖ్యమంత్రి ఛైర్మన్‌గా, రెవెన్యూ, హోం, ఆర్థిక, వైద్య ఆరోగ్యం, భారీ నీటిపారుదల, రహదారులు భవనాలు, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రులు సభ్యులుగానూ, ప్రధాన కార్యదర్శి మెంబర్ కన్వీనర్‌గా, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారని వివరించారు. 'వాతావరణ మార్పుల వల్ల ఆకస్మికంగా వచ్చే వరదలు, వర్షాల సమాచారాన్ని ఐఎండితో సమన్వయం చేసుకుని, శాస్త్రీయంగా విశ్లేషించుకుని ఎప్పటికప్పుడు పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు ఒక సమాచార వ్యవస్థను రూపొందించుకుని, మరింత బలోపేతం చేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రధానంగా కృష్ణా గోదావరి పరీవాహక ప్రాంతాల అధికార యంత్రాంగం వరద ముంపును ముందుగానే గుర్తించి ఎప్పటికప్పుడు అప్రమత్తం గా ఉండాలని, తద్వారా నష్టాన్ని తగ్గించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. నదీ పరివాహ క ప్రాంతాల్లో ఏ మేరకు వరద ఉధృతి వస్తే ఏ, ఏ గ్రామాలు ముంపునకు గురవుతాయోననే సమాచారాన్నినీటి పారుదల శాఖ ముందుగానే అందించాలన్నారు. ఇతర రాష్ట్రాలలో వచ్చే వరద వివరాలు, స్థానికంగా పడిన వర్షం, ఎంత నీటిని విడుదల చేశారనే పూర్తి సమగ్ర వివరాలను సేకరించాలన్నారు.

**నివాసితులకు ఇందిరమ్మ ఇండ్లు**

నదీ పరివాహక ప్రాంతాల్లోని నివాసితులను వరదలు వచ్చిన ప్రతిసారీ సురక్షిత ప్రాంతాలకు తరలించడంకాదని, వారికి శాశ్వత నివాసం కల్పించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి నివాసితుల వివరాలను గుర్తిస్తే, అదనపు కోటా కింద వారికి ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తామని వెల్లడించారు. భారీ వర్షాలు, వరదల సమయంలో వాగుల్లో వంకల్లో చెరువుల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ఎయిర్ లిఫ్ట్ మెకానిజాన్ని సిద్ధం చేసుకోవాలని, ఎయిర్ లిఫ్ట్ వ్యవస్థ సరిగా లేకపోవడంతో గత ఏడాది తన నియోజకవర్గం పాలేరులో చిక్కుకున్న బాధితులను రక్షించుకోలేకపోయామని మంత్రి పొంగులేటి ఆవేదన వ్యక్తం చేశారు. ఎయిర్ లిఫ్ట్ మెకానిజం ఏ విధంగా ఉండాలి?, విపత్తు ప్రాంతానికి ఏవిధంగా చేరుకోవాలి? వంటి అంశాలపై అధ్యయనం చేయాలని అధికారులకు మంత్రి సూచించారు.

ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, కార్యదర్శి శివశంకర్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, పంచాయితీరాజ్ కమిషనర్ సృజన, సిపి డిసిఎల్ డైరెక్టర్ ముష్రాఫ్ అలీ, వ్యవసాయ సహకార శాఖ డైరెక్టర్ బి.గోపి. ఐఎండి అధికారి నాగరత్నం. సివిల్ సప్లయిస్ డైరెక్టర్ ముజముల్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## వైట్ ప్లేట్ బైక్ టాక్సీలను నిషేధించాలి: ఐఎఫ్ఎటి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలుపు నంబర్ ప్లేట్ ఉన్న బైక్ టాక్సీ సేవలపై తక్షణమే నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన మోటారు వాహన ఎగ్రిగేటర్ గైడ్‌లైన్స్–2025లో కొన్ని సానుకూల అంశాలను స్వాగతిస్తున్నామని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ (ఐఎఫ్ఎటి) జాతీయ ప్రధాన కార్యదర్శి షేక్ సలాహుద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే ఈ గైడ్‌లైన్స్‌లో ఛార్జీల విషయంలో ఏకరీతి లేకపోవడం, సర్జ్ ధరలపై నియంత్రణ లేకపోవడం, రాష్ట్రా ల్లో అమలు లోపించడం వల్ల దేశవ్యాప్తంగా ప్రయాణికులు, డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేశా రు.

ప్రతి యాప్ బేస్డ్ డ్రైవర్‌కు రూ.5 లక్షల ఆరోగ్య బీమా, రూ.10 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ కల్పించటం సముచితంగా ఉందన్నారు. డ్రైవర్లకు బహుళ ప్లాట్‌ఫామ్‌లపై పనిచేసే హక్కు ఆదాయ అవకాశాల రక్షణకు ఇది అత్యంత అవసరం అన్నారు. డ్రైవర్లకు ట్రైనింగ్, వెరిఫికేషన్, వాహన భద్రతపై కేంద్రం దృష్టి పెట్టడం సానుకూలంగా ఉందన్నారు.

**దేశవ్యాప్తంగా ఒకే విధమైన ఛార్జీల విధానం ఎందుకు లేదు?**

ప్రస్తుతం ఛార్జీల విషయంలో ప్రతి రాష్ట్రం తలుచుకున్నట్టు నిర్ణయించుకోవడం, యాప్ కంపెనీలు ఎలాగైనా ఖర్చు పెంచుకోవడం వల్ల ప్రయాణికులకు అనిశ్చితి, డ్రైవర్లకు అస్పష్ట ఆదాయం కొనసాగుతోందని అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా సమానమైన, పారదర్శక ఛార్జీల విధానాన్ని వెంటనే అమలు చేయాలిలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. డ్రైవర్లు కూడా లాభపడటం లేదు. యాప్ కంపెనీలు పెరిగిన ఛార్జీల్లో ఎక్కువ వాటా దక్కించుకుంటున్నాయని ఆరోపించారు.

తెలుపు ప్లేట్ (వైట్ నంబర్ ప్లేట్) ఉన్న ప్రైవేట్ బైక్ల ద్వారా టాక్సీ సేవలు చట్టబద్ధంగా నడుపుట తప్పు. ఇది ప్రయాణికుల భద్రతకు ప్రమాదం, ప్రభుత్వానికి ఆదాయ నష్టం, చట్టబద్ధ డ్రైవర్ల జీవనోపాధిని దెబ్బతీస్తోందని తెలిపారు. గిగ్ వర్కర్ల ప్రతినిధులకు అవకాశాలు లేకపోవడం

వేలాది డ్రైవర్లను ప్రాతినిధ్యం వహిస్తున్నా, టిజిపిడబ్ల్యూయు వంటి యూనియన్లను అధికారికంగా సంప్రదించకుండా గైడ్‌లైన్స్ రూపొందించడం తగదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ గైడ్‌లైన్స్ అమలులో కార్మిక సంఘాలను తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలన్నారు.

## మావోయిస్టులకు సహకరించకండి : సిఐ రవీందర్



**ప్రజాపక్షం/గుండాల:** నిషేధిత మావోయిస్టు పార్టీకి ఎవ్వరూ సహకరించవద్దని సిఐ రవీందర్ అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని వెన్నెలబైలు, సర్వారం, చీమలగూడెం గ్రామాల్లో గుండాల ఎస్ఐ సైజా రవూఫ్, కొమరారం ఎస్ఐ నాగుల్‌మీరాతో కలిసిన జోరువానలో సైతం ఆయన ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎవరైనా అనుమానిత వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం అందించిన వారి పేర్లను అత్యంత గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మావోయిస్టులకు సహాయ సహకారాలు అందించినట్లు పోలీసులకు సమాచారం అందితే సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మావోయిస్టులవన్నీ కాలంచెల్లిన సిద్ధాంతాలని, ఆ మాయలో పడి జీవితాలను ఆగం చేసుకోవద్దన్నారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వస్తే ప్రభుత్వం నుండి పునరావాసం కల్పిస్తామని, కుటుంబాలతో సంతోషంగా జీవించవచ్చన్నారు. అమాయక ప్రజలను టార్గెట్ చేసుకుని మావోయిస్టులు తమ ఊబిలోనికి దించుకున్నారని, వారి స్వలాభం కోసం ప్రాణాలు బలి తీసుకుంటున్నారని, యువతకు పోలీస్‌శాఖ నుండి సహాయసహకారాలు అందిస్తామన్నారు. అనంతరం వెన్నెలబైల గ్రామంలో యువతకు వాలీబాల్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుండాల, కొమరారం పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భద్రతా చర్యలపై దృష్టి సారించారు

దక్షిణ మధ్య రైల్వే కొత్త బాస్ సందీప్ మాథుర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:**వర్షాకాల నేపథ్యంలో వంతెనలు, సొరంగాలు వద్ద భద్రతా చర్యలపై ప్రధానంగా దృష్టి సారించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన సందీప్ మాథుర్ అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించి న అనంతరం సందీప్ మాథుర్ అధికారులతో రైల్వే భద్రతపై సమీక్షా సమావే శం నిర్వహించారు. ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగ్ర వాల్, ప్రధాన విభాగాధిపతులు పాల్గొన్నారు. విజయవాడ, గుంతకల్, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్ మరియు నాందేడ్ డివిజన్‌ల డివిజనల్ రైల్వే మేనేజర్లు, అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్లు, డివిజనల్ ఇంజనీర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. సందీప్ మాథుర్ మాట్లాడుతూ.. ఏదైనా సంఘటన జరిగినప్పుడు అత్యవసర పరికరాల లభ్యత, ఇసుక, రాళ్లు, పైపులు వంటి అవసరమైన వస్తువుల నిల్వలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ప్రమాదానికి గురయ్యే ప్రాంతాలు, వంతెనలపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని 24/7పర్యవేక్షణ ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి వరదకు గురయ్యే అవకాశం ఉన్న రోడ్ అండర్ బ్రిడ్జిల వద్ద ముందస్తు చర్యలలో భాగంగా చేపట్టిన భద్రతా చర్యలను జనరల్ మేనేజర్ సమీక్షించారు. లిఫ్టింగ్ బారియర్, డ్రైనేజీ పనులు, హెచ్చరిక బోర్డు ఏర్పాటు, 24X7 వాచ్‌మెన్ నిఘా వంటి జాగ్రత్తలను ఆయన పరిశీలించారు. సురక్షితమైన పని విధానాన్ని ఖచ్చితంగా పాటించాలని, రైలు కార్యకలాపాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా సరైన విధానంలో నిర్వహించాలని, అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలను చేపట్టాలని ఆయన అధికారులు, సిబ్బందికి సూచించారు.

**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
ఆపరేషన్ సర్కిల్ : వికారాబాద్ సర్కిల్

టెండర్ నోటీస్ నెం.06/25-26

**వికారాబాద్ సర్కిల్‌లో నిరంతర విద్యుత్ సరఫరాను నిర్వహించడానికి మరియు వర్షాకాల అవసరాలను తీర్చడానికి ఎబి స్విచ్‌లు మరియు సబ్ స్టేషన్ల నిర్వహణ కొరకు మెటీరియల్ అవసరం కోసం మాత్రమే అర్హత కలిగిన బిడ్డర్ల నుండి బిడ్లు ఆహ్వానించబడ్డాయి.** 1) 385 నంబర్ల నైలాన్ బుష్‌ల సరఫరా, 2) 569 నంబర్ల 11KV 200A TT AB స్విచ్ ఫిక్స్‌డ్ కాంటాక్ట్స్ సరఫరా, 3) 581 నంబర్ల 11KV 200A TT AB స్విచ్ మూవింగ్ కాంటాక్ట్స్ సరఫరా. మరిన్ని వివరాల కోసం, దయచేసి www.tgsouthernpower.com ని సందర్శించండి. మెటీరియల్ స్పెసిఫికేషన్ వివరాలు పైన ఉన్న వెబ్‌సైట్‌లో ఉంచబడినవి. ఫోన్ నం. 8712469736 లేదా 8712469716, ఇమెయిల్: detcvkb@gmail.com

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్,TGSPDCL, వికారాబాద్.

DIPR R.O. No. : 4479-PP/CL/ADVT/1/2025-26, Date: 02-07-2025

**శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానము**
వెలిమినేడు గ్రామం, చిట్యాల మండలము, నల్లగొండ జిల్లా.

లేఖ నెం.యస్.యన్.టి/2025, టెండర్ - కం - బహిరంగ వేలముల ప్రకటన తేది: 02.07.2025

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! సదరు దేవస్థానమునకు సంబంధించిన బహిరంగ వేలము ది:08.07.2025 మంగళవారము రోజున .11.00 గం.లకు దేవాలయ ప్రాంగణం నందు దేవాదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించబడును.

| క్ర.సం. | వేలము వివరము | డిపాజిట్ డి.డి / నగదు | కాలపరిమితి |
|---|---|---|---|
| 1. | కొబ్బరికాయలు, పూజాసామాగ్రి, లడ్డూ, పులిహోర ప్రసాదములు & కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కు | 2,00,000/- | 09.07.2025 నుండి 08.07.2026 వరకు (1 సం॥) |

కావున పైన తెలిపిన టెండర్ - కం - బహిరంగ వేలం నిర్వహించుటకు ఒక గంట ముందు ఆసక్తిగలవారు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనగలరని కోరనైనది. ఇతర వివరములకు మొబైల్ నెంబర్ 9703662667 సంప్రదించగలరు.

ఇట్లు, సిరికొండ నవీన్
కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 4447-PP/CL/ADVT/1/2025-26, Date: 02-07-2025

ప్రజాపక్షం
గురువారం, 03 జులై

# సిఇసి లక్ష్యాలు గాలికి!

అడవుల సంరక్షణ, వన్యప్రాణుల పరిరక్షణపై నిరంతరం దృష్టి సారించి, లోపాలను సవరించడానికి ఏర్పాటైన కేంద్ర సాధికారక కమిటీ (సిఇసి) లక్ష్యాలు గాల్లో కలిసిపోతున్నాయి. సుప్రీం కోర్టు ఆదేశించడంతో, 2002లో ఏర్పాటైన సిఇసిని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నీరుగార్చడానికి ప్రయత్నిస్తున్నదంటూ 60 మంది మాజీ సివిల్ సర్వెంట్ల బృందం ఏకంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ బిఆర్ గవాయ్‌కి లేఖ రాయడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. సిఇసిలో పదవీ విరమణ చేసిన ప్రభుత్వ అధికారులు కాకుండా ఇద్దరు స్వతంత్ర సభ్యులు కూడా ఉండేవారు. అయితే, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సిఇసిని 2023లో సవరించారు. ఈ మంత్రిత్వ శాఖలో ఉన్నత పదవులు నిర్వహించి, పదవీవిరమణ చేసిన అధికారులు మాత్రమే కమిటీలో ఉండాలని నిబంధన మార్చారు. సిఇసిని గుప్పిట్లో పెట్టుకున్నారు. జూన్ 30న సిజెఐకి రాసిన లేఖలో, ఈ సవరణ చట్టం వల్ల సిఇసి ప్రయోజనాలు దెబ్బతినడమేగాక, సహజ న్యాయసూత్రాల ఉల్లంఘన కూడా జరుగుతుందని రిటైర్డ్ బ్యూరోక్రాట్లు ఆందోళన వ్యక్తం చేయడం సముచితం. ఇప్పుడు, సిఇసిలో ఒక చైర్‌పర్సన్, ముగ్గురు సభ్యులు, ఒక ప్రత్యేక కార్యదర్శి ఉన్నారు. ప్రస్తుత చైర్‌పర్సన్ సిద్ధాంత దాస్ అటవీ డైరెక్టర్ జనరల్‌గా, పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖలో ప్రత్యేక కార్యదర్శిగా పదవీ విరమణ చేశారు. ముగ్గురు సభ్యులు, ప్రత్యేక కార్యదర్శి కూడా కీలక పదవులు నిర్వహించిన వారే. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖలో ఉన్నత పదవులు నిర్వహించి, విధివిధానాల రూపకల్పనలో కీలక భూమిక పోషించిన వారి నుంచి సుప్రీం కోర్టుకు వాస్తవ పరిస్థితులనుగానీ, నిష్పాక్షిక సూచనలనుగానీ ఊహించలేం. అధికారులుగా ఉన్నప్పుడు తీసుకున్న నిర్ణయాలకు విరుద్ధమైన అంశాలను వారు ఏ విధంగా ప్రస్తావిస్తారని సిజెఐకి రాసిన లేఖలో మాజీ బ్యూరోక్రాట్లు ప్రశ్నించారు. అది అక్షర సత్యం. అటవీ సంరక్షణ సవరణ బిల్లును రూపొందించినప్పుడు, అధికారంలో ఉన్న ఒక వ్యక్తి ఇప్పుడు సిఇసి సభ్యుడనే విషయం గుర్తుంచుకోవాలి. అడవులు, పర్యావరణ పరిరక్షణపై శాస్త్రవేత్తలు, నిపుణులు, సామాజిక కార్యకర్తలు లేవనెత్తిన అభ్యంతరాలను అప్పట్లో ఈ అధికారులు పట్టించుకోలేదు. ఈ విషయమై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ ముందు కూడా సిఇసి పనితీరును, సవరణలను సమర్థించారు. అటవీ సంరక్షణ సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పలు పిటిషన్లపై విచారణ కొనసాగుతున్నది. ఈ పరిస్థితుల్లో సిఇసి సభ్యులు వీరికి అనుకూలంగా స్పందిస్తారనుకోవడం అత్యాశే. సిఇసి గతంలో మాదిరి సుప్రీంకోర్టుకు కాకుండా, అడవులు, పర్యావరణ మంత్రిత్వ శాఖకు నివేదికలు అందచేస్తుందనేది అటవీ సంరక్షణ చట్ట సవరణలో కనిపించే మరో వివాదాస్పద నిర్ణయం. కేంద్ర ప్రభుత్వ వైఖరిని, సిఇసి చిత్తశుద్ధిని ఈ మార్పులు చెప్పకనే చెప్తున్నాయి. న్యాయ వ్యవస్థను ధిక్కరించే రీతిలో వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వం, ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా తన కుట్రపూరిత వ్యూహాలు అమలు పరుస్తున్నది. రాజ్యాంగ వ్యవస్థలను ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేస్తున్నది. అటవీ నిర్మూలన, వాతావరణ కాలుష్యం మానవాళిని వేధిస్తున్న తరుణంలో, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సిఇసికి రాజకీయ రంగులు అద్దడం, సొంత సంస్థగా మార్చడం మోదీ సర్కారుకే చెల్లింది. సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం నీరుగారుస్తూ, ప్రభుత్వ సంస్థలను గుప్పిట్లో పెట్టుకునే నైజం కూడా కేంద్ర ప్రభుత్వానికే ప్రత్యేకం. మాజీ అధికారుల బృందం నేరుగా సిజెఐకే లేఖ రాయాల్సిన దుస్థితి దాపురించడం ప్రమాదకరం. ప్రజాస్వామ్య విలువలకు, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరి మారాలి. న్యాయవ్యవస్థ గౌరవాన్ని నిలబెట్టాలి. అటవీ సంరక్షణ సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేసి, సిఇసిలో పాత విధానాన్నే కొనసాగించాలి. ఇది మోదీ ప్రభుత్వ నైతిక బాధ్యత.

# మోదీ ప్రభుత్వ గొప్పలు – పేదలకు తప్పని తిప్పలు

ధూర్జటి ముఖర్జీ

బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అనేక సాఫల్యాలను తన ఖాతాలో వేసుకుంటున్నప్పటికీ, వాటిని సవివరంగా విశ్లేషించినట్లయితే ఒక విషయం తేటతెల్లమవుతుంది. ఆ అభివృద్ధి ప్రాథమికంగా సమాజంలోని ఉన్నత తరగతులకు, మధ్య తరగతులకు లాభించింది. పేద విభాగాలను పట్టించుకోలేదు. దేశవ్యాప్తంగా ఆరోగ్యం, విద్య ప్రమాణాలు క్షీణించటంలో దీన్ని చూడవచ్చు. ఇందుకు రాష్ట్రాలకు కూడా కొంత బాధ్యత ఉంది.

ఈ అంశాలను ప్రపంచబ్యాంక్ కొంత మేరకు ధృవీకరించింది. అత్యంత దారిద్ర్యంనుంచి 17 కోట్ల 10 లక్షలమందిని బయటకు తేవటం ఎంతో ప్రోత్సాహదాయకంగా అది కనుగొన్నది. దారిద్ర్య రేఖను రోజుకు తలసరి 2.15 డాలర్ల నుంచి 3 డాలర్లకు అది సవరించింది. దారిద్ర్య రేఖను పెంచినపుడు ఎక్కువమంది పేదల్లో చేరతారు కాని తగ్గరు. అటువంటి నివేదికలు వస్తున్నప్పుడు ఆ సమాచారాన్ని ప్రభుత్వం ఖండించదు.

> అభివృద్ధికి సంబంధించి ఇతర కొలమానాలను మనం పరిశీలించినట్లయితే తలసరి ఆదాయం, మానవాభివృద్ధి సూచీ, ప్రపంచ ఆకలి సూచీల్లో మన ర్యాంకింగ్ వరుసగా 144; 130; 105. ఇవి పేదరికాన్ని తెలియజేస్తున్నాయి. అందువల్ల ప్రపంచబ్యాంక్ ఇటీవలి నివేదిక ప్రశంసలకు మురిసిపోవటంలో అర్థం లేదు.

అభివృద్ధికి సంబంధించి ఇతర కొలమానాలను మనం పరిశీలించినట్లయితే తలసరి ఆదాయం, మానవాభివృద్ధి సూచీ, ప్రపంచ ఆకలి సూచీల్లో మన ర్యాంకింగ్ వరుసగా 144; 130; 105. ఇవి పేదరికాన్ని తెలియజేస్తున్నాయి. అందువల్ల ప్రపంచబ్యాంక్ ఇటీవలి నివేదిక ప్రశంసలకు మురిసిపోవటంలో అర్థం లేదు. అంతేకాదు, అత్యంత దారిద్ర్యం నుంచి బయటపడినవారి సంఖ్యను బ్యాంక్ నివేదిక పేర్కొన్నదేగాని వారిప్పుడు ఏ కేటగిరిలో ఉన్నారో చెప్పలేదు. వారిలో అత్యధికులు దారిద్ర్యరేఖకు కొంచెం దిగువన ఉన్నారని, కొందరు ఆర్థిక బలహీనవర్గాలుగా ఉన్నారనీ మనం చెప్పవచ్చునా ? అత్యంత దారిద్ర్యం నుంచి బయటకు వచ్చిన అందరూ కాకపోయినా అత్యధికులు ప్రభుత్వం ఇస్తున్న ఉచిత రేషన్, ఇతర సహాయాలమీద ఆధారపడి ఉన్నారు.

కాంగ్రెస్ బుక్‌లెట్, "11 సాల్, ఝూటే వికాస్ కె వాదే" (11 సంవత్సరాలు, బూటకపు అభివృద్ధి గొప్పలు)ను ఎవరైనా ప్రస్తావించవచ్చు. ప్రభుత్వ క్లెయిములను తిరస్కరించటానికి అది ప్రచురితమైన గణాంక సమాచారాన్ని విస్తృతంగా ఉట్టంకించింది. ప్రపంచ ఆకలి సూచీని ఉదహరిస్తూ కాంగ్రెస్ ఇలా చెప్పింది: "పౌష్టికాహారలోపం జాతీయ సంక్షోభంగా కొనసాగుతున్నది. తక్కువ ఎదుగుదల (వయస్సుకు తగినంత ఎత్తు పెరగకపోవటం) 35.5శాతం, పీలతనం (ఎత్తుకుతగ్గ బరువు లేకపోవటం) 19.3 శాతం, బరువు తక్కువ(వయస్సుకు తగ్గ బరువు లేకపోవటం)32.1 శాతంగా ఉంది." స్వచ్ఛభారత్ గూర్చి బ్యాంక్ నివేదిక ఇలా చెప్పింది: "2018–19 నుండి మరుగుదొడ్ల వాడకం ఎస్‌సిల్లో 20 పాయింట్లు, ఎస్‌టిల్లో 24 శాతం





తగ్గింది. టాయిలెట్లు పనిచేయకపోవటం, నీరు లేకపోవటం, మెయింటినెన్స్ కొరవడటం ఇందుకు కారణాలు." మారుమూల గ్రామాల్లో పారిశుద్ధ్యం, సురక్షిత త్రాగునీటి సరఫరా ఎంతో మెరుగుపడాల్సి ఉంది. ఆర్థికరంగాన్ని చూదాం. జిడిపి వృద్ధి నిలకడగా ఉంది. కాని ఆహార ద్రవ్యోల్బణం వేగంగా పెరుగుతూ పేదలు, బలహీన తరగతులకు జీవనాన్ని భారం చేస్తున్నది. మాన్యుఫాక్చరింగ్ విస్తరించకపోవటం, ఎగుమతులను బహుముఖం చేయటంలో, కొత్త మార్కెట్లలో ప్రవేశించటంలో ప్రభుత్వ వైఫల్యంవల్ల ఉద్యోగాల కల్పన జరగటం లేదు.

పునాదిస్థాయి అభివృద్ధి పట్ల ప్రభుత్వ దృక్పథంలో మార్పురావాలి. ప్రభుత్వ సర్వీసులను పొరుగు సేవలకు ఇవ్వటం వల్ల ప్రైవేటు కార్పొరేషన్‌లు, కన్సల్టెంట్లు లబ్దిపొందుతున్నారు, అత్యవసర సేవలు ఖరీదు అవుతున్నాయి. ముందుగా, ప్రభు త్వం గ్రామీణరంగంపై దృష్టి పెట్టాలి, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అవసరమైన నిధులు కేటాయించాలి. రాష్ట్రాలు ప్రతిసంవత్సరం చివరి రెండు –మూడు మాసాల వేతనాల చెల్లింపు వాయిదాలేస్తున్నాయి. అంతేగాక చెల్లిస్తున్న వేతనం రాష్ట్రాల కనీస వేతనాల కన్నా తక్కువగా ఉంటున్నది. దీన్ని పరిశీలించాలి. అనేకమంది ఆర్థికవేత్తలు వాదిస్తున్నట్లుగా, ఇటువంటి కార్యక్రమాన్ని పట్టణపేదలకు విస్తరించే విషయం ఆలోచించాలి. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కు చెందిన 500మందికి పైగా శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు ఆ సంస్థకు రాసిన లేఖ గూర్చిన వార్త గుర్తు చేసుకోదగింది. ఉపా, క్రిమినల్ న్యాయ వ్యవస్థపై చర్చలను ఆ సంస్థ నిషేధించిన తర్వాత వారు లేఖ రాశారు. సైన్స్, సమాజం గూర్చి అనేక భావాలపై చర్చించే అవకాశం తమ విద్యార్థులు, అధ్యాపకులకు ఉండాలని వారు కోరారు. ఎందరో విద్యావేత్తలు, మేధావులు అసమ్మతి హక్కును అణచివేయటానికి వ్యతిరేకంగా, పలు సందర్భాల్లో ప్రభుత్వానికి రాశారు. ఆదేశాలు విధించటం, అరెస్టులు చేయటానికి ఏమైనా చట్టబద్ధత ఉందా?

రాజకీయ రంగంలో, మోదీ జాతీయవాదం రాజకీయాల్లో ఒక అంశంగా ముందుకువచ్చింది. ప్రభుత్వ విధానాల కేంద్రీకరణ అనేక సంస్థల పనిని దెబ్బతీస్తున్నది. మరోవైపున, అసమ్మతి గొంతునొక్కటం, వ్యక్తి స్వేచ్ఛలను అణిచివేయటం ప్రభుత్వ రాజకీయ వ్యూహంగా తయారైంది. 2014–2022 మధ్య 8719 ఉపా(చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం) కేసులు నమోదు చేయగా, శిక్షల రేటు 2.55 శాతమేనని కాంగ్రెస్ మీడియా ప్రచార కమిటీ ఛైర్మన్ పవన్ ఖెరా చెప్పిన వాస్తవం గుర్తు చేసుకోదగింది. ప్రభు త్వ విమర్శకులను, విద్యార్థులు, పాత్రికేయులు, హక్కుల కార్యకర్తలను అణచివేయటానికి ఆ చట్టా న్ని ఏ విధంగా దుర్వినియోగం చేస్తున్నారో ఇది తెలియజేస్తున్నది. దమనకాండ విధానాలు, ముఖ్యంగా యూనివర్శిటీల్లో వాక్, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలను

> బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కు చెందిన 500మందికి పైగా శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు ఆ సంస్థకు రాసిన లేఖ గూర్చిన వార్త గుర్తు చేసుకోదగింది. ఉపా, క్రిమినల్ న్యాయ వ్యవస్థపై చర్చలను ఆ సంస్థ నిషేధించిన తర్వాత వారు లేఖ రాశారు. సైన్స్, సమాజం గూర్చి అనేక భావాలపై చర్చించే అవకాశం తమ విద్యార్థులు, అధ్యాపకులకు ఉండాలని వారు కోరారు.

క్రమంగా హరిస్తూ ఉండటం ఆందోళన పెంచుతున్న అంశాలు. లౌకిక ప్రజాస్వామ్య స్ఫూర్తి హరింపునకు గురికావటం, పెద్దఎత్తున ఉపాధి కల్పనకు సరైన వ్యూహం లేకపోవటం పునరాలోచించదగినవి. పరిశీలించాల్సిన మరో ముఖ్యమైన రంగం విద్యారంగం. విద్యాప్రమాణాల మెరుగుదల గూర్చి ఆలోచించాలి. కేంద్రం రాష్ట్రాలకు ఆర్థిక సహాయం అందించాలి.

ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. అపర సంపన్నులపై అదనపు పన్నులు విధించాలని అంతర్జాతీయ ఏజెన్సీలు సూచించాయి. ఎంతో కొంత సెస్ విధించే విషయాన్ని ప్రభుత్వం ఆలోచించాలి. అనేక సంపన్నదేశాల్లో సైతం సంపదపన్ను, వారసత్వ ఆస్తిపై పన్ను విధిస్తున్నారు. భారతదేశంలో అటువంటిది లేదు. జీవన పోరాటం చేస్తున్న ప్రజాబాహుళ్యం సంక్షేమం కోసం ప్రభు త్వం సంపన్నుల నుంచి అదనపు వనరులు సమీకరించటం ఎంతైనా సబబు. కావలసింది సంకల్పం.

# జీవకోటిని కబళిస్తున్న ప్లాస్టిక్ కాలుష్యం

నేడు ప్రపంచమంత ప్లాస్టిక్‌మయమైంది. ప్లాస్టిక్ కనబడని గృహం లేదు, వాడని మనిషి లేడు. ఎక్కడ చూసినా ఏమున్నదా గర్వకారణం, సర్వం గరళ ప్లాస్టిక్ బ్యాగుల బూతమే. వాడడానికి సౌకర్యంగా, మన్నిక కలిగిన గుణాలు ప్లాస్టిక్స్ స్వంతం. చెవులను శుభ్రం చేసుకునే ఇయర్ బడ్ నుంచి, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, పాలు/నూనె/ద్రవాల ప్యాకె ట్లు, వాటర్ పాటిల్స్, పానీయాలు తాగే స్ట్రాలు, వంటింటి సరుకులు నిల్వ చేసే డబ్బాలు, కుర్చీలు, పలు రకాల పర్నీచర్లు, పిల్లల ఆట బొమ్మల వరకు ఎక్కడ చూసినా, ఏ దుకాణానికి వెళ్లినా సర్వం ప్లాస్టిక్ వస్తువులు లేదా ప్యాకేజ్‌లు కనిపిస్తున్నాయి. నాడు కర్రకు ప్రత్యామ్నాయంగా, వరప్రసాదంగా 1930ల్లో కనుగొనబడి, 1970–1980లో వాడకం మొదలైన ప్లాస్టిక్ ఉత్పత్తులు నేడు సముద్ర జలాలు, సాగు నేలలను సహితం విషతుల్యం చేసే దుస్థితి వరకు ప్లాస్టిక్ బూతం చేరింది. వాడిపడేసిన ప్లాస్టిక్ ఉత్పత్తులు జీవ విచ్ఛిన్నం కావడానికి 100 నుంచి 1000 ఏండ్లు పడుతున్నది. రసాయనశాస్త్ర పరంగా చిన్న చిన్న అణువు అనేకం రసాయన చర్యల ద్వారా కలిసి అతి పెద్ద శృంఖలాలు ఏర్పడి, ప్లాస్టిక్ బృహదణువులుగా లేదా పాలిమర్స్‌గా పిలువబడతాయి. పాలిథీన్ కవర్స్, పివిసి పైప్స్ లాంటి ప్రధాన ప్లాస్టిక్ ఉత్పత్తుల గూర్చి మనకు తెలుసు. ఒకనాడు షాపుల్లో పర్యావరణహిత పేపర్ ప్యాకింగ్ చేసే అలవాటు ఉండేది. మనం ఏ వస్తువు కొన్నా ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల్లోనే ఇంటికి తెచ్చుకుంటాం. ప్రపంచవ్యాప్తంగా సాలీనా 5 ట్రిలియన్ల ప్లాస్టిక్ బ్యాగులు తయారు చేయబడడం, నిమిషానికి 1 మిలియన్ బ్యాగులు వాడడం, ప్రతి మనిషి సగటున 25 నిమిషాలకు ఒక ప్లాస్టిక్ బ్యాగు వాడడం జరుగుతున్నది. విచ్చలవిడిగా, విచక్షణారహితంగా వాడుతున్న ప్లాస్టిక్ బ్యాగుల పర్యావరణానికి అత్యంత ప్రమాదకరమని మేల్కొనవలసిన సమయం ఆసన్నమైంది. ప్లాస్టిక్ బ్యాగుల వినియోగంతో దాదాపు ఒక లక్ష సముద్ర జంతువుల మనుగడ ప్రశ్నార్థకం అయ్యింది. ఈ ప్రమాదాన్ని గుర్తించిన అంతర్జాతీయ పౌర సమాజం ప్రమాదకర ప్లాస్టిక్ బ్యాగుల వినియోగం పట్ల అవగాహన కల్పించడానికి, వాటి దుష్ప్రభావాలను వివరించడానికి ప్రతి ఏట జూలై 3న అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినం పాటించుట ఆనవాయితీగా వస్తున్నది. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినం వేదికగా ప్లాస్టిక్ బ్యాగుల వాడకాన్ని పూర్తిగా తగ్గించడం, వాటి విష ప్రభావాలను వివరించడం, వాటికి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వెతకడం, పర్యావరణ పరిరక్షణకు కంకణబద్ధులు కావడం లాంటి అంశాలను అవగాహన పరుస్తారు. మన ఇంట్లో ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించుకోవడం,



ప్లాస్టిక్ కవర్స్‌కు బదులుగా పేపర్ లేదా క్లాత్ బ్యాగులు వాడడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగులను నిషేధించడం, తప్పనిసరి అయినపుడు ఒక్క ప్లాస్టిక్ బ్యాగును తిరిగి పలుమార్లు వాడడం, ప్లాస్టిక్ బ్యాగులు లేని మార్కెటింగ్ రోజులను తిరిగి పొందడం, సహజ ఉత్పత్తులతో బ్యాగులను తయారుచేసుకొని వాడడం లాంటి చర్యలకు పూనుకోవలసిన సమయం ఆసన్నమైంది. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే మైక్రో ప్లాస్టిక్ అవశేషాలు మానవ శరీరంలోకి చేరి తీవ్ర అనారోగ్యాలకు కారణం కావడం, సకల జీవ కోటి మనుగడ ప్రశ్నార్థకం కావడం జరుగుతుంది. నేడు ప్లాస్టిక్ వ్యర్థాలు భూగ్రహానికి శాపాలుగా మారుతున్నాయి. సారవంతమైన నేలల్ని, సముద్ర నదీ జలాలను ప్లాస్టిక్ బ్యాగులు కలుషితం చేస్తున్నాయి. అన్నీ తెలిసిన నరుడు నరకానికి నిచ్చెనలు వేస్తున్నాడు. తను ప్రమాదంలో పడడమే కాకుండా సకల జీవరాశులను కూడా ప్రమాదంలోకి నెడుతున్నాడు నేటి డిజిటల్ యుగపు మానవుడు. అందుకే తక్షణమే ప్లాస్టిక్ బ్యాగు రహిత సమాజ స్థాపనకు ప్రతినబూనుదాం, మన రేపటి ఆరోగ్యాలను మనమే కాపాడుకుందాం.

(నేడు అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినం)

# మన ఆలోచనా విధానం మారాలి

నవ్వుతున్నప్పుడు వెక్కిరిస్తుందీ సమాజం. దుఃఖిస్తున్నప్పుడు సంతోషాన్ని వెదకడం సహజం. బ్రతికున్నంత సేపు ఎవ్వరూ పట్టించుకోరు. బాధలకు, బాధ్యతలకు లొంగిపోయి బ్రతుకీడుస్తుంటే ఆకతాయిల చూస్తారంతా. ఓర్పుతో భరిస్తున్నప్పుడు మరిన్ని బండరాళ్లను మీదకి విసురుతారు అది మానవ నైజమేమో అనిపిస్తుంది. బ్రతకడం అంత ఈజీ కాదు అనిపిస్తుంది సరే ఎలాగోలా బ్రతికేద్దాం నా జీవితం నాకోసం కాదు నా అనుకున్న వాళ్ళ కోసం నేనెలా వున్నా పర్లేదు బ్రతకాలి అంతే అనుకొని ఒక్కో అడుగు ముందుకేస్తుంటే టక్కున వెనక్కి లాగెయ్యాలని వంద చేతులు అడ్డుపడతాయి. కన్నీటి కడలిలో ఈదుతున్నపుడు ఒక్క వేలు వచ్చి ఓదార్పునివ్వదు. అన్ని భరిస్తూ ఛీ ఎందుకు నాకీ బ్రతుకు అనుకొని ఒక్కక్షణం నాది కాదనుకొని ఊపిరాపేసుకుంటే.. బ్రతికున్నపుడు సహకరించని స్నే హం, మేమున్నామని చెయ్యందించలేని బంధువర్గం. ఈ భువినొదిలి పోయాక రాబందువుల్లా ఒకచోట చేరి శవాలపై పైసలేరుకున్నట్లు నీతి కవనాల్లల్లేస్తాయి. ఎంతలా అంటే ఒక వివేకానందుడు, ఏపీజే అబ్దుల్ కలాం లాంటి వారు చెప్పిన సూక్తులన్నీ చెప్పేస్తుంటారు. అవి విన్నప్పుడు అనిపిస్తుంది బ్రతికివున్నప్పుడు చెప్పుంటే జీవితాలు చెల్లాచెదురు కావు కదా అని. పైగా తీర్పులు చెప్పేస్తుంటారు. ఇలా జరిగివుంటే అలా జరిగి ఉండేది. అది అలా చేసింది కాబట్టి ఇలా జరిగింది. ఇది తప్పు అది ఒప్పు అని పేరుగాంచిన న్యాయవాదుల్లా ఉచిత సలహాలిస్తుంటారు. సందర్భోచిత సామెతలు చెబుతుంటారు. మన మాటల వాళ్ళ అవతలి వాళ్ళు ఎంత గాయపడతారు అనేది అస్సలు ఆలోచించరు. ఆలోచనా విధానం మారాలి. సలహాలు ఇచ్చే వాడికి అనుభవం ఉండదు. అనుభవించేవాడికి చూసేవాడు ఓదార్పు మాత్రమే ఇవ్వాలి. ముల్లులా గుచ్చి గుచ్చి గాయాన్ని మానకుండా మొత్తానికి నరికేసుకునే పరిస్థితికి తీసుకురానివ్వకూడదు. ఏది ఎందుకు జరిగిందో మనకు తెలీదు. తెలియకుండా ఎవ్వరికి సలహాలు, సూక్తులు, తీర్పులు ఇచ్చే ప్రయ త్నం చెయ్యకండి. నీ ఒక్క మాట వల్ల అవతలి వాళ్ళ ముక్కలయ్యే ప్రమాదం వుంది. ప్రతి ఒక్కరికి అంతరాత్మ అనేది ఒకటుంటుంది. తప్పు చేసినా ఒప్పు చేసినా అది ప్రశ్నిస్తూనే ఉంటుంది. గ్రహించడం, తమలను తాము సరిచేసుకోవడం అనేది వారి వారి విజ్ఞతకు సంబంధించిన విషయం. అకారణంగా ఎవరిని నిందించవద్దు. దూషించవద్దు. ఎవరి జీవితం వారిది. ఎవరి వ్యక్తిగత విషయాలు వాళ్ళవి. ప్రస్తుత పరిస్థితుల్లో మీ వ్యక్తిగత విషయాలు బయటి వారితో పంచుకోవడం తప్పు. అవతలి వాళ్ళ విషయాలు అతిగా తెలుసుకోవడం అంతకంటే పెద్ద తప్పు. ఎందుకంటే విన్న చెవి మరో చెవికి చేరే వరకు ఊరుకోదు. ప్రచారం కావడం వల్ల నువ్వు సాధించేదేమీ లేదు. బ్రతకాలి అంటే మొండిగా బ్రతకాలి. మనతో వున్న వారిని బ్రతికించాలి. పిరికితనం మనిషికి పట్టిన జాడ్యం. ఒక్కసారి అది మనసును అతుక్కుంటే వదిలించుకోవడం కష్టం. జీవితం చాలా చిన్న ది. ప్రతి విషయంలో తృప్తిగా బ్రతకండి.

– వాసి జ్యోత్స్న
9866843005

# అటెండర్లకు సమస్యగా దొంగతనాలు!

భారతీయ రైల్వేలు ఎసి తరగతుల్లోని ప్రయాణికులందరికీ పరిశుభ్రమైన, బాగా ఇస్త్రీ చేసిన మంచి నాణ్యత గల దిండ్లు, దుప్పట్లు అందించి తద్వార ప్రయాణికులకు సుఖవంతమైన సంతృప్తికరమైన ప్రయాణం కోసం. రైల్వే బెడ్‌రోల్ అటెండెంట్ నియమించింది వీరు ఎయిర్ కండిషన్డ్ రైలు కోచ్‌లలో బెడ్‌రోల్‌లను పంపిణీ చేయడం, నిర్వహించడం ఉంటుంది. ప్రయాణికులకు లినెన్లు, దిండ్లు దుప్పట్లు అందించడం, కోచ్ శుభ్రతను నిర్ధారించడం వంటి పనులు నిర్వహిస్తారు.. ఇన్ని సేవలు అందిస్తున్న వీరికి ప్రతి నెల కేవలం 15,000 రూపాయల జీతం కాంట్రాక్టర్ ద్వారా అందుతున్నది. సాధారణంగా ఎసి కోచ్‌లో ధనికులు, విద్యాధికులు ప్రయాణం చేస్తూ ఉంటారు. ప్రయాణికులు వారి గమ్యస్థానం చేరేముందు కొంతమంది బెడ్ రోల్స్ దొంగిలిస్తున్నారు. రైళ్లలో దుప్పట్లు, టవల్స్ దొంగతనాలు అటెండర్లకు పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్యను అరికట్టడం అధికారులకు కష్టంగా మారుతోంది. ఈ దొంగతనాల కారణంగా, ప్రతినెల బెడ్ రోల్ అటెండర్ జీతం నుండి రికవరీ చేస్తున్నారు. వీరు ఎక్కువసేపు సుదూర రైళ్లలో నిరంతర షిఫ్టులలో, తక్కువ విశ్రాంతితో పని చేయడం వలన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఒక్కొక్కసారి వీరు కుటుంబ సభ్యులకు దూరంగా సుమారు 80 గంటలు పని చేయవలసి వస్తుంది. ఒక రైలులో కేవలం నలుగురు లేదా ఆరుగురు వందలమంది ప్రయాణికులకు సేవలు అందించడం కష్టంగా ఉంది. వీరు ప్రయాణికుల బెడ్ రోల్స్ ఎత్తడం, పంపిణీ చేయడం, కోచులను శుభ్రపరచడం కష్టంతో కూడుకున్న పని. కొంత మంది ప్రయాణికులు ఇన్‌ఫెక్షన్లు, అలెర్జీలతో బాధపడుతూ ప్రయాణం చేస్తున్నారు, అలాంటి ప్రయాణికులు వాడిన దుప్పట్లు, దిండ్లు మార్చే సమయంలో బెడ్ రోల్ అటెండర్స్ కూడా చర్మ వ్యాధులు సోకే ప్రమాదముంది. కొన్ని రైళ్లలో ప్యాంట్రీ (కిచెన్)లేకపోవడంతో స్వంత ఖర్చులతో భోజనం చేయాలి. అతి తక్కువ జీతం పొందే వీరు రైల్వే స్టేషన్లో దొరికే ఆహార ఖర్చులు భరించగలరా? వీరు రైలు ప్రయాణం కొనసాగించేంత వరకు నిద్ర మానుకొని మేలుకొని ఉండాలి. కొన్నిసార్లు టాయిలెట్స్ దగ్గరే విశ్రాంతి పొందే దుర్భరస్థితిలో జీవిస్తున్నారు. ఒకవేళ రైలు ప్రయాణంలో ప్రయాణికుల విలువైన వస్తువులు కనబడకపోతే బెడ్ రోల్ అటెండర్స్ దూషణపాలు అవుతున్నారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ రైలు నినాదం అమలు పరుస్తున్న బెడ్ రోల్ అటెండర్స్‌కు తగిన ఆర్థిక, ఆరోగ్య భద్రత కల్పించేందుకు అధికారులు పూనుకోవాలి.




లేఖ

– ఆళవందార్ వేణు మాధవ్
హైదరాబాద్

# లైబ్రరీ సైన్స్‌లో కంప్యూటర్ డిజైనింగ్ కోర్సుల ప్రాముఖ్యం

లైబ్రరీ సైన్స్ అనేది సమాచార నిర్వహణ, గ్రంథాలయాల నిర్వహణ, సమాచార వనరుల సమర్థ వినియోగంపై దృష్టి సారించే ఒక విద్యారంగం. ఈ రంగంలో డిజిటల్ యుగం ఆవిష్కరణతో కంప్యూటర్ డిజైనింగ్ కోర్సులు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నాయి. కంప్యూటర్ డిజైనింగ్ అనేది కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌లో టెక్నాలజీని ఉపయోగించి వివిధ రకాల గ్రాఫిక్స్, డిజిటల్ కంటెంట్, వినియోగదారు ఇంటర్‌ఫేస్‌లను సృష్టించడం. లైబ్రరీ సైన్స్ సందర్భంలో, కంప్యూటర్ డిజైనింగ్ కోర్సులు డిజిటల్ గ్రంథాలయ వ్యవస్థల రూపకల్పన, వెబ్‌సైట్‌ల అభివృద్ధి, డిజిటల్ కంటెంట్ నిర్వహణ, అలాగే సమాచార సందర్శన కోసం ఆకర్షణీయమైన ఇంటర్‌ఫేస్‌లను రూపొందించడంపై దృష్టి పెడతాయి. ఇవి గ్రంథాలయ సేవలను ఆధునికీకరించడంలోనూ వినియోగదారులకు సేవలు అందించే ప్రక్రియను సులభతరం చేయడంలో సహాయపడతాయి.

ఆధునిక గ్రంథాలయాలు భౌతిక పుస్తకాలతో పాటు డిజిటల్ వనరులను కూడా అందిస్తున్నాయి. కంప్యూటర్ డిజైనింగ్ నైపుణ్యాలు డిజిటల్ లైబ్రరీ ఇంటర్‌ఫేస్‌లను రూపొందించడంలో సహాయపడతాయి. ఉదాహరణకు, వినియోగదారులు సులభంగా సమాచారాన్ని శోధించగలిగేలా ఆకర్షణీయమైన వెబ్‌సైట్‌లు లేదా ఆన్‌లైన్ కేటలాగ్‌లను రూపొందించడం కంప్యూటర్ డిజైనింగ్ ద్వారా సాధ్యమవుతుంది. ఇలాంటి వ్యవస్థలు వినియోగదారు అనుభవాన్ని మెరుగుపరుస్తాయి. కంప్యూటర్ డిజైనింగ్ కోర్సులు వినియోగదారు ఇంటర్‌ఫేస్ (యూజర్ ఇంటర్‌ఫేస్) వినియోగదారు అనుభవం (యూజర్ ఎక్స్‌పీరియన్స్) రూపకల్పనలో నైపుణ్యం కల్పిస్తాయి. గ్రంథాలయ వెబ్‌సైట్‌లు లేదా డిజిటల్ యాప్‌లు సులభంగా నావిగేట్ చేయగలిగేలా, ఆకర్షణీయంగా ఉండేలా రూపొందించడం ద్వా రా, వినియోగదారులు తమకు కావలసిన సమాచారాన్ని త్వరగా పొందగలుగుతారు. లైబ్రరీ సైన్స్‌లో డిజిటల్ కంటెంట్‌ను నిర్వహించడం ఒక ముఖ్యమైన అంశం. ఈ బుక్స్, ఆన్‌లైన్ జర్నల్స్, డిజిటల్ ఆర్కైవ్‌లను రూపొందించడంలో కంప్యూటర్ డిజైనింగ్ నైపుణ్యాలు ఉపయోగపడతాయి. ఉదాహరణకు, డిజిటల్ ఆర్కైవ్‌ల కోసం ఆకర్షణీయమైన గ్రాఫిక్స్ లేదా ఇన్ఫోగ్రాఫిక్స్ రూపొందించడం ద్వారా సమాచారాన్ని మరింత ఆసక్తికరంగా అందించవచ్చు. ఆధునిక గ్రంథాలయాలు ఆటోమేషన్, కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), డేటా ఎనలిటిక్స్ వంటి సాంకేతికతలపై ఆధారపడుతున్నాయి. కంప్యూటర్ డిజైనింగ్ కోర్సులు ఈ సాంకేతికతలను అర్థం చేసుకోవడానికి వాటిని గ్రంథాలయ సేవలలో అనుసంధానం చేయడానికి సహాయపడతాయి. ఉదాహరణకు, డేటాబేస్ డిజైన్ లేదా కంటెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ (సీఎంఎస్) రూపకల్పనలో ఈ నైపుణ్యాలు కీలకం.



గ్రంథాలయ సేవలను ప్రచారం చేయడానికి డిజిటల్ మార్కెటింగ్ అవసరం. కంప్యూటర్ డిజైనింగ్ నైపుణ్యాలు సోషల్ మీడియా పోస్ట్‌లు, బ్రోచర్‌లు, ప్రమోషనల్ వీడియోలను రూపొందించడంలో సహాయపడతాయి. ఇవి గ్రంథాలయ సేవలను వినియోగదారులకు మరింత ఆకర్షణీయంగా చేరవేస్తాయి. ఈ కోర్సు వల్ల సమాచార సౌలభ్యం ఉంటుంది. డిజైనింగ్ నైపుణ్యాలు గ్రంథాలయ వనరులను సులభంగా అందుబాటులో ఉంచేలా చేస్తాయి. వృత్తిపరమైన అవకాశాలు మెరుగు పరుస్తాయి. ఈ కోర్సులు లైబ్రరీ సైన్స్ విద్యార్థులకు డిజిటల్ లైబ్రరీ నిర్వహణ, కంటెంట్ క్రియేషన్, అలాగే ఐటీ రంగాలలో ఉద్యోగ అవకాశాలను అందిస్తాయి. నవీన సాంకేతికతలతో అనుసంధానం కావటంతో కృత్రిమ మేధస్సు, డేటా విజువలైజేషన్ వంటి ఆధునిక సాంకేతికతలతో గ్రంథాలయ నిర్వహణను మెరుగుపరుస్తాయి. వినియోగదారులకు ఆకర్షణీయమైన డిజైన్‌ల ద్వారా గ్రంథాలయ సేవలను మరింత జనాదరణ పొందేలా చేయవచ్చు. డిజిటల్ యుగంలో గ్రంథాలయాలు కేవలం పుస్తక నిల్వలుగా కాకుండా సమాచార కేంద్రాలుగా మారాయి. కంప్యూటర్ డిజైనింగ్ కోర్సులు లైబ్రరీ సైన్స్ నిపుణులకు డిజిటల్ లైబ్రరీలు, ఆన్‌లైన్ డేటాబేస్‌లు, వర్చువల్ లైబ్రరీ సేవలను నిర్వహించే సామర్థ్యాన్ని అందిస్తాయి. భవిష్యత్తులో, ఈ నైపుణ్యాలు గ్రంథాలయ నిర్వాహకులను డిజిటల్ కంటెంట్ క్రియేటర్‌లు, డేటా క్యూరేటర్‌లు, అలాగే ఐటీ కన్సల్టెంట్‌లుగా రూపొందించే అవకాశం ఉంది. లైబ్రరీ సైన్స్‌లో కంప్యూటర్ డిజైనింగ్ కోర్సులు ఆధునిక గ్రంథాలయ నిర్వహణలో విప్లవాత్మక మార్పులను తీసుకొస్తున్నాయి. ఇవి సమాచారాన్ని సులభంగా, ఆకర్షణీయంగా, సమర్థవంతంగా అందించడంలో సహాయపడతాయి. విద్యార్థులు ఈ కోర్సుల ద్వారా సాంకేతిక నైపుణ్యాలను సంపాదించడం ద్వారా గ్రంథాలయ రంగంలో ఇతర డిజిటల్ రంగాలలో ఉన్నతమైన వృత్తిపరమైన అవకాశాలను పొందవచ్చు. ఈ కోర్సులు లైబ్రరీ సైన్స్‌ను ఆధునిక యుగానికి అనుగుణంగా మార్చడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

– డా.రాధికా రాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్,
కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.
8074317172

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## రద్దీ సమయాల్లో రేట్లు పెంచుకోవచ్చు..

### క్యాబ్ సర్వీస్ సంస్థలకు కేంద్రం గుడ్ న్యూస్

**న్యూఢిల్లీ:** ఉబర్, ఓలా వంటి ఆన్‌లైన్ క్యాబ్ సర్వీసుల సంస్థలకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రద్దీ సమయాల్లో రేట్లు పెంచుకునేందుకు అనుమతించింది. మోటారు వాహన అగ్రిగేటర్ గైడ్‌లైన్స్‌ను రోడ్డు, రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ మంగళవారం విడుదల చేసింది.ఈ కొత్త మార్గదర్శకాల ప్రకారం.. క్యాబ్ అగ్రిగేటర్లు రద్దీ సమయాల్లో బేస్ ఛార్జీ కంటే రెండు రెట్ల వరకు ధరను పెంచుకోవచ్చు. గతంలో ఇది 1.5 రెట్లుగా ఉండేది. ఇప్పుడు దాన్ని రెండు రెట్లకు పెంచారు. అలాగే విపరీతమైన రద్దీ ఉంటే సర్ ఛార్జ్‌ను 200 శాతం పెంచుకునే వీలు కల్పించింది. అయితే, మూడు కిలోమీటర్ల లోపు ప్రయాణించే వారికి అదనపు ఛార్జీలు వసూలు చేయకూడదని షరతు పెట్టింది. అంతేకాదు డ్రైవర్ కారణం లేకుండా రైడ్‌ను రద్దు చేస్తే రూ.100కు మించకుండా లేదా పది శాతం జరిమానా (ఏది తక్కువైతే అది) విధించవచ్చు. రైడ్ వాహనాలకు స్టేట్ కంట్రోల్ సెంటర్లకు అనుసంధానించిన లొకేషన్ ట్రాకింగ్ పరికరాలు తప్పనిసరిగా ఉండాలి.

## 8 రోజులపాటు ఐదు దేశాల్లో పర్యటించనున్న మోదీ



**న్యూఢిల్లీ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనకు బయల్దేరి వెళ్లారు. ఐదు దేశాల్లో ఎనిమిది రోజుల పాటూ ఈ పర్యటన సాగనుంది. ఈ పర్యటనలో భాగంగా తొలుత ఘనాలో మోదీ పర్యటిస్తారు. ఇవాళ, రేపు ఆ దేశంలో ప్రధాని పర్యటన ఉంటుంది. ఈ సందర్భంగా ఘనా అధ్యక్షుడితో ప్రధాని ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఘనాలో భారత ప్రధాని పర్యటించడం ఇదే తొలిసారి. ఘనా పర్యటనను ముగించుకొని ప్రధాని ట్రినిడాడ్ అండ్ టొబాగొల పర్యటకు వెళ్తారు. జులై 3, 4 తేదీల్లో అక్కడ పర్యటిస్తారు. ఆ తర్వాత జులై 4 అర్జెంటీనా వెళ్తారు. 5వ తేదీ వరకూ అక్కడ పర్యటిస్తారు. ఆ తర్వాత జులై 5న బ్రెజిల్ వెళ్తారు. 8వ తేదీ వరకూ ఆ దేశంలోనే మోదీ పర్యటిస్తారు. రియో వేదికగా జరగనున్న 17వ బ్రిక్స్ సదస్సులో పాల్గొంటారు. ఈ పర్యటన తర్వాత 9వ తేదీన ప్రధాని నమీబియా వెళ్తారు. అక్కడ ద్వైపాక్షిక చర్చలు అనంతరం స్వదేశానికి తిరిగి వస్తారు. మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒకేసారి ఐదు దేశాల్లో పర్యటించడం ఇది రెండోసారి. 2016లో ఆయన అమెరికా, మెక్సికో, స్విట్జర్లాండ్, ఆఫ్ఘనిస్థాన్, ఖతార్‌లో ఒకేసారి పర్యటించారు.

## దౌత్య విపత్తు వేళ మళ్లీ విదేశాలకా?

### ప్రధాని మోదీపై టిఎంసి, కాంగ్రెస్ ధ్వజం



**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఉదయం ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా వంటి ఐదు దేశాల పర్యటనకు బయలుదేరి వెళ్లడంపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేశాయి. కాగా, జులై 9న ముగిసే తన పర్యటన సందర్భంగా ఆతిథ్య దేశాలతో భారతదేశం సంబంధాలను బలోపేతం చేయడంలో ప్రధాని విశ్వాసం వ్యక్తం చేశారు. అయితే ఈ ఏప్రిల్‌లో పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడి, ఆపరేషన్ సిందూర్ ద్వారా భారతదేశం సైనిక చర్య తీసుకున్నప్పటి నుంచి ప్రతిపక్ష పార్టీలు మోదీ తరచుగా చేసే విదేశీ పర్యటనల ఫలితాన్ని ప్రశ్నిస్తున్నాయి. 'పహల్గాంలో జరిగిన దారుణమైన ఉగ్రవాద దాడి 26 మంది అమాయకుల ప్రాణాలను బలిగొన్నప్పటి నుంచి 71 రోజులు గడిచాయి. అయినప్పటికీ ఒక్క దేశం కూడా పాకిస్థాన్‌ను స్పష్టంగా ఖండించలేదు' అని టీఎంసీ బుధవారం తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొంది. 'ఇది కేవలం విదేశాంగ విధాన వైఫల్యం కాదు. ఇది దౌత్య విపత్తు. బీజేపీ స్వయంగా చెప్పుకుంటున్న, చాలా ప్రచారం చేయబడిన 'విశ్వగురు' హోదా నుంచి పూర్తిగా పతనం' అని తెలిపింది. 'అమెరికా అధ్యక్షుడు పాకిస్థాన్ పట్ల తన 'ప్రేమ' ను ప్రకటించుకున్నారని, దాని సైన్యాధ్యక్షుడితో భోజనం చేశారని, దేశం భారతదేశంతో యుద్ధంలో నిమగ్నమై ఉండగా ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు పాకిస్థాన్‌కు రుణాలు మంజూరు చేశాయని పశ్చిమ బెంగాల్ పాలక పార్టీ టీఎంసీ గుర్తు చేసింది. అదే సమయంలో యూఎన్‌సీఎస్ దాని ఉగ్రవాద నిరోధక కమిటీకి వైస్ చైర్మన్‌గా పాకిస్థాన్‌ను నియమించింది. పాకిస్థాన్ తన భూభాగంలో ఉగ్రవాదులను కాపాడుతోందని భారతదేశం తరచూ ఆరోపిస్తోంది' అని పేర్కొంది. 'అది తగినంత ఆందోళనకరంగా లేకపోతే పాకిస్థాన్ ఇప్పుడు జులైలో ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి అధ్యక్ష పదవిని కలిగి ఉంది' అని వివరించింది.

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంఛార్జ్ జైరాం రమేశ్... మోదీని 'సూపర్ ప్రీమియం ఫ్రీక్వెంట్ ఫ్లైయర్' అని ఎద్దేవా చేస్తూ... చరిత్ర పాఠాన్ని వివరించారు. 'సూపర్ ప్రీమియం ఫ్రీక్వెంట్ ఫ్లైయర్ ప్రధాని నేడు ఘనాలో ఉన్నారు' అని ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. '60ల మధ్యకాలం వరకు ఘనా నిజానికి ఆఫ్రికన్ రాజకీయాలను క్వామే న్క్రుమా ఆధిపత్యం వహించారు. అతను ఒక ప్రముఖ వ్యక్తి. అతను జవహర్‌లాల్ నెహ్రూతో చాలా స్నేహపూర్వక సంబంధాన్ని పంచుకున్నాడు. ఇది మార్చి 1957లో ఘనా స్వాతంత్ర్యం పొందటానికి చాలా కాలం ముందు నుంచి ఉంది' అని తెలిపారు. ఇండియా హౌస్ ఉన్న అక్రలోని ఒక ప్రముఖ రహదారికి నెహ్రూ పేరు పెట్టారు. అయితే న్యూఢిల్లీలోని దౌత్య ఎన్‌క్లేవ్‌లో క్వామే న్క్రుమా మార్గ్ ఉందని జైరాం రమేశ్ ఈ సందర్భంగా వివరించారు. 'కష్ట కాలం గడిచినప్పుడు స్వయం ప్రకటిత కఠినులు ముందుకు సాగుతారు. సూపర్ ప్రీమియం ఫ్రీక్వెంట్ ఫ్లైయర్ ప్రధాన మంత్రి ఐదు దేశాలకు ఎనిమిది రోజుల విహారయాత్రకు బయలుదేరతారు' అని విమర్శించారు. మోదీ పారిపోతున్నారని చెప్పిన సమస్యల జాబితాను కాంగ్రెస్ నాయకుడు వివరించారు. ఆ జాబితాలో మణిపూర్, పాకిస్థాన్‌తో ఇటీవలి యుద్ధంలో భారతదేశం ఎదుర్కొన్న వాటికి ప్రతిస్పందించడం, కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తరచూ చేసిన వాదనలు, పహల్గాం దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులను గుర్తించి అరెస్టు చేయడంలో వైఫల్యం ఉన్నాయి. ఇదిలా ఉండగా, రాజ్యసభలో తణమూల్ కాంగ్రెస్ నాయకుడు డెరెక్ ఓబ్రెయిన్... జైరాం రమేశ్ చేసిన పోస్ట్‌కు స్పందిస్తూ... 'జాబితాలో మరొకటి ఉంది : ఉద్యోగాలు. అవి లేకపోవడంతో దేశ వ్యాప్తంగా యువత బాధపడుతున్నారు' అని తెలిపారు.



## పార్లమెంట్‌లో భద్రతా ఉల్లంఘన కేసు నిందితులకు బెయిల్

**న్యూఢిల్లీ :** 2023 డిసెంబర్‌లో పార్లమెంట్‌లోని లోక్‌సభలోకి ఇద్దరు ప్రవేశించి భద్రతా ఉల్లంఘనకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆ కేసులో నిందితులు నీలం ఆజాద్, మహేశ్ కుమావత్‌లకు ఢిల్లీ హైకోర్టు ఇవాళ బెయిల్ మంజూరీ చేసింది. జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్, హరీశ్ విద్యనాథన్ శంకర్‌లతో కూడిన ధర్మాసనం నీలం, మహేశ్‌లకు ఊరట కల్పించింది. ఇద్దరికీ 50వేల పూచీకత్తుపై బెయిల్ కల్పించారు. పార్లమెంట్ దాడి ఘటన గురించి మీడియాకు ఇంటర్వ్యూలో ఇవ్వరాదు అని కోర్టు ఆదేశించింది. సోషల్ మీడియాలో పోస్టులు కూడా చేయవద్దు అని ధర్మాసనం పేర్కొన్నది. ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్‌ను సవాల్ చేస్తూ నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. 2001 నాటి పార్లమెంట్ దాడి ఘటనను వ్యతిరేకిస్తూ.. కొందరు నిరసనకారులు పార్లమెంట్ బిల్డింగ్‌లోకి ప్రవేశించారు. లోక్‌సభ సమావేశాలు జరుగుతున్న సమయంలో స్మోక్ కానిస్టర్లను స్ప్రే చేశారు. విజిటర్స్ గ్యాలరీ నుంచి కిందకు దూకి స్మోక్ స్ప్రే చేశారు. ఆజాద్‌ను 2023, డిసెంబర్ 13వ తేదీన అరెస్టు చేశారు. అతనితో పాటు సాగర్ శర్మ, మనోరంజన్ డీ, అన్మోల్ షిండేలను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఘటన జరిగిన రోజున ఆజాద్, షిండేలు పార్లమెంట్ ఆవరణలో నిరసన చేపట్టారు. లోక్‌సభ చాంబర్‌లోకి శర్మ, మనోరంజన్ ప్రవేశించారు. ఈ కుట్రలో భాగమైన ప్రధాన నిందితుడు లలిత్ జా, మరో నిందితుడు మహేశ్ కుమావత్‌లను కూడా పోలీసులు అరెస్టు చేశారు.

## ఎరువుల ఎగుమతులు నిలిచిపోవడంపై చర్యలేవి?

### కేంద్ర ప్రభుత్వంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మండిపాటు



**న్యూఢిల్లీ :** చైనా నుంచి ఎరువుల ఎగుమతులు నిలిచిపోవడంతో డిఏపి, యూరియా వంటి అవసరమైన ఎరువుల కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కాంగ్రెస్ నాయకులు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఒకవైపు ప్రధాని నరేంద్ర మోదీ ఎరువుల బస్తాలపై తన ఫోటోలను ముద్రించుకుంటున్నారని, మరో వైపు రైతులు 'మేడ్ ఇన్ చైనా' ఎరువులపై ఆధారపడుతున్నారని అన్నారు. వ్యవసాయ దేశమైన భారతదేశంలో ఆర్థిక వ్యవస్థకు రైతులే వెన్నెముక అని, కానీ విదేశంపై ఆధారపడడంతో వెన్ను ఒంగిపోతుందని, ఇప్పుడు చైనా పంపిణీ నిలిపివేసిందని తన 'ఫేస్‌బుక్' ఖాతాలో బుధవారం నాడు రాహుల్‌గాంధీ పోస్ట్ చేశారు. ఎరువుల కొరతతో దేశవ్యాప్తంగా రైతులు ఇబ్బందులు పడుతుండడం ఇదే మొదటిసారి కాదని, తాజాగా ఎరువుల విషయంలో 'చైనా సంక్షోభం' అలుముకుంటుందని హెచ్చరించారు. ఎరువుల పంపిణీ ఏ సమయంలోనైనా నిలిచిపోతుందని తెలిసినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని విమర్శించారు. దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉండగా, అందుకు ఎలాంటి విధానం లేదా ప్రణాళికను రూపొందించలేదని అన్నారు. రైతులు అప్పులు, బాధల్లో కూరుకుపోతుంటే ఎవరి కోసం, ఎవరి అభివృద్ధి జరుగుతుందని రాహుల్ గాంధీ ప్రశ్నించారు.

## అహ్మదాబాద్ ఘటన.. రెండు ఇంజిన్ల వైఫల్యమే కారణమా?

**న్యూఢిల్లీ :** అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాద ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. రెండు ఇంజిన్లు విఫలమవడంతోనే విమానం కూలిపోయి ఉంటుందని తాజాగా బ్లూమ్‌బర్గ్ నివేదిక వెల్లడించింది. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో త్వరలో తొలి నివేదికను విడుదల చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో విమాన ప్రమాద దర్యాప్తుతో సంబంధమున్న వ్యక్తులను ఉటంకిస్తూ బ్లూమ్‌బర్గ్ పలు విషయాలను వెల్లడించింది. ఈ విమానయాన సంస్థకు చెందిన పైలట్లు.. కూలిన విమానం పారామీటర్స్‌ను ఫ్లైట్ సిమ్యులేటర్ ద్వారా రీక్రియేట్ చేసినట్లు సమాచారం. ల్యాండింగ్ గేర్, రెక్కల ఫ్లాప్స్‌ను వెనక్కి తీసుకోవడం లాంటివి ఇందులో ఉన్నాయి. అయితే ఈ సెట్టింగ్‌లు మాత్రమే ప్రమాదానికి కారణం కాదని వారు గుర్తించినట్లు ఈ నివేదిక పేర్కొంది. డ్యూయల్ ఇంజిన్ల వైఫల్యంపై దర్యాప్తు అధికారులు దష్టిసారించినట్లు వెల్లడించింది. అధికారిక దర్యాప్తు నుంచి విడిగా ఈ 'సిమ్యులేటెడ్ ఫ్లైట్'ను నిర్వహించినట్లు సమాచారం. విమాన ప్రమాదానికి గల కారణాలను విశ్లేషించడంలో ఇది ఉపయోగపడుతుందని చెబుతున్నారు. జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం అయిన కొన్ని క్షణాల్లోనే ఓ వైద్య కళాశాల వసతిగహంపై కూలిపోయింది. ఈ విషాదకర ఘటనలో 241 మంది ప్రయాణికులు మతిచెందగా.. 19 మంది స్థానికులు ప్రాణాలు కోల్పోయారు. విమానంలోని ఒకేఒక వ్యక్తి మత్యుంజయుడిగా నిలిచారు. బ్లాక్ బాక్స్ విశ్లేషణ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది.

## పార్లమెంటరీ ప్యానెల్ మీటింగ్‌కు మేధా పాట్కర్, ప్రకాశ్ రాజ్..

### వాకౌట్ చేసిన బిజెపి ఎంపిలు



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక నేతత్వంలో మంగళవారం పార్లమెంట్‌లో గ్రామీణ అభివద్ధి, పంచాయతీ రాజ్ శాఖ స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. అయితే ఆ మీటింగ్‌కు సామాజిక కార్యకర్త మేధా పాట్కర్, ప్రకాశ్ రాజ్‌లు హాజరయ్యారు. దీంతో వివాదం చెలరేగింది. భూ వనరుల శాఖ, పంచాయతీ రాజ్ శాఖలు రెండు ముసాయిదా తీర్మాలను రూపొందించాయి. దానిపై చర్చించేందుకు చేపట్టింది పార్లమెంటరీ ప్యానెల్ మీట్ రసాభాసగా మారింది. తమ అభిప్రాయాలు వ్యక్తం చేసేందుకు కొన్ని ఎన్‌జిఒల తరపున సభ్యులు మీటింగ్ హాజరయ్యారు. పునర్ నివాసం హక్కుల గురించి తమ అభిప్రాయాలు వినిపంచేందుకు కొందరు నేతలు వచ్చారు. అయితే లిస్టులో లేని నేతలు మీటింగ్‌కు ఎలా వస్తారని బిజెపి ఎంపిలు అభ్యంతరం వ్యక్తం చేశారు. మేధా పాట్కర్, ప్రకాశ్ రాజ్ రాక గురించి తమకు వెల్లడించలేదన్నారు. రాజకీయ దురుద్దేశంతో వాళ్లను ఆహ్వానించినట్లు బిజెపి ఆరోపించింది. బిజెఇ ఎంపి పురుషోత్తం రూపాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. జాతీయ ప్రయోజనాలకు చెందిన ప్రాజెక్టులను మేధా పాట్కర్ వ్యతిరేకించారని, ఆమెకు ఈ మీటింగ్‌లో మాట్లాడే హక్కు లేదని రూపాలా అన్నారు. బిజెపి ఎంపిలు డాక్టర్ సంజయ్ జైస్వాల్, రాజు బిస్తా, జుగల్ కిషోర్ కూడా పురుషోత్తం రూపాలాకు సపోర్టు ఇచ్చారు. సాక్షుల జాబితాను పారదర్శకంగా ఇవ్వలేదని, చైర్మెన్ వైఖరిని బిజెపి ఎంపిలు విమర్శించారు.పార్లమెంటరీ ప్యానెల్ మీటింగ్‌కు ప్రకాశ్ రాజ్ ఎందుకు వచ్చారని పలుమార్లు బిజెపి ఎంపిలు ప్రశ్నించారు. సభ్యుల వద్ద ఉన్న లిస్టులో అతని పేరులేదన్నారు. లోక్‌సభ స్పీకర్ అనుమతి ఉన్నట్లు చైర్మెన్ చెప్పినా.. బిజెపి ఎంపిలు ఆమోదించలేదు. కాంగ్రెస్ ఎంపీలు చైర్మెన్‌కు సపోర్టు ఇవ్వగా, బిజెపి ఎంపిలు దీన్ని వ్యతిరేకించారు. పది ఎన్జీవోలకు చెందిన ప్రతినిధులు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడంతో.. బిజెపి ఎంపిలు ఆ మీటింగ్ నుంచి వాకౌట్ చేశారు. దీంతో మీటింగ్‌కు వాయిదా వేశారు.

## ఆకస్మిక మరణాలకు.. కొవిడ్ టీకాలకు సంబంధం లేదు..

### స్పష్టం చేసిన ఐసిఎంఆర్-ఎయిమ్స్ స్టడీ..!



**న్యూఢిల్లీ :** ఆకస్మిక మరణాలకు కరోనా టీకాలకు సంబంధం లేదని ఓ అధ్యయనంలో తేలింది. భారత వైద్య పరిశోధనా మండలి, ఎయిమ్స్ సంయుక్తంగా అధ్యయనం నిర్వహించాయి. కరోనా మహమ్మారి తర్వాత 40 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారిలో హార్ట్ ఎటాక్స్ పెరిగినట్లు నివేదికలు పేర్కొన్నాయి. వీటికి వ్యాక్సిన్ కారణం కాదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇటీవల కర్ణాటకలోని హాసన్ జిల్లాలో పలువురు యువకులు హార్ట్ ఎటాక్‌తో మరణించారు. దీనిపై సిఎం సిద్ధరామయ్య స్పందిస్తూ.. కొవిడ్ టీకాను వేగంగా పంపిణీ చేయడం వల్లే అది జరుగుతుండొచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. చెస్ట్‌లో నొప్పి, ఊపిరాడకపోవడం వంటి లక్షణాలుంటే నిర్లక్ష్యం చేయకుండా దగ్గరలోని ఆసుపత్రిలో వెంటనే పరీక్షలు చేయించుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అయితే, కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ ఆరోపణలను ఖండించింది. ఐసీఎంఆర్, నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ సంస్థలు జరిపిన సమగ్ర అధ్యయనంలో టీకా కారణంగా మరణాలు సంభవించలేదని తేలింది. ఈ అధ్యయనం 2023 మే నుంచి ఆగస్ట్ వరకు 19 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 47 ప్రాంతీయ ఆసుపత్రుల సహాయంతో 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగినవారిపై అధ్యయనం జరిపారు. ఇందులో 2021 అక్టోబర్ నుంచి 2023 మార్చి మధ్య అకస్మాత్తుగా సంభవించిన మరణాలను విశ్లేషించారు. ఈ అధ్యయనంలో హార్ట్ ఎటాక్ కేసుల పెరుగుదలకు జన్యుపరమైన మార్పులు ప్రధాన కారణంగా గుర్తించారు. ప్రస్తుతం ఎయిమ్స్, ఐసీఎంఆర్ నిధులతో పూర్తిస్థాయిలో అధ్యయనం చేపట్టింది. నివేదిక పూర్తి అయిన తర్వాత కూడా నిధులతో మరో పూర్తిస్థాయి అధ్యయనాన్ని చేపట్టింది.ఆకస్మిక మరణాలకు కరోనా టీకా కాకుండా జీవనశైలి, మునుపటి ఆరోగ్య సమస్యలు, కోవిడ్ ఇన్ఫెక్షన్ తర్వాత ఏర్పడిన సమస్యలు, జెనెటిక్ కారణాలు వంటి అనేక అంశాలు కారణమని వివరించారు. కరోనా టీకా మానవాళిని మహమ్మారి నుంచి రక్షించిందని, అనవసరమైన ఆరోపణలు ప్రజల్లో భయాన్ని, టీకాపై నమ్మకాన్ని దెబ్బతీయవచ్చని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. హాసన్ జిల్లాలో గత నెలలో 20 మందికిపైగా అకస్మాత్తుగా మరణించినట్లు కర్ణాటక ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కానీ, ఈ ఘటనలకు సంబంధించి తగిన పరిశోధనలు జరుగుతున్నాయని కేంద్రం తెలిపింది.

## కొన్ని వస్తువులపై జిఎస్టి తగ్గించే యోచనలో కేంద్రం?



**న్యూఢిల్లీ:** ఈ ఏడాది ఆరంభంలో ఆదాయపన్ను రాయితీలతో వేతన జీవులకు కొంత ఊరట కల్పించిన కేంద్రం తాజాగా మరో శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. నిత్యావసర వస్తువులపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) భారాన్ని తగ్గించాలని యోచిస్తున్నట్లు తెలిసింది. మధ్యతరగతి, తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలు ఎక్కువగా వినియోగించే వస్తువులపై ప్రస్తుతం 12 శాతంగా ఉన్న జీఎస్టీ శ్లాబును పూర్తిగా తొలగించడం లేదా ఈ శ్లాబులోని వివిధ వస్తువులను ఐదు శాతం శ్లాబులోకి మార్చడం వంటి ప్రతిపాదనలను కేంద్రం పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. టూత్‌పేస్ట్, టూత్ పౌడర్, గొడుగులు, కుట్టు మిషన్లు, ప్రెజర్ కుక్కర్లు, వంట పాత్రలు, గీజర్‌లు, తక్కువ సామర్థ్యం కలిగిన వాషింగ్ మెషీన్లు, ఎలక్ట్రిక్ ఐరన్ బాక్స్‌లు, సైకిళ్లు, రూ. వెయ్యి కంటే ఎక్కువ ధర ఉన్న రెడీమేడ్ దుస్తులు, రూ.500 నుంచి రూ. వెయ్యి మధ్య గల చెప్పులు, స్టేషనరీ వస్తువులు, వ్యాక్సిన్‌లు, సిరామిక్ టైల్స్, వ్యవసాయ ఉపకరణాలు వంటివి జీఎస్టీ తగ్గింపు జాబితాలో ఉన్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. ఈ నిర్ణయం అమలైతే ప్రతిపాదిత జాబితాలోని వస్తువులు తక్కువ ధరకే అందుబాటులోకి రానున్నాయి. ఈ కారణంగా పేద, మధ్య తరగతి కుటుంబాలపై కొంత భారం తగ్గనుంది. ఈ మార్పుల వల్ల ప్రభుత్వ ఖజానాపై సుమారు రూ. 40 వేల కోట్ల నుంచి రూ. 50 వేల కోట్ల భారం పడొచ్చని అంచనా. అయినప్పటికీ, ధరలు తగ్గితే వినియోగం పెరిగి, దీర్ఘకాలంలో పన్ను వసూళ్లు పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. రాబోయే 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

## వర్ష బీభత్సం... 51 మంది మృతి

**సిమ్లా:** హిమాచల్‌ప్రదేశ్ లో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆకస్మిక వరదలు సంభవించాయి. ఎక్కడికక్కడ కొండచరియలు విరిగిపడుతున్నాయి. ప్రధాన నదులకు వరద ప్రవాహం పెరిగింది. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. అనేక రోడ్లు ధ్వంసమయ్యాయి. ఈ వర్షాకాల సీజన్‌లో ఇప్పటి వరకూ 51 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ రెవెన్యూ శాఖ అధ్వర్యంలోని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ గత నెల 20 నుంచి ఈ నెల రెండో తేదీ వరకూ రాష్ట్రంలో వర్షాల కారణంగా జరిగిన నష్టంపై ఓ నివేదిక విడుదల చేసింది. 12 జిల్లాల్లో ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలను వెల్లడించింది. ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, పిడుగులు పడటం వంటి వర్షాల కారణంగా సంభవించిన ప్రమాదాల్లో 51 మంది మరణించారు. దాదాపు 22 మంది గల్లంతయ్యారు. మండి జిల్లాలో అత్యధికంగా 10 మంది మరణించారు. వర్షాలకు సంబంధించిన ఘటనల్లో 103 మంది గాయపడ్డారని సదరు నివేదికలో వివరించింది. భారీ వర్షాలకు మండి జిల్లాలో బియాస్ నది ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తోంది. చండీగఢ్‌మనాలీ హైవేలోని మండిమనాలీ మార్గంలో అనేక చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాకపోకలు నిలిచిపోయాయి. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో భద్రతా కారణాల దష్ట్యా పలు జిల్లాల్లో అధికారులు పాఠశాలలను మూసివేశారు. మండి, సిర్మౌర్ జిల్లాల్లోని దాదాపు 250కిపైగా రహదారులను అధికారులు మూసివేశారు. 614 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 130 నీటి సరఫరా పథకాలు ప్రభావితమయ్యాయి. భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది.

## విద్యార్థిని ట్రాప్ చేసి.. అత్యాచారానికి పాల్పడిన లేడీ టీచర్



**ముంబై :** ఒక స్టూడెంట్‌ను లేడీ టీచర్ ట్రాప్ చేసింది. అతడికి ఆందోళన తగ్గించే మందు లు ఇచ్చి ఏడాదిగా అత్యాచారానికి పాల్పడింది. విద్యార్థి ప్రవర్తనలో మార్పు గమనించిన తల్లిదండ్రులు అతడ్ని ఆరా తీయగా అసలు విషయం చెప్పాడు. దీంతో పేరెంట్స్ ఫిర్యా దుతో ఆ ఉపాధ్యాయురాలిని పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. ప్రముఖ విద్యా సంస్థలో 40 ఏళ్ల లేడీ టీచర్ ఇంగ్లీష్ బోధి స్తున్నది. వివాహిత అయిన ఆ మహిళకు పిల్లలు కూడా ఉన్నారు. కాగా, 2023 డిసెంబర్‌లో స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా డ్యాన్స్ బృందంలో ఉన్న 11వ తరగతి చదువు తున్న 16 ఏళ్ల మగ విద్యార్థి పట్ల ఆ ఉపాధ్యాయురాలు ఆకర్షితురాలైంది. 2024 జనవ రిలో లైంగిక సంజ్ఞలతో అతడ్ని కవ్వించింది. అయితే తొలుత ఆ విద్యార్థి ఆసక్తి చూప లేదు. ఆ లేడీ టీచర్‌కు దూరంగా ఉన్నాడు. దీంతో తన ఫ్రెండ్ సహాయాన్ని ఆమె కోరింది. ఆ విద్యార్థితో ఆమె మాట్లాడింది. మధ్యవయసు మహిళలు, టీనేజ్ అబ్బాయిల మధ్య సం బంధాలు చాలా సాధారణమని చెప్పింది. దీంతో లేడీ టీచర్‌ను కలిసేందుకు అతడు అంగీకరించాడు. మరోవైపు ఆ విద్యార్థిని ఉపాధ్యాయురాలు కారులో ఒకచోటకు తీసుకెళ్లింది. బలవంతంగా లైంగికంగా వేధించింది. కొన్ని రోజులపాటు ఆ యువకుడు ఆందోళన చెందగా యాంటీ యాంగ్జైటీ మాత్రలు ఇచ్చింది. అతడికి మద్యం తాగించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడింది. కాగా, ఆ విద్యార్థిలో మార్పును అతడి పేరెంట్స్ గమనించారు. అతడ్ని నిలదీయగా లేడీ టీచర్‌తో ఉన్న రిలేషన్ గురించి చెప్పాడు. అయితే తమ కుమారుడి చదువు ప్రభావితం కాకుండా ఉండేందుకు కొంతకాలం వారు మౌనంగా ఉన్నారు. అతడ్ని కట్టడి చేశారు. 12వ తరగతి బోర్డు పరీక్షల తర్వాత ఆ విద్యార్థి ఆ స్కూల్ నుంచి వెళ్లిపోయాడు. అయితే తన పనిమనిషి ద్వారా అతడ్ని ఆ టీచర్ సంప్రదించింది. తనను కలవాలని చెప్పింది. మరోవైపు ఈ విషయం తెలిసిన విద్యార్థి తల్లిదండ్రులు ఆ ఉపాధ్యాయురాలిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోక్సో చట్టంతోపాటు పిల్లల సంరక్షణ చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తు తర్వాత ఆ లేడీ టీచర్‌ను అరెస్ట్ చేశారు. ఆమె వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ ఉపాధ్యాయురాలికి సహకరించిన ఆమె ఫ్రెండ్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

## నాకు ఇంకో దారి లేదు... 'సిఎం పదవి'పై డికె ఆసక్తికర వ్యాఖ్యలు



**బెంగుళూరు:** కర్ణాటకలో నాయకత్వ మార్పు అంశంపై కొన్ని రోజులుగా వినిపిస్తోన్న వ్యాఖ్యలకు చెక్ పడింది. ఐదేళ్లు తానే కర్ణాటక ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సిద్ధరామయ్య స్పష్టంచేశారు. "నేను సీఎంగా కొనసాగుతా. మీకెందుకు అలాంటి అనుమానాలు ఉన్నాయి..?" అని బుధవారం పాత్రికేయులకు వెల్లడించారు. సీఎం మార్పు గురించి విపక్ష పార్టీలు భాజపా, జేడీఎస్ చేస్తోన్న వ్యాఖ్యలను కొట్టిపారేశారు. వారేమైనా కాంగ్రెస్ అధిష్ఠానమా అని ప్రశ్నించారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ..' ఆయన( సీఎం)కు అండగా ఉండటం తప్ప నాకు ఇంకో ఆప్షన్ లేదు. నేను ఆయనకు మద్దతు ఇవ్వాలి. అధిష్ఠానం ఏం చెబితే అది చేయాలి" అని మాట్లాడారు. ఇటీవల కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. మరో రెండు, మూడు నెలల్లో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించే అవకాశముందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎవరు కషి చేశారో అందరికీ తెలుసని.. ప్రస్తుతం పార్టీ అధిష్ఠానం శివకుమార్ గురించే మాట్లాడుతోందన్నారు. సెప్టెంబర్ తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో 'విప్లవాత్మక' పరిణామాలు నెలకొంటాయని కర్ణాటక మంత్రి కె.ఎన్.రాజన్న కూడా ఇటీవల పేర్కొన్నారు. దీంతో త్వరలోనే నాయకత్వ మార్పు తథ్యమని అధికార పార్టీలోనూ విస్తత చర్చ నడిచింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవిపై రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లు రెండున్నరేళ్ల పాటు పదవిలో కొనసాగేలా అంగీకారానికి వచ్చారనే వార్తలూ వచ్చాయి. పలు కేసుల్లో సిద్ధరామయ్య పేరు బయటకు రావడంతో సీఎంగా ఆయనను తొలగించాలన్న డిమాండ్లు తెర పైకి వస్తున్నాయి. శివకుమార్ కూడా ఎప్పటికైనా ముఖ్యమంత్రి పదవిని స్వీకరిస్తాననే బహిరంగంగానే చెబుతున్నారు. ఆ నేపథ్యమూ ఈ చర్చకు దారితీసింది. అయితే వ్యాఖ్యలను డీకే శివకుమార్, కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రణదీప్ సూర్జేవాలా ఇప్పటికే ఖండించిన సంగతి తెలిసిందే. "నా తరఫున ఎమ్మెల్యేలు మాట్లాడాలని కోరుకోవడం లేదు. 2028లో రాష్ట్రంలో జరిగే ఎన్నికల పైనే నేతల దష్టి ఉండాలి. నేను తొలుత పార్టీ కార్యకర్తను. అన్నింటికంటే పార్టీనే ముఖ్యం" అని డీకే స్పష్టంచేశారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పు లేదని సూర్జేవాలా వెల్లడించారు. ఈ ఊహాగానాల వెనక భాజపా కుట్ర ఉందని విమర్శించారు.

## సకాలంలో బిల్లులు పొందండి

ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండల పరిధిలోని ఉత్తటూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ హనుమంతరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్లను నిబంధనల ప్రకారం నిర్మించుకోని సకాలంలో బిల్లులు పొందాలని ఆయన సూచించారు. ఎంపీడీవో యాకుబ్‌నాయక్, తహసీల్దార్ లాల్‌బహుదూర్, ఎంపీవో, ఏఈలు ఉన్నారు.



## ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు

**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండలం ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సిపిఐ చందంపేట మండల కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో పేదలకు ఎక్కడా కూడా ఇండ్లు వచ్చిన దాఖలాలు లేవని కాని నేటి రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అధికారులతో సర్వే నిర్వహించి ఇండ్లు లేని పేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. బిఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి కేవలం బిఆర్ఎస్ కార్యకర్తలకు మాత్రమే డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చుకున్నారని ఇండ్లు లేని నిరుపేదలకు బిఆర్ఎస్ హయాంలో ఎటువంటి లబ్దిచేకూరలేదని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలను గుర్తించి వారికి ఇండ్లు ఇవ్వాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో అన్యాయం జరిగితే వెంటనే మండలాధికారులకు తెలపాలని, ఎవరైనా మధ్యవర్తులు, అధికారులు ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని డబ్బులు ఆశించిన వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రతి పేదకు సిపిఐ పార్టీ అండగా ఉంటుందని ఆయన తెలిపారు.

## భూ తగాదాలతో తండ్రిని హతమార్చిన తనయుడు



**ప్రజాపక్షం/మోతె:** భూ తగాదాలతో ఓ తండ్రిని హత్య చేసిన ఘటన మండల పరిధిలోని విభాళాపురం శివారులో బుధవారం చేటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగయ్యగూడెం గ్రామానికి చెందిన నిమ్మరబోయిన వెంకన్న (58) మృతుని పెద్ద కుమారుడు గంగయ్యతో పాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. వెంకన్న పేరుతో 4 ఎకరాల భూమి ఉండగా, ఆ భూమిలో ఒక ఎకరం కూతురుకు పసుపు కుంకుమ కింద ఒక ఎకరం ఇవ్వగా, మరో మూడు ఎకరాల భూమిని ఇద్దరు కుమారులు పట్టా చేయాలని పలుమార్లు పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయగా భూమి పట్టా చేయడం లేదని తండ్రితో గొడవ పడినట్లు వివరించారు. భూ తగాదాలతో ఘర్షణపడి గొడ్డలితో తలపై కొట్టగా తీవ్రంగా గాయాలు కావడంతో స్థానికులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఘటనస్థలంకు చేరుకుని కొన ఊపిరితో ఉన్న వెంకన్నను సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా ఆసుపత్రిలోనే మృతి చెందినట్లు వైద్యులు తెలపగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట:** వర్షకాల నేపథ్యంలో ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హనుమంతరెడ్డి సూచించారు. బుధవారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణంలోని 28 వార్డులో నిర్వహించిన అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ సిహెచ్ హనుమంతరెడ్డి మాట్లాడుతూ ఇంటిలోని తడి, పోడి చెత్తను వేరు చేసి ఇంటి ముందుకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలని కోరారు. వీధుల్లో సంచరించే కుక్కలకు బెల్టులువేసి, అవసరమైన టీకాలు వేయించాలని తెలిపారు. అలాగే వార్డులో మున్సిపాలిటిలో సరఫరా చేస్తున్న తాగునీటిని పరీక్షించి శుద్ధమైన నీరు అందించనున్నట్లు చెప్పారు. నిరుపేద మహిళలకు స్వయం సహాయక సంఘాలపై అవగాహన కల్పించడం జరిగిందని చిరు వ్యాపారులను గుర్తించి స్ట్రీట్ వెండర్ సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అంజద్‌అలీ, నాయకులు రాపర్తి శ్రీను, మున్సిపల్ డిఈ సత్యారావ, సానిటరీ ఇన్స్‌పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఎఇ తిరుమల్లయ్య, టిఎంసి శ్వేత పాల్గొన్నారు.

## బస్సులురాక విద్యార్థుల ఇబ్బందులు




**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మరిపడిగ గ్రామం నుండి సుమారు 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాచిల్ల గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న మోడల్ స్కూల్‌కు రోజు సుమారు 30 మంది విద్యార్థులు వెళుతుంటారు. విద్యార్థులు పాచిల్ల మోడల్ స్కూల్‌కు వెళ్ళాలంటే ఆర్టిసి బస్సు సౌకర్యంతో వెళ్ళాలి, అయితే ఆర్టిసి బస్సు రోజు సమయానికి రాకపోవడంతో విద్యార్థులు రోజు ఉదయం 9 గంటలకు పాఠశాలకు చేరుకోవాల్సి ఉండగా ఉదయం 10 గంటలకు పాఠశాలకు చేరుకోవడంతో వారికి రోజు ఒక పిరియడ్ కోల్పోవాల్సి వస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బండకొత్తపల్లి వెళ్లే బస్సును మరిపడిగ గ్రామం మీదుగా పంపితే బస్సు మోడల్ స్కూల్ మీదుగా వెళుతుంది కావున విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని విద్యార్థులు తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు. ప్రైవేట్ పాఠశాలలో చదివించే స్తోమత లేక పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తుంటే సమయానికి బస్సులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురిఅయ్యి, చదువుకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొందని, బస్సు సమస్యపై ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్ళిన ఫలితం లేదని తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరుతున్నారు.

## నిబంధనలకు లోబడే పరిశ్రమ నడుపుతున్నాం

ఎండి గోలి మనిందర్ రెడ్డి


**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ మండలం ధర్మోజీ గుడెం గ్రామ పరిధిలోని జై లారా డ్రగ్స్ పరిశ్రమ వల్ల భూ గర్భ జలాలు కలుషితమై పంటలు పండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ బుధవారం పరిశ్రమ ఆవరణలో గ్రామ రైతులు ఆందోళన నిర్వహించారు. స్పందించిన పరిశ్రమ యజమాని గోలి మనిందర్ రెడ్డి మాట్లాడుతూ జై లారా డ్రగ్స్ పరిశ్రమను 2017లో స్థాపించడం జరిగిందని 3 సంవత్సరాల వరకు పరిశ్రమలో ఉన్న బోర్ నీటిని వాడుకున్నామని, మా పరిశ్రమ పరిసర ప్రాంతాల్లోనే చాలా బల్క్ రసాయన పరిశ్రమలు ఉన్నాయని కాలక్రమేనా భూ గర్భ జలాలు కలుషితం కావడం తో మేము కూడా బయట నుండి నీరు కొనుక్కుని పరిశ్రమలో వాడుతగున్నామని తెలిపారు. మా పరిశ్రమ నుండి ఎటువంటి రసాయణాలు ఉత్పత్తి కాదని, కేవలం పెల్లెట్స్ మాత్రమే ఉత్పత్తి అవుతాయని మా పరిశ్రమ నుండే కాలుష్యం వేదజల్లుతుందని భ్రమలో రైతులు ఉన్నారని, వారికి మా పరిశ్రమ ఉత్పత్తుల గుర్చి క్షుణ్ణంగా వివరించామని అన్నారు. అన్ని శాఖల ప్రభుత్వ నిబంధనలకు లోబడి పరిశ్రమ నిర్వహించడం జరుగుతుందని ధర్మోజీగూడెం గ్రామానికి చెందిన వారు కూడా కార్మికులుగా ఉన్నారని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మంత్రి వెంకట్ రెడ్డిలు చొరవ చూపి కాలుశ్య కారక పరిశ్రమలపై చర్యలు చేపట్టాలని పత్రిక ముఖంగా కోరారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ మేనేజర్ అనుధీప్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, ఫణిందర్ రెడ్డి, దివాకర్ రెడ్డి, శ్రీనివాస్ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



# చిక్కరు... దొరకరు...

ఎప్పుడైనా... క్రింది స్థాయి... ఉద్యోగులే బలి పశువులు

తప్పించుకునేందుకు అధికారులు అప్రమత్తం



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో పర్యవేక్షణ లోపం, భద్రత వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈ రెండింటిలో కేవలం విధులు నిర్వహించే కింది స్థాయి ఉద్యోగులు, సిబ్బందే టార్గెట్గా బలి పశువులను చేశారు. హైలెవల్ కమిటీని కూడా ఇక్కడి అధికారులు విచారణలో తప్పుదోవ పట్టించి ముగ్గురు వంటస్వాములు, ప్రిపరేషన్ ఇన్చార్జీని సస్పెండ్ చేసి ఇద్దరు పర్యవేక్షకులకు చార్జీమెమోలు జారీ చేశారు. ఉన్నతాధికారుల చర్యలు కూడా అధికారులకు అనుకూలంగా మారిన్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ప్రతీది మా తప్పిదమే లేదని తప్పించుకోవటం అధికారులకు శరమామూలుగా మా రింది. దేవస్థాన పరిధిలో ఎప్పుడు.. ఏం జరిగినా విభాగానికి చెందిన అధికారులు మాత్రం కడిగిన ముత్యమో లో బయట పడుతున్నారు. కానీ, ఈ సారీ భిన్నంగా ఇద్ద రు పర్యవేక్షకుల నిర్లక్ష్యం కింద బాధ్యులను చేస్తూ చార్జీమెమోలు జారీ చేశారు. ఇక్కడ అవుట్సోర్సింగ్ సిబ్బంది ని ప్రలోభాలతో పావులుగా వాడుకొని బలి చేస్తున్నారు.

**ఆరోపణలను కమిటీ పట్టించుకోలే :** ప్రసాదాల తయారీ కేంద్రంలో గత నెల 28 రాత్రి 2.25 గంటలకు జరిగిన చింతపండు చోరీతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయమైంది. దొంగతనం వెనక అధికారులు ప్రమేయం ఉదా? లేదా? విచారించలేదు. దొంగతం పాల్పడిన వారికి మద్దతు అధికారులు మద్దతు ఇచ్చారని కమిటీ దృష్టి సారించలేదు. తాము చేసిన దొంగతనానికి వంటస్వాముల ప్రమేయం ఉందని ముద్దాయిలు ఆరోపించారు. ఏ అధికారి పేరు చెప్పొద్దు? మీకేం కావలెనో నేను చూసుకుంటానని? దేవస్థానంలో ఓ అధికారి హామి ఇచ్చినట్లు తల్లిదండ్రులు చెప్పారు. ముద్దాయిలు, తల్లిదండ్రుల ఆరోపణలు కమిటీ వినిపించుకోలేదు. రెండో రోజు విచారణ సమయంలో సీసీ పుటేజీల ఆధారంగా అవట్ సోర్సింగ్ లో పని చేసిన దిలీప్ ను విచారించగా అధికారులు పేర్లు బయటపెట్టినట్లు తెలిసింది.

**అధికారులను వదిలేశారు :** కాగా, దేవస్థానంలో అవినీతి, దొంగతనాలు జరిగితే పై స్థాయి అధికారులకు ఎలాంటి బాధ్యత ఉండదా? వారిని ఎందుకు బాధ్యుల చేయరూ? ప్రసాదాల తయా రీ కేంద్రంలో స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించరా? సరుకుల హెచ్చు, తగ్గులను డీఈవో, ఏఈవో స్థాయి అధికారులు ఎందుకు గుర్తించలేదు? స్టాక్ సరిగానే ఉన్నట్లు రిజిస్టర్లపై గుడ్డిగా సంతకం ఎలా చేశారు? ఏఈవో రిజిస్టర్‌లో చేసిన సంతకం కమిటీ గుర్తించలేదాని? భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఆలయ అధికారులు కూడా పరోక్షంగా వాట పొందుతున్నారా? పని ఒత్తిడి వల్ల పరిశీలించకుంటే రిజిస్టర్ ఏముందో తెలియని స్థితిలో సంతకం ఎలా చేశారు? ఈ కోణంలో విచారణ ఎందుకు జరగలేదని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అధికారి సంతకం చేశారంటే అవినీతి జరగనట్టా? కాదా? దేవాదాయ శాఖ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

**ఎందుకు గుర్తించలేదో :** ఏఈవోలను వదిలి పర్యవేక్షకులకు ఎందుకు చార్జీమెమోలు ఇచ్చారో అంతు చిక్కకుంది. దురుద్దేశ్యంతో పర్యవేక్షకులు గుర్తించకపోతే ఏఈవో ఎందుకు గుర్తించలేదోనని సందేహాలు ఉన్నాయి. పారదర్శకంగా కమిటీ విచారణ జరిగితే విభాగంలో విధులు నిర్వహించిన అందరిని బాధ్యులను చేయాలి. కానీ, ఇక్కడ కింది స్థాయి ఉద్యోగి సీనియర్ అసిస్టెంట్ నవీన్, ముగ్గురు వంటస్వాములను (సహాయ పాచకులు) బలి పశువులను చేశారు. ఎంత అవినీతి, అక్రమం జరిగిన డీఈవో, ఏఈవోకు ఎలాంటి బాధ్యతలు లేనప్పుడు విభాగం వారికి అప్పగించడం ఎందుకనే ప్రశ్న తలెత్తుతోంది.

**భద్రత వైఫల్యం :** కొండపైన భద్రత వైఫల్యం కూడా ఉంది. స్థానిక పెట్రోలింగ్ పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు దొంగతనం బయటపడింది. కొండపైన భద్రత సిబ్బంది తనిఖీలు చేపట్టక ఎవరెవరు వచ్చి వెళ్తున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. దొంగతనం జరిగిన రోజున కారు ఎప్పుడు వచ్చింది? అక్కడే ఎందు కు నిలిపారు? అని సిబ్బంది ఎందుకు అనుమానించలేదనే ప్రశ్న తలెత్తుతోంది. టోల్ గేట్ వద్ద టికెట్టు లేని కారును కొండపైన ఎందుకు అనుమతించారని విచారణ జరగలేదు. స్థానిక పోలీసుల సమాచారం మేరకు భద్రత సిబ్బంది స్పం దించే కానీ లేకుంటే దొంగతనం బయటపడేదే కాదు. అరకొర సిబ్బందితో పూర్తి స్థాయిలో పటిష్ఠ భద్రత ఏర్పాటు చేయలేక పోతున్నారు.ఎన్ని ఆరోపణలు వచ్చిన మాకు సంబంధం లేదు. మేం ఎలాంటి పొరపాటు చేయలేదు. మాకు అవినీతి మరకే అంటలేదని తప్పించుకునేందుకు ఇక్కడి అధికారులు ఎప్పుడు అప్రమత్తంగా ఉంటారు. ఆరోపణలు రాగానే క్రింది స్థాయి అధికారులు, సిబ్బందిని ఇరికించే కుతంత్రాలకు తెర తీస్తారు. నయానా, బయానా చేసి వారి వైపు తిప్పుకుంటారు.

## హ్యామ్ విధానంలో డబుల్ రోడ్ల నిర్మాణం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల నుండి జిల్లా కేంద్రాలకు రూ. 12000 కోట్ల రూపాయలతో హ్యామ్ విధానంలో డబుల్ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఈ రహదారి పనులకు ఆగస్టు మొదటి వారంలో టెండర్లను పిలువనున్నట్లు ఆయన వెల్లడించారు. బుధవారం మంత్రి ఉమ్మడి జిల్లా సమీక్ష అనంతరం 6 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన ఆర్అండ్‌బి ఎస్ ఈ కార్యాలయాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖల మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ తో కలిసి ప్రారంభించారు.అనంతరం మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ హ్యామ్ విధానంలో మండల కేంద్రాల నుండి జిల్లా కేంద్రాల డబుల్ రోడ్డు నిర్మాణానికి గాను గత క్యాబినెట్లో ఆమోదం పొందడం జరిగిందని, ఇందులో భాగంగా కాంట్రాక్టర్ 40 , బ్యాంకు ద్వారా 60 శాతం రుణం తీసుకుని రోడ్ల నిర్మాణాన్ని చేపట్టడం జరుగుతుందని వెల్లడించారు. ఈ విషయంపై గురువారం ఎర్రమంజిల్ లోని ఆర్ అండ్ బి ప్రధాన కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నామని, ముందుగా 10 ప్యాకేజీలకు సంబంధించి 3000 కోట్ల రూపాయలతో పనులకు టెండర్లు పిలువనున్నామని , మొదటి దశలో 5190 కోట్లతో, రెండవ దశలో 7000 కోట్లతో పనులు చేపట్టనున్నామని తెలిపారు. హ్యామ్ విధానం 7 రాష్ట్రాల్లో అమల్లో ఉందని, మన రాష్ట్రంలో పంచాయతీరాజ్ ద్వారా కూడా 15 వేల కోట్ల రూపాయలతో, మొత్తం 29 వేల కోట్ల రూపాయలతో హ్యామ్ రోడ్లు నిర్మించనున్నామని చెప్పారు. ఆర్ అండ్ బి శాఖలో ఖాళీగా ఉన్న 150 ఏఈల నియామకానికి టీజిఎస్‌ఎస్సీకి నివేదించినట్లు చెప్పారు. నల్గొండ జిల్లాకు ఆర్ అండ్ బి ద్వారా 12000 కోట్ల రూపాయల పైనే నిధులు ఇవ్వడం జరిగిందని, రహదారులపై ఏ ఒక్క ప్రమాదం జరగకుండా అరికట్టాలన్నదే తమ లక్ష్యమని మంత్రి వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ , దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్, జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్, అండ్ బి ఎస్ ఈ వెంకటేశ్వరరావు ఈ ఈ లు,డి ఈ లు,అసిస్టెంట్ ఇంజనీర్లు ,తదితరులు ఉన్నారు.

## ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజం

నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** ప్రతి ఉద్యోగికి పదవి విరమణ అనేది సహజం అని, పదవి విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ అన్నారు. జిల్లా పోలీస్ శాఖలో దాదాపు 40 సంవత్సరాల కాలం పాటు విధులు నిర్వర్తిస్తూ జూన్ 30 న పదవి విరమణ పొందిన పోలీసు అధికారులు ఎస్ఐ విల్సన్, ఏఆర్ ఎస్ఐ చందులాల్,హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, జూనియర్ అసిస్టెంట్ యాదయ్య, ఎల్.జి.యస్ సత్యనారాయణను బుధవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ ఘనంగా సత్కరించి వారు పోలీసు శాఖకు అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రజలకు సేవలందిస్తూ పదవి విరమణ పొందడం అభినందనీయం అని అన్నారు. పదవి విరమణ పొందిన అనంతరం కూడా పోలీసు కుటుంబ సభ్యులేనని, ఏలాంటి ఇబ్బందులు, సమస్యలు ఉన్నా ఎల్లప్పుడు అండగా ఉంటామని అన్నారు. అనంతరం వారికీ అందవలసిన ఆర్ధిక సదుపాయాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్,ఏ.ఓ శ్రీనివాసులు, ఆర్.ఐ సంతోష్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు జయరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఉత్తమ డాక్టర్ అవార్డు



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వారు తెలంగాణ రాష్ట్రంలో ప్రతి జిల్లా నుండి ఒక ఉత్తమ డాక్టర్ కు అవార్డు ప్రధానం చేయడం జరిగింది. డాక్టర్ వృత్తి నిర్వహిస్తూనే సమాజంలో పేద వారి కోసం సేవా కార్యక్రమాలు నిర్వహించినటువంటి డాక్టర్లను ఆయా జిల్లాల లైన్స్ క్లబ్ వారి ద్వారా డాక్టర్ యొక్క వివరాలు సేకరించి సమాజ శ్రేయస్సు కోసం, పేదవారం కోసం, సేవా కార్యక్రమాలను నిర్వహించినటువంటి డాక్టర్‌ను జిల్లా లైన్స్ క్లబ్ లయన్స్ క్లబ్ ఆఫ్ జోగులాంబ గద్వాల వారి ద్వారా ఎంపిక చేసి వారికి డాక్టర్స్ డే రోజును పురస్కరించుకుని హైదరాబాద్ బంజారాహిల్స్ ప్రసాద్ ఆడిటోరియం నందు ఈ అవార్డును సినీ యాక్టర్ సుమన్ లైన్స్ క్లబ్ 320ఎ గవర్నర్ డాక్టర్ మహేందర్ కుమార్ చేతుల మీదుగా ఇవ్వటం జరిగింది. డాక్టర్ మహేష్ డెంటల్ హాస్పిటల్ ను ప్రారంభించడం జరిగింది. 2003 సంవత్సరం నుండి ఎన్నో రకాల సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూనే ఉన్నారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ జోగులాంబ గద్వాల్ ప్రెసిడెంట్ గట్టు ఈశ్వరయ్య కోశాధికారి ఎ.రామ్మోహన్, సభ్యులు, డాక్టర్ మోహన్‌రావు, వైస్ ప్రెసిడెంట్ కృష్ణయ్య పిడి, సెక్రెటరీ కరాటే శ్రీహరి, సభ్యులు హెచ్‌కె బషీర్ లైన్స్ క్లబ్ జోగులాంబ గద్వాల సభ్యులు అందరితో పాటు డాక్టర్ మహేష్ మిత్రులు, ఉన్నత పోలీసు అధికారి షాకీర్ హుస్సేన్, అడిషనల్ ఎస్పీ రాచకొండ సర్కిల్ పాల్గొన్నారు.

## శిధిలావస్థకు చేరిన ఇండ్లు నేలమట్టం

యాజమానులకు ముందుగా నోటీసులు

ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దం-టున్న అధికారులు




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** శిధిలావస్థకు చేరుకున్న ఇండ్లను మున్సిపల్ అధికారుల ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్ ఉద్యోగులు నేలమట్టం చేస్తున్నారు. పట్టణంలో శిధిలావస్థకు చేరిన ఇండ్లను ముందుగా గుర్తించి వారిని నోటీసులు జారీ చేస్తున్నారు. వర్షకాలం కావడంతో ఇండ్లు కూలి ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని చెబుతూ అందులో నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయిస్తున్నారు. శిధిలావస్థకు చేరిన ఇండ్లలో నివాసం ఉంటూ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని అధికారులు చెబుతున్నారు. సూర్యాపేట పట్టణం 92 చదరపు కిలో మీటర్ల మేరకు విస్తరించి ఉంది. దాదాపు 30వేలకు పైగా నివాసాలు ఉండగా, 1 లక్షా 60వేలకు పైగా జనాభా ఉంది. 48 వార్డులుండగా పట్టణంలో దాదాపు వందకుపైగా శిధిలావస్థకు చేరిన నివాసాలు ఉన్నాయి. ఇందులో ఇప్పటికే మున్సిపల్ ఉద్యోగులు 40 వరకు గుర్తించారు. ఈ ఇంటి యాజమానులకు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారు. వర్షకాలం కావడంతో శిధిలావస్థకు చేరిన ఇండ్లు ఇప్పటికే ఇంటిపైకప్పులు పెచ్చులూడి కిందపడటం, గొడలు కూడా నెర్రలు బారీ ఉండటంతో జెసిబి ల సాయంతో ఆలాంటి ఇండ్లను నేలమట్టం చేస్తున్నారు. కొంత మంది ఇంటి యాజమానులు తామే వాటిని కూల్చుతామని చెబుతూ కొంత సమయాన్ని కోరుతున్నారు. కాని అధికారులు మాత్రం అందులో నివాసం ఉంటే మీ ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని, పైసా ఖర్చులేకుండా మేమే కూల్చివేస్తామని సదరు ఇంటి యాజమానులకు అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు. ఇదిలా ఉంటే కొందరు తమ ఇళ్లను కూల్చవద్దని, ఇది కూడా లేకుంటే తాము రోడ్డున పడతామని, ఇందిరమ్మ ఇండ్లను తమకు ఇప్పించాలని అధికారులను వేడుకుంటున్నారు. ఇదికాక గత ప్రభుత్వ హాయంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలోనైనా తమకు కేటాయించాలని కోరుతున్నారు. సూర్యాపేట పట్టణంలో శిధిలావస్థకు చేరుకున్న ఇండ్లు ఎక్కువగా కొత్తగూడెం బజార్, కస్తూరి బజార్, బొడ్రాయి బజార్, రాజీవ్‌నగర్ ఉన్నాయని అధికారులు గుర్తించారు. ఇప్పటికే శిధిలావస్థకు చేరుకున్న ఇండ్లను జెసిబి సహయంతో నేలమట్టం చేస్తున్నారు. దీని కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ వర్షాలు భారీగా పడకముందే పూర్తి చేయాలని అధికారులు కృతనిశ్చయంతో ఉన్నారు.


## కోర్టు తీర్పు మేరకే భవనం కూల్చివేత



**ప్రజాపక్షం/చండూరు:** గ్రామకంతం భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా భవన నిర్మాణాన్ని చేపట్టినందుకు కోర్టు ఉత్తర్వుల మేరకు భవనాన్ని మున్సిపల్ అధికారులు కూల్చివేయడం జరిగిందని చండూరు మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ చండూరు మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం , మున్సిపల్ కోఆర్డినేటర్ గంట సత్యం అన్నారు. బుధవారం చండూరులోని రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మాణం చేపట్టి కోర్టు ఉత్వర్వులను దిక్కరించి కాంగ్రెస్ పార్టీ నాయకులపై ,ఎంఎల్ఎ రాజగోపాల్‌రెడ్డిపై బురద చల్లే చిల్లర రాజకీయాలు చేయడం బిఆర్ఎస్ నాయకులకు తగదని హెచ్చరించారు. ఎంఎల్ఎ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అందరివాడని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనునిత్యం పాటుబడే నాయకుడని అన్నారు. టిఆర్ఎస్‌లో కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి వేదిస్తుంటే బీసీ నేతగా గత మున్సిపల్ ఎన్నికల్లో రాజగోపాల్‌రెడ్డి అక్కునచేర్చుకొని ఎన్నికల్లో గెలిపించుకొని పైస ఖచ్చు లేకుండామున్సిపల్ చైర్మన్ చేసిన సంగతి మర్చిపోయావా తోకల వెంకన్న అన్ని ప్రశ్నించారు. చిల్లర రాజీయాలు పక్కన పెట్టి బిఆర్ఎస్ నాయకులు ఒళ్లు దగ్గరపెట్టుకొని వాస్తవాలు మాట్లాడాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లె వెంకన్న , దోటి వెంకటేశ్ యాదవ్, డాక్టర్ కోడి శ్రీనివాసులు , కావలి ఆంజనేయులు , భూతరాజు ఆంజనేయులు , కలిమికొండ జనార్ధన్ , నల్లగంటి మల్లేశం , అబ్బనబోయిన లింగయ్య , మంచుకొండ సంజయ్ , సాపిడి రాములు , కడారి లక్ష్మణ్ ,బుర్కల ఎలక్షన్ , పంతంగి గిరి, రాంమూర్తి , మారయ్య తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ విధానాలపైన ఉద్యమం

ఎఐవైఎఫ్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు సురేష్



**ప్రజాపక్షం/మర్రిగూడ:** దేశ ప్రయోజనాలను ప్రతిష్టను అమెరికాకు తాకట్టు పెడుతున్న నరేంద్ర మోదీ విధానాలపై ఉద్యమించాలని భారతీయులపై అమెరికా దుర్మార్గపు చర్యను ఆపాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బూడిద సురేష్ అన్నారు. అమెరికా రాయబార కార్యాలయాన్ని ముట్టడి వెళుతున్న నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ విధానాలు దేశానికి ప్రమాదకరమని దేశాన్ని తిరోగమన దిశలో తీసుకెళ్లే విధానాలను అనుసరిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు వత్తాసు పలుకుతూ దేశ సార్వభౌమత్వాన్ని ప్రతిష్టను నష్టపరిచే చర్యలను దేశ పౌరులు తిప్పుకొట్టాలన్నారు భారత పౌరులపై అమెరికా దుర్మార్గంగా వ్యవహరించడాన్ని అభ్యంతరం చెప్పడంలో నరేంద్ర మోదీ విఫలమవడం ద్వారా మరోసారి తన క్రూరమైన వైఖరిని అమెరికా బహిర్గతం చేసిన మోదీ ప్రభుత్వం మౌనం వహించడం సిగ్గుచేటు అన్నారు దేశ ప్రజల రక్షణకు అమెరికా రాయబార కార్యాలయాన్ని ముట్టడి కార్యక్రమం విజయవంతం చేయాలనీ వెళ్తున్న మమ్మల్ని అరెస్టు చేయడం నీతిమాలిన చర్యని ఈ సందర్భంగా వారు అన్నారు.

## గోదావరి వరదల పట్ల మండల స్థాయి సమీక్ష సమావేశం

ప్రజాపక్షం/పినపాక : వర్షాకాలం ప్రారంభమైనందున జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గోదావరి వరదలు, స్థానిక వాగుల వలన ముంపునకు గురి అయ్యే ప్రాంతాలలో శాఖల వారీగా తీసుకోవలసిన ముందస్తు చర్యలపై పినపాక మండల కేంద్రంలో ఎంపీడీఓ అధ్యక్షతన సమీక్షా సమావేశం బుధవారం జరిగింది. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సునీల్ కుమార్, ఇంచార్జ్ తహశీల్దార్ గోపాల కృష్ణ, ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, ఎంపివో వెంకటేశ్వరరావు లు మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గోదావరి, పెద్ద వాగు ముంపు ప్రాంతాలలో, కట్టుదిట్టమైన భద్రత చర్యలను చేపట్టాలని, వరదలు పట్ల అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు మండల కేంద్రంలోని కంట్రోల్ రూమ్ కు సమాచారం అందించాలని సమావేశంలో సూచించారు. కార్యక్రమం లో అన్ని శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సింగభూపాలెం చెరువుకు జలకళ



ప్రజాపక్షం/సుజాతనగర్ : సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువుకు జలకళ సంతరించుకుంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సుమారు 12అడుగుల నీరు చేరింది. చెరువు ఆయకట్టు 200, 400 ఎకరాలలో రైతులు పంట సాగుచేస్తారు. చెరువు మీద ఆధారపడి ప్రధాన పంటగా వరిసాగు చేస్తున్నారు. దానితోపాటు మొక్కజొన్న, కూరగాయలు, పంటలు సాగవుతున్నాయి. ఇప్పటికే కొంతమంది రైతులు తమ వరి నారుమళ్ళు సిద్ధం చేసుకుని వరి నాట్లు వేస్తున్నారు. వర్షాలు ఏడాది సమృద్ధిగా రావడంతో చెరువుకు అలుగు పారుతుందని, తమ యాసంగి పంటలకు నీరు అందుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



## నాగరాజు మృతి 'సిపిఐ'కి తీరని లోటు

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి

ప్రజాపక్షం/చింతకాని : సిపిఐ నాయకుడు ఆవుల నాగరాజు మృతి పార్టీకి తీరని లోటని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. వందనం గ్రామానికి చెందిన సిపిఐ నాయకుడు ఆవుల నాగరాజు బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్రసమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి వందనం చేరుకొని నాగరాజు మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జమ్ముల మాట్లాడుతూ నాగరాజు వందనం గ్రామంలో పార్టీ ఎదుగుదలకు ఎంతో కృషిచేశాడని, బ్రతికినంత కాలం నిబద్ధత గల కమ్యునిస్టుగా బ్రతికాడన్నారు. పార్టీ పిలుపిచ్చిన ప్రతి కార్యక్రమంలో నాగరాజు ముందుండేవారని గుర్తు చేసుకున్నారు. నాగరాజు కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. నివాళులర్పించినవారిలో పార్టీ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, మండల కౌన్సిల్ సభ్యులు గోగుల ఆది, బోళ్ల మల్లేశ్వరరావు, అమర్లపుడి వెంకన్న, సిపిఐ గ్రామ నాయకుడు ఆవుల మంగయ్య తదితరులు ఉన్నారు.

### ఉద్యోగ పేరిట మోసం

## యువకుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాపక్షం/పినపాక : మణుగూరు సింగరేణిలో ప్రైవేట్ సెక్యూరిటీ ఉద్యోగం ఇప్పిస్తానంటూ దళారీలు లక్షా యాభై వేల రూపాయలు దోచుకున్న ఘటన కలకలం రేపింది. బాధితుడికి ఉద్యోగం రాకపోవడంతో, వారు మరోసారి రూ.30,000 డిమాండ్ చేశారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన పినపాక మండలంలోని పొట్లపల్లి గ్రామానికి చెందిన పూనెం బక్కయ్య కుమారుడైన పూణెం సప్రిట్ అనే యువకుడు ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని మణుగూరు 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో భద్రాచలం ఆసుపత్రికి పంపించారు. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు దళారీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



## విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు

### ఎఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వరక అజిత్

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : నేడు పాల్వంచలో జరగే అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) జిల్లా 4వ మహాసభను జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వరక అజిత్ అన్నారు. మహాసభ విజయవంతాన్ని కోరుతూ బుధవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆనాడు దేశ స్వాతంత్రం, శాస్త్రీయ విద్యావిధానం కోసం, చదువుతూ పోరాడు, చదువుకై పోరాడు అనే నినాదంతో అలుపెరగని పోరాటాలు చేస్తూ నిరంతరం విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఎఐఎస్ఎఫ్ అన్నారు. ఇదే నేపథ్యంలో నేడు జిల్లా మహాసభ జరగబోతోందని, ఈ సభ విజయవంతానికి పెద్ద ఎత్తున విద్యార్థులు కదలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గుండాల సుజన్, గుగులోత్ వంశీ, నాయకులు వినయ్, రాజ్‌కమల్ తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తు అంతా కమ్యూనిస్టులదే

### జులై 9న దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మె




ప్రజాపక్షం/ములకలపల్లి : భవిష్యత్తు కాలం అంతా కమ్యూనిస్టులదేనని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో రెండు రోజుల పాటు జరుగుతున్న సిపిఎం రాజకీయ శిక్షణ తరగతుల్లో పార్టీ నిర్మాణం, పని పద్ధతులు అనే అంశంపై క్లాసు బోధించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి ప్రజా పోరాటాలతో పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం పరిచి ప్రజా పోరాటాలు ఉధృతం చేయాలని తెలిపారు. జులై 9న దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, మండల నాయకులు పూకంటి రవికుమార్, నిమ్మల మధు, పోడియం వెంకటేశ్వర్లు, మాలోతు రావూజా, గౌరీ నాగేశ్వరరావు, పాయం అమల, సోయం కృష్ణ, అనసూర్య, గోపగాని లక్ష్మీ నరసయ్య, బైరు ప్రసాద్, సోయం కృష్ణ, కొంద్రు రాఘవయ్య, చేడే పద్మావతి, శ్రీరాములు, దేవేందర్ పాల్గొన్నారు.

## వర్షాలు కురుస్తున్నా మ్యూజియానికి ఆదరణ తగ్గలేదు

### ఐటిడిఎ పిఒ రాహుల్

ప్రజాపక్షం/భద్రాచలం : కుండపోతగా వర్షాలు పడుతున్నప్పటికీ ఐటిడిఏలో ఏర్పాటు చేసిన గిరిజన మ్యూజియానికి ఆదరణ తగ్గలేదని, నానాటికీ సందర్శకులు తాకిడి పెరుగుతూనే ఉందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. ట్రైబల్ మ్యూజియానికి వచ్చే సందర్శకుల గురించి మ్యూజియం నిర్వాహకులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ దేవస్థానికివచ్చే భక్తులు మ్యూజియాన్ని సందర్శించే విధంగా ఆటో రిక్షా యూనియన్ల వారితో సమావేశం నిర్వహించి వారికి అవగాహన కల్పించినందున వారి సహకారంతో భక్తులు ఎక్కువగా మ్యూజియం సందర్శిస్తున్నారన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి వచ్చిన పలువురు మహిళలు ఆటోరిక్షా వారి ద్వారా వివరాలు తెలుకునని మ్యూజియాన్ని సందర్శించి పాత తరం గిరిజనులు, పెయింటింగ్ చిత్రాలు, ఇతర కళాకండాలు తనివితీరా చూసి ఆనందం వ్యక్తం చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ ప్రభాకరరావు, మ్యూజియం ఇంచార్జ్ వీరస్వామి, సిబ్బంది మాధవి, మణికుమారి తదితరులు పాల్గొన్నారు.

# నాయకులకు క్రమశిక్షణ ముఖ్యం

### ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
### ఖర్గె పర్యటనను విజయవంతం చేయాలి
### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : రాజకీయాల్లో రాణించాలంటే నాయకులకు, కార్యకర్తలకు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అధ్యక్షతన పట్టణ, మండల, గ్రామ బూత్ స్థాయి అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి, ఖమ్మం జిల్లా ఇంచార్జిలు, టిపిసిసి మాజీ అధ్యక్షులు డా. శ్రావణ్ కుమార్‌రెడ్డి, చక్కిలం రాజేశ్వరరావు, దైదా రవీందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏ స్థాయి నాయకుడైనా ప్రజాభిమానం పొందాలంటే క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. క్రమశిక్షణ లేకుండా ఏ వ్యవస్థలోనైనా రాణించడం కష్టమన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ తన మనుగడను కాపాడుకునే ప్రయత్నం చేస్తుందని అందు కోసమే కాంగ్రెస్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పోలవరం బసకచర్ల ప్రాజెక్టులపై బిఆర్ఎస్ చేసే ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని సెంటిమెంట్‌తో మరోమారు రాష్ట్రంలో అలజడి సృష్టించాలని చూస్తున్నారని తుమ్మల విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్‌చౌదరి, మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, బ్లాక్ అధ్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు సొసైటీ చైర్మన్ రావూరి సైదబాబు పాల్గొన్నారు.



### చదువుతోనే పేదరికం దూరం
#### గ్రామాలు పచ్చగా, పరిశుభ్రంగా ఉండాలి

ప్రజాపక్షం/రఘునాథపాలెం : నిరుపేదలకు మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. చదువుతోనే పేదరికం దూరమవుతుందని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను బాగా చదివించాలని మంత్రి తెలిపారు. బుధవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రఘునాథపాలెం మండలం చిమ్మపుడి గ్రామం లో పర్యటించి ఎస్సి కాలనీ నందు రూ.80లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు, రూ.4.95 కోట్లతో చిమ్మపుడి నుంచి పండితాపురం వరకు బిటి రోడ్డు నిర్మాణ పనులకు, రూ.150 కోట్లతో చిమ్మపుడి నుంచి మంచుకొండ వరకు నిర్మించనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ గ్రామాల్లో గుడిసెల్లో ఉండే నిరుపేదలకు మొదటి విడత ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దశల వారీగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, జెడ్పిసిఈవో దీక్షారైనా, ఆర్డివో జి. నర్సింహారావు, జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, పిఆర్ఎస్ఇ వెంకటరెడ్డి, ఆర్ అండ్‌బి ఇఇ పవార్, రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత, ఎంపిడివో అశోక్‌కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, సాధు రమేష్‌రెడ్డి, వాంకుడోత్ దీప్లానాయక్, తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు శాపంకానున్న నిర్లక్ష్యం

### నిర్మాణంలో జాప్యానికి బాధ్యులెవరు?
### సాగర్ యుటిని పరిశీలించిన రైతు సంఘం నేతలు

ప్రజాపక్షం/ ఖమ్మం : అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారనుందని, ఇదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తే ఆందోళన చేపట్టక తప్పదని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు హెచ్చరించారు. అధికారుల తీరు దేవుడు వరమిచ్చినా పూజారి వరమియ్యని చందంగా ఉందని ఆయన తెలిపారు. రైతు సంఘం నేతలు బుధవారం పాలేరు వద్ద యుటిని పరిశీలించారు. గతేడాది సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలకు పాలేరుకు పెద్ద ఎత్తున వరద రావడంతో సాగర్ కాలువపై వరద పడి పాలేరు వద్ద కాలువ చాలా దూరం కొట్టుకుపోయింది. ఇక్కడ అండర్ టన్నెల్ (యుటి)దెబ్బతిన్నది మరల వ్యవసాయ సీజన్ ప్రారంభమైన ఇక్కడ పనులు పూర్తి చేసి కాలువను పునరుద్ధరించడంలో జాప్యం జరుగుతుండగా ఆ పనులను రైతు సంఘం నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ ప్రభుత్వంనిధులు మంజూరుచేసినా అధికారుల ఆలసత్వం కారణంగా పనులు పూర్తికాలేదన్నారు. ఇప్పుడు శ్రీశైలానికి వరద వస్తుందని, ఆ తర్వాత నాగార్జున సాగర్‌కు చేరే అవకాశం ఉందన్నారు. జులై మాసం వచ్చినా పనులు పూర్తి కాకపోవడంతో సాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. ఇదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తే కార్యాలయాలను ముట్టడించడంతో పాటురైతులను సమీకరించి ఆందోళనలు చేపడతామని గోవిందరావు హెచ్చరించారు. జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, రైతు సంఘం నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, ఏపూరి రవీంద్రబాబు, కూచిపూడి రవి, బానోత్ రాంకోటి, యడ్లపల్లి శంకరయ్య, బాగం ప్రసాద్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, భాస్కర్‌రావు, మామిడి సుదర్శన్‌రెడ్డి, పావులూరి మల్లికార్జున్‌రావు, వెన్నం భాస్కర్, పాసంగుల చందర్‌రావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఇఎల్ఐ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


### వరంగల్ ప్రాంతీయ పిఎఫ్ కమిషనర్ శ్రీనివాస్

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఉపాధి సంబంధిత ప్రోత్సాహక (ఈఎల్ఐ) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ ప్రాంతీయ పిఎఫ్ కమిషనర్ వైడి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 99446 కోట్ల ఆర్థిక వ్యయంతో రెండేళ్ల వ్యవధిలో 3.5 కోట్ల ఉద్యోగాలు సృష్టించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి సంబంధిత ప్రోత్సాహక పథకాన్ని ఆమోదించిందన్నారు. ఇందులో 1.92 కోట్ల మందికి తొలిసారిగా ఉద్యోగంలో ప్రవేశించే లబ్ధిదారులు ఉంటారన్నారు. ఉపాధి సంబంధిత ప్రోత్సాహక పథకంలో తొలి సారి ఉద్యోగంలోకి వచ్చేవారికి ప్రోత్సాహకం, యజమానులకు మద్దతు రెండు భాగాలు ఉంటాయన్నారు. తయారీ రంగంపై ప్రత్యేక దృష్టి సారించి ఈ పథకం అమలు చేస్తామని తెలిపారు. ఈ పథకం యొక్క ప్రయోజనాలు 2025 ఆగస్టు ఒకటి నుంచి 2027 జులై 31 మధ్య సృష్టించబడిన ఉద్యోగాలకు వర్తిస్తాయన్నారు. వ్యవస్థీకృత రంగాల్లో కొత్తగా ఉద్యోగంలోకి వచ్చే వారికి ఒక నెల జీతం (గరిష్టంగా రూ. 15వేలు) రెండు విడతలుగా బ్యాంక్ ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. మొదటి విడత ఆరు నెలల సేవ అనంతరం, రెండవ విడత 12 నెలల సేవ, ఆర్థిక సాక్షరత కార్యక్రమం పూర్తి చేసిన తర్వాత అందిస్తామన్నారు. నెలకు రూ.లక్ష లోపు వేతనం ఉన్న వారికి ఈ పథకం అమలవుతుందని, 1.92 కోట్ల మంది లబ్ధిదారులకు ఈ పథకం అమలు చేస్తామన్నారు. యజమానులకు మద్దతు క్రింద అన్ని రంగాల్లో ఉద్యోగాల సృష్టికి ప్రోత్సాహకాలు అందిస్తామని, ముఖ్యంగా తయారీ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రతి కొత్త ఉద్యోగికి యజమానులకు నెలకు రూ. 3వేల ప్రోత్సాహం రెండేళ్ల పాటు అందిస్తామని తెలిపారు. తయారీ రంగానికి ఈ ప్రోత్సాహకాలు మూడు, నాలుగేళ్లకు పొడిగించబడతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి సంబంధిత ప్రోత్సాహక పథకం పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సమాచారం కోసం వరంగల్ పిఎఫ్ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన తెలిపారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు

### ఎమ్మెల్యే కోరం కనకయ్య

ప్రజాపక్షం/కామేపల్లి : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతాయని, ప్రస్తుతం రానివాళ్లు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, దశల వారీగా ఇండ్లతో పాటు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన పథకాలు మంజూరు అవుతాయని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, మాజీ జెడ్‌పిటిసి, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, గింజల నర్సిరెడ్డి అన్నారు. బుధవారం కామేపల్లి మండలంలోని రాయగూడెం, బర్లగూడెం, గోవింద్రాల తదితర పలు గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ప్రధాన సంక్షేమ కార్యక్రమాలైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతి అక్రమాలు వలన ఎంతో లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజా సంక్షేమం కోసం మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలను అమలు చేస్తూ ఉందని, గత ప్రభుత్వం ఏమీ చేయలేకపోయినప్పటికీ, ప్రజలు ఎక్కడ మరిచిపోతారో అన్న భయంతో తమ ఉనికిని కాపాడుకోవడానికి ప్రతిసారి కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తుందని, దీనికి ధీటుగా రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తమ సత్తా చూపాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఎంపిడివొ రవీందర్, గింజల నర్సిరెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, తోటకూరి శివయ్య, ధనియాకుల హనుమంతరావు, మాలోత్ సరిరామ్ నాయక్, మాజీ ఎంపిపి జరపల లక్ష్మణ్, మద్దినేని రమేష్, నల్లమోతు లక్ష్మయ్య, దమ్మాలపాటి సత్యం, చింటూ నాయక్, బొడ్డు లక్ష్మీనారాయణ, బావ్‌సింగ్, ఆలోత్ మోహన్, గుగులోత్ రవి, పర్మిశెట్టి సాంబయ్య, లకావత్ రాములు, బానోతు ధాన్య, ఆలెం రవి, గోపిరెడ్డి కోల వెంకటేశ్వర్లు, జక్కంపూడి వెంకటేశ్వర్లు, చల్ల మల్లయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులు, అనధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.





### ఇండ్ల పట్టాలు పంపిణీ చేసిన ఎఎంసి చైర్మన్

ప్రజాపక్షం/రఘునాథపాలెం : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు దశల వారీగా మంజూరు చేస్తుందని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా మొదటి విడతలో 40 మంది లబ్ధిదారులకు మంజూరైన ఇండ్ల పట్టాలను మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు ముఖ్య అతిథిగా విచ్చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసు మేరకు మంజూరైన ఇండ్ల పట్టాలను లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఇండ్లు లేని నిరుపేదలకు ఐదు లక్షలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ప్రత్యేకాధికారి నగేష్, డిఈ జగ్రామ్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు బానోత్ కిషోర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కాపా ఆదినారాయణ, దార మాధవరావు, నాయకులు కిలారు వెంకటరమణ, దరావత్ వీరునాయక్, కుతుంబాక సత్యనారాయణ, రాపర్తి రాజా, తగరం ఆదాం, తగరం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మోదీ ప్రభుత్వం కార్మికులపై పనిభారం మోపుతున్నది : ఎఐటియుసి

### జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె



ప్రజాపక్షం/సత్తుపల్లి : ఈనెల 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి మధ్యాహ్న భోజనం పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్నం భోజనం పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సత్తుపల్లి మండల విద్యాశాఖ కార్యాలయంలో వీరస్వామికి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా నిమ్మటూరి రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం 11 సంవత్సరాలుగా పరిపాలన సాగిస్తున్నా, మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.600/లు మాత్రమే వేతనంగా ఇస్తుందని, నరేంద్ర మోదీ ప్రభుత్వం గొప్పలు చెబుతూ, కార్మికులపై పనిభారం మోపుతూ, వారిని వెట్టిచాకిరికి గురిచేస్తుందని మండిపడ్డారు. సుప్రీంకోర్టు గైడెన్స్ ప్రకారం, తక్షణమే కనీస వేతనం చట్టాన్ని అమలు చేయాలని, స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించి వారికి కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మెనూ చార్జీలు, కోడిగుడ్డు బిల్లులు, 9, 10 తరగతి బిల్లులను తక్షణమే చెల్లించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరకొరగా పెంచే మెనూ చార్జీల వల్ల ఉపయోగం లేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి రోజుకు రూ.30 ఇవ్వాలని, లేనిపక్షంలో ప్రభుత్వమే నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని, గ్యాస్ ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్కీమ్ వర్కులను కార్మికులుగా గుర్తించాలని ఎఐటియుసి తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి సత్తుపల్లి మండలం కార్యదర్శి తెలగారపు రామారావు, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు జక్కంపూడి వెంకటలక్ష్మి, మహాదేవ లక్ష్మి, గుదే రాజ్యలక్ష్మి, కనకదుర్గ, కృష్ణవేణి, సీత, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా ఎఐవైఎఫ్ నేతల అరెస్టు



ప్రజాపక్షం/ఖమ్మం : ఉమ్మడి ఖమ్మంజిల్లా వ్యాప్తంగా అఖిల భారత యువజన సమాఖ్య నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. యుద్ధోన్మాదిగా వ్యవహరిస్తున్న ట్రంప్ వ్యవహార తీరును నిరసిస్తూ అఖిల భారత యువజన సమాఖ్య హైదరాబాద్ లోని అమెరికన్ రాయబారి కార్యాలయాన్ని ముట్టడించాలని పిలుపునిచ్చింది.


ఇందులో భాగంగా ఖమ్మం జిల్లా నుంచి ఆందోళన కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తున్న అనేక మంది కార్యకర్తలను పోలీసులు నిర్దాక్షిణ్యంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అరెస్టయిన వారిలో ఎఐవైఎఫ్ రాష్ట్రనాయకులు సిద్దినేని కర్ణకుమార్, జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, శ్రావణ్, వెంపటి సురేందర్, వీరభద్రం సహా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు.

ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నేతలు మాట్లాడుతూ అమెరికా తన వైఖరిని మార్చుకునేంత వరకు ఏదో ఒక రూపంలో ఆందోళన కొనసాగుతూనే ఉంటుందన్నారు.

## 42 శాతం రిజర్వేషన్ తరువాతే స్థానిక ఎన్నికలు

### హామీలను విస్మరిస్తున్న కాంగ్రెస్
### మీడియా సమావేశంలో ఎంఎల్‌సి కవిత



ప్రజాపక్షం/ ఖమ్మం : 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత తెలిపారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను కేంద్రం మూడు నెలల్లో ఆమోదించాలని ఇందుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఆమె డిమాండ్ చేశారు. ఇటీవల మరణించిన వైరా మాజీ శాసన సభ్యుడు బానోత్ మదన్‌లాల్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ బిసి బిల్లును ఆమోదించేందుకు కేంద్రంపై ఒత్తిడి తెచ్చే క్రమంలో ఈనెల 17న రైల్ రోకో నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఖమ్మం మీదుగా ఢిల్లీ వెళ్లే ఒక్క రైలు కూడా కదలకూడదని ఆమె సూచించారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ బిజెపి ప్రభుత్వం బిసి బిల్లును ఆమోదించాలని ఇందుకు బిజెపి నూతన అధ్యక్షుడు రాంచందర్‌రావు చొరవ తీసుకోవాలని ఆమె కోరారు. రైతు భరోసా నిధులు పంపిణీ చేసి ఎన్నికలకు వెళ్దామని ప్రభుత్వం అనుకుంటున్న రైతులు ఎవరు సంతోషంగా లేరన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు రైతులను వేధిస్తే ముగ్గురు మంత్రులున్నా మాట్లాడలేదని ఆమె తెలిపారు. సన్న వడ్ల బోనస్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బోగస్ పథకంగా మార్చిందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలుచేయాలని మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాల్సిందేనన్నారు. పెన్షన్ల పెంపుదల తదితర హామీలను విస్మరిస్తే ఈ ప్రభుత్వాన్ని ప్రజలు సహించరన్నారు. మీడియా సమావేశంలో కూరాకుల నాగభూషణం, ఆర్‌జెసి కృష్ణ, పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి, ఇంటర్ చదువుటకు ఓపెన్ స్కూల్ ప్రారంభం

ప్రజాపక్షం/కరకగూడెం : కరకగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ 202526 విద్యా సంవత్సరం నుండి నూతనంగా తెలంగాణ సార్వత్రిక విద్యా విధానం (ఓపెన్ స్కూల్) ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదువుటకు కరకగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రం నుండి ఓపెన్ స్కూల్ ప్రారంభం అడ్మిషన్లు జరుగుతున్నాయని కరకగూడెం మండల తెలంగాణ ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ జి మంజుల బుధవారం వెల్లడించారు. కావున చదువు మధ్యలో ఆపేసి లేదా రెగ్యులర్‌గా పాఠశాలలకు వెళ్లలేని వారికోసం తెలంగాణ సార్వత్రిక విద్యా విధానం ద్వారా చదువుకునే అవకాశాన్ని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ కల్పిస్తున్నాయని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలిపారు. ఓపెన్ స్కూల్/ఇంటర్మీడియట్ అడ్మిషన్లు పొందుటకు ఈ క్రింది సర్టిఫికెట్ తో పదవ తరగతి చదువుకునేవారు టిసి, బర్త్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు పాస్ ఫోటో, ఇంటర్మీడియట్ చదువుకునే వారు పదవ తరగతి మార్కుల పట్టిక కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ సర్టిఫికెట్ పాస్ ఫోటోలతో సంప్రదించాలని (సెల్ : 9491104082) విజ్ఞప్తి చేశారు.

## మృతుల కుటుంబాలకు చల్లా పరామర్శ

ప్రజాపక్షం/సంగెం : మండలంలోని పల్లారుగూడ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు కోడూరు రఘు తండ్రి కోడూరు లింగయ్య ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బుధవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నషావత్ తండాకు చెందిన బిఆర్ఎస్ నాయకుడు బాదావత్ బొంద్యా అకాల మృతిచెందగా మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుంటపల్లిలో మృతిచెందిన దడిగెల మొగిలియ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. గ్రామంలో ఇటీవల కన్న తల్లిపై పెట్రోల్ పోసి కొడుకు నిప్పంటించిన ఘటనలో మృతిచెందిన ముత్తినేని వినోద కుటుంబాన్ని చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఘటనకు సంబంధించిన కారణాలను మృతురాలి భర్త సాంబయ్యను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట మండల బిఆర్ఎస్ నాయకులు, మాజీ జడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాబు, కోడూరు సదయ్య, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్, బిచ్చనాయక్‌తో పాటు కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నర్మెట కెజిబివిని సందర్శించిన అదనపు కలెక్టర్



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి : అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ జిల్లాలోని నర్మెట మండల కెజిబివిని బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలను పరిశీలించి విద్యార్థుల సంఖ్యను, మెనూను, పరిసరాల పరిశుభ్రతపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలో సమస్యలను ఉపాధ్యాయులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పక పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. వీరి వెంట డిఇఒ భోజన్న, డిసిడిఒ గౌసియాబేగం తదితరులు ఉన్నారు.

## నల్లచట్టాల రద్దు కోరుతూ 9న సార్వత్రిక సమ్మె : జెఎసి పిలుపు




ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల జెఎసి నాయకులు కొరిమి రాజ్ కుమార్, పసునూరి రాజేందర్, బడి తల సమ్మయ్య, కంపేటి రాజయ్య పిలుపునిచ్చారు. భూపాలపల్లి ఏరియాలోని కెటికె ఓసి2, కేటికే ఓసి3లో ఫిట్ సెక్రటరీలు తోట రామ్ చందర్, మధు గాని విజేందర్ అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మిక సంఘాల జెఎసి నాయకులు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా బిజెపి ప్రభుత్వం విభజించి కార్మిక హక్కులను హరించి వేస్తుందని వారు మండిపడ్డారు. మతతత్వ కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను బిజెపి ప్రభుత్వం దోచిపెడుతుందని ఆరోపించారు. ఇలాంటి కార్మికులకు హాని చేసే నల్ల చట్టాలను కేంద్రం వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెకు భూపాలపల్లి ఏరియాలోని కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మోట పలుకుల రమేష్,సింగ్, చేరాలు, మధుకర్ రెడ్డి జోగబు చ్చయ్య పాల్గొన్నారు.

# పంట మార్పిడితోనే రైతులకు లాభాలు

అయిల్ పామ్ తోటల సాగు పెంచాలి

జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి : పంట మార్పిడితోనే రైతులు అధిక లాభాలు ఆర్జించే అవకాశాలు ఉంటాయని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ రైతులకు సూచించారు. ఆర్థిక లాభాల కోసం రైతులు ఆయిల్ ఫామ్ తోటల సాగు చేయాలని ఆయన సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయిల్ పామ్ విస్తీర్ణం పెంపుపై ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో సంబంధిత ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఖర్చు తగ్గడంతో ఆపటు ఎక్కువ లాభాలు వచ్చే పంట ఆయిల్ ఫామ్ అన్నారు. జిల్లాలో 3వేల 500 ఎకరాల సాగుకు అవకాశాలు ఉన్నాయని, ముందుగా గుర్తించిన 700 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగుకు చర్యలు తీసుకోవాలన్నారు. మరో 2800 ఎకరాల్లో సాగుకు ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా లక్ష్యాలను రూపొందించుకొని ఫలితాలు సాధించాలన్నారు. పంట మార్పిడి విధానం లాభం చేకూర్చుతుందని విషయాన్ని రైతులకు తెలియజేయాలన్నారు. విత్తనాలు, ఎరువుల కొరత సృష్టించకుండా ఫెర్టిలైజర్ షాపులను నిరంతరం తనిఖీ చేయాలని, ఎరువుల ధరలను ధరల పట్టిక ఏర్పాటు చేయాలన్నారు. స్టాక్‌ను, రిజిస్టర్లను పరిశీలించి రైతుల వివరాలను సెల్ నెంబర్లతో నమోదు చేయించాలన్నారు. ఫెర్టిలైజర్ షాపుల తనిఖీ ఫోటోలను వాట్సాప్ గ్రూప్‌లో పంపించాలన్నారు. పెండింగ్ కేవైసి, ఆధార్ అప్డేట్ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు శ్రీధర్, రామారావునాయక్, రాజేందర్‌రెడ్డి, ఆయిల్ ఫెడ్ జిల్లా మేనేజర్ శంకర్, వ్యవసాయ శాఖ ఎడిఏలు, ఏఈఓలు, ఎఈఒలు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం ఓబుల్ కేశవాపూర్ జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి డిజిటల్ బోధన, విద్యార్థుల సామర్థ్యం తీరును పరిశీలించారు. మెనూ పాటిస్తున్నారా..లేదా అనే విషయాలను విద్యార్థుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. పాఠశాల స్థాయిలోనే ఉన్నత లక్ష్యాన్ని ఎంపిక చేసుకోవాలని, ఇప్పటి నుంచే భవిష్యత్తు లక్ష్యాలను ఎంచుకోవాలని విద్యార్థులకు సూచనలు చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డిఇఒ భోజన్నతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాఠశాలలో వసతులు కల్పించాలని కలెక్టర్‌కు సిపిఐ వినతి



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కంచనపల్లి మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతులు కల్పించాలని కోరుతూ సిపిఐ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేవారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి, మండల కార్యదర్శి కావటి యాదగిరి ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంచనపల్లి పాఠశాలను మూడు సంవత్సరాలు మూసివేయగా గత సంవత్సరం తిరిగి తెరవడం జరిగిందన్నారు. 25 మంది విద్యార్థులలో గతేడాది పాఠశాల నిర్వయించగా, ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య 105కు చేరిందన్నారు. విద్యార్థుల సంఖ్య పెరిగినప్పటికీ పాఠశాలలో కనీస సౌకర్యాలు లేవని, స్లాబ్ పెచ్చులు ఊడుతున్నాయని, వర్షాకాలంలో గోడలు, స్లాబ్ నుండి నీరు కిందకు వస్తుందన్నారు. వెంటనే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి విద్యాశాఖ అధికారులతో మాట్లాడినట్లు వారు తెలిపారు.

## త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశం



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : భూపాలపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర పంచాయతీ రాజ్ ఇఎన్‌సి కార్యాలయంలో ఎమ్మెల్యే ఇఎన్‌సి కనకరత్నం, ఎస్ఇ చక్రవర్తి, ఇఇ వెంకటేశ్వర్లు, పలువురు డిఇ, ఎఇలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకర్గంలో జరుగుతున్న రోడ్ల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన గుత్తేదారులతో నాణ్యతతో పూర్తి చేయించాలని ఎమ్మెల్యే సూచించారు. రంగాపురం రేపాకపల్లి గ్రామాల మధ్య కొత్తగా హైలెవల్ వంతెన అవసరం ఉందని ఎమ్మెల్యే సూచించారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారుచేయాలని ఇఇని కోరారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# నేరుగా లబ్ధిదారులకు ప్రభుత్వ ఆర్థికసాయం

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి : ప్రభుత్వ ఆర్థిక సహాయం నేరుగా లబ్ధిదారులకు అందాలని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. వేలేరు మండల కేంద్రం, ధర్మసాగర్ మండల కేంద్రాంల్లోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వేలేరు మండలానికి చెందిన 17మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు, ధర్మసాగర్ మండలానికి చెందిన 71మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా లబ్ధిదారులకు పారదర్శకంగా అందజేస్తున్నట్లు వెల్లడించారు. గత పాలకులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని భూకబ్జాలు, అవినీతి, అక్రమాలు, వేల కోట్ల ఆస్తులు ఎలా సంపాదించుకున్నారో మనందరికీ తెలుసని అన్నారు. ఆనాడు గొప్పగా లక్ష కోట్లు ఖర్చు చేసి కట్టిన కాళేశ్వరంతో 50వేల ఎకరాలకు కూడా సాగునీరు అందలేదని, ఈరోజు కాళేశ్వరం కుంగిపోయి, కూలిపోయే స్థితికి వచ్చిందన్నారు. గోదావరి పెన్నా నదుల అనుసంధానం ప్రతిపాదన గత ప్రభుత్వ హయాంలోనే జరిగిందని, అప్పుడే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారాని అన్నారు. ఇప్పుడు వాటికీ పేర్లు మార్చి గోదావరి పైన పోలవరం, కృష్ణ నది పైన బనకచర్ల లింక్ ప్రాజెక్టు అని పనులు చేస్తున్నారన్నారు. 10ఏళ్ళు అధికారంలో ఉండి వేల కోట్లు సంపాదించుకొని, ఆ అవినీతి సొమ్ముతో దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. సోషల్ మీడియా అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపిడివో, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యత అవసరం

ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్



ప్రజాపక్షం/వరంగల్ క్రైం : పోలీసులు తమ విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యం అవసరమని ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్‌కుమార్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మూడు రోజుల పాటు జరిగే భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ పోటీలను బుధవారం ఈస్ట్ జోన్ డిసిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ ఈ డ్యూటీ మీట్‌లు అధికారులకు తమ నైపుణ్యాలను మెరుగుపర్చే అవకాశం కల్పిస్తాయన్నారు. నేరాలను త్వరితగతిన ఛేదించేందుకు, సాక్ష్యాలను శాస్త్రీయంగా విశ్లేషించేందుకు, ప్రజలకు న్యాయం అందించేందుకు ఈ వృత్తి శిక్షణ ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో వెస్ట్‌జోన్ డిసిపి రాజమహేంద్రనాయక్, అదనపు డిసిపిలు రవి, సురేష్‌కుమార్, ప్రభాకర్‌రావు, బోనాల కిషన్‌తో పాటు జోనల్ ఎసిపిలు, ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# చివరి ఆయకట్టుకూ సాగునీరు అందిస్తాం

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

ప్రజాపక్షం/ఖానాపురం : పాకాల ఆయకట్టు పరిధిలో ఉన్న పంటలకు చివరి ఆయకట్టు వరకు నీరందిస్తామని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. బుధవారం నర్సంపేట నియోజకవర్గ ఖానాపూర్ మండలంలోని పాకాల తూముల గేట్లను ఎత్తి పొలాలకు సాగు నీటికి ఎమ్మెల్యే మాధవరెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సీజన్ వరకు మిగిలిపోయిన కాలువల లైనింగ్ కొరకు నిధులు విడుదల చేయించి చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్ని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జానయ్య మాట్లాడుతూ రబీ సీజన్ పంట కోత దశకు చేరుకొనే నాటికి జూన్ మాసం రావడంతో అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోతున్నారని గ్రహించిన ఎమ్మెల్యే మాధవ రెడ్డి గత నెలలో రైతులు, వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలతో సమావేశం నిర్వహించి రైతుల నుండి అభిప్రాయాలు సేకరించి, రైతుల కోరిక మేరకు ఆగష్టు నెలలో కాకుండా జులై నెలలోనే పాకాల నీటిని అందిస్తే ఈ సమస్య ఉత్పన్నం కాదని తెలపడంతో చెప్పిన ప్రకారం నేడు దొంతి మాధవరెడ్డి జులైలోనే నీటిని విడుదల శుభ పరిణామమని కార్యక్రమంలో ప్రొఫెసర్, వెంకటనారాయణగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, కాంగ్రెస్ నాయకులు వేముల సాంబయ్య గౌడ్,ఎడ్ల జగన్మోహన్‌రెడ్డి, వేములపల్లి వెంకటప్రసాద్‌రావు, పర్చూరి సుబ్బారావు, పర్చూరి సుబ్బారావు, ఇరిగేషన్ ఇఇ సుదర్శన్, డిఇ రమేష్ వర్క్ ఇన్స్పెక్టర్, మనోహర్ స్వామి, ఖానాపురం సబ్ ఇన్స్పెక్టర్ సిహెచ్ రఘుపతి, జమీదార్ జంపయ్య, కానిస్టేబుల్ సంతోష్, లింగమూర్తి, ఖానాపురం తీహసీల్దారు నంగునూరి రమేష్, జూనియర్ అసిస్టెంట్ ఐలేష్ పాల్గొన్నారు.



### రహదారుల విస్తరణ పనులకు శంకుస్థాపన

చెన్నారావుపేట : మండలంలోని పలుగ్రామాలకు రహదారుల విస్తరణ పనులకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మెన్ పాలాయి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సిద్ధన రమేష్, మండల యూత్ అధ్యక్షులు బండి హరీష్, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్, మాజీ సర్పంచ్ తప్పెట్ల రమేష్‌తోపాటు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## సమర్థవంతంగా విధుల నిర్వహణ

సిబ్బందికి జిల్లా ఎస్పి కిరణ్ ఖరే ఆదేశం

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తూ, సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పి కిరణ్ ఖరే సిబ్బందిని ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం భూపాలపల్లి జిల్లా పోలీస్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది పని తీరు, వారి సమస్యలు అడిగితెలుసుకున్నారు. సాంకేతికంగా ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండి వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్టేషన్‌లోని సిబ్బంది వివరాలు, రికార్డుల నిర్వహణ, స్టేషన్ కేసుల స్థితిగతులు, పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలు జరిగే ప్రాంతాలు, శాంతిభద్రతలు, సంఘ వ్యతిరేక కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. కార్యక్రమంలో భూపాలపల్లి డిఎస్‌పి ఎ.సంపత్‌రావు, చిట్యాల సిఐ డి.మల్లేష్ , ఎస్ఐ డి.సుధాకర్, సిసి ఫసియుద్దిన్ పాల్గొన్నారు.




## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

టిపిసిసి మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన బుడిగే సతీష్‌గౌడ్



ప్రజాపక్షం/గూడూరు : మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు బుడిగే సతీష్‌గౌడ్‌ను టీపిసిసి మహేష్ కుమార్‌గౌడ్ అభినందించారు. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు సతీష్ గౌడ్ బుధవారం హైదరాబాదులోని టిపిసిసి చీఫ్ బొమ్మగాని మహేష్ కుమార్ గౌడ్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్‌గౌడ్ కలిసి ఉన్న ఫోటో ప్రేమ్‌ను అందజేశారు. ఈసందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ సతీష్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.



## ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా..

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



ప్రజాపక్షం/ఎల్కతుర్తి : స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎల్కతుర్తి పోలీస్ అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా సీపీ పోలీస్ స్టేషన్ పరిసరాలను, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించి కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలంటే ప్రతి పోలీస్ ఉద్యోగి నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని సిపి పేర్కొన్నారు. తనిఖీల్లో సెంట్రల్‌జోన్ డిసిపి షేక్ సలీమా, కాజీపేట ఎసిపి ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సిఐ పులి రమేష్ ఉన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి కృషి

సన్నాహక సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పొట్ల నాగేశ్వరావు



ప్రజాపక్షం/మహబూబాబాద్‌ప్రతినిధి :రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ ఇన్‌చార్జ్ పొట్ల నాగేశ్వరావు పిలుపునిచ్చారు. బుధవారం జరిగిన సన్నాహక సమావేశంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్, ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాగేశ్వరావు మాట్లాడారు. మహబూబాబాద్ డిసిసి అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మహబూబాబాద్ పార్లమెంట్ ఇంచార్జి, సత్తుపల్లి ఎమ్మెల్యే పొదెం వీరయ్య, స్వర్ణ కుమారి, పిసిసి జనరల్ సెక్రటరి సీతారాం, మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్న సమావేశంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ మాట్లాడుతూ ఈనెల 4న హైదరాబాద్‌లో జరిగే సభకు పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలిరావాలన్నారు. పార్టీ చేసే ప్రతి కార్యక్రమంలో కార్యకర్తలు భాగస్వామ్యం కావాలన్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చి అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని 10రెట్లు చేసిన అభివృద్ధి ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుగా నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువయ్యేలా కృషిచేస్తామని పార్టీ కార్యకర్తలకు సమావేశంలో ఎమ్మెల్యేలు భరోసా ఇచ్చారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిర్ణీత సమయంలో రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు పూర్తి

ఎమ్మెల్యే నాగరాజు, మేయర్ గుండు సుధారాణి

ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి : వచ్చే వర్షాకాలం నాటికి కాలనీలలో చుక్క నీరు నిల్వకుండా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. బుధవారం వర్ధన్నపేట నియోజవర్గ పరిధిలోని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ లోని పైడిపల్లి గ్రామంలో కొత్తగూడెం ఎస్సీ, బీసీ కాలనీలో చిన్నపాటి వర్షానికే డ్రైనేజ్ నీళ్లు ఇళ్ళలోకి వస్తున్నాయని స్థానిక నాయకులు, ప్రజలు సమాచారం అందించగా బుధవారం క్షేత్రస్థాయిలో నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి ఎమ్మెల్యే కాలనీలో పర్యటించారు. సమస్యలు తెలుసుకొని త్వరితగతిన పనులు పూర్తి చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అంగన్వాడి స్కూల్, ప్రభుత్వ పాఠశాలను సందర్శించి శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను పరిశీలించారు. సిఎస్ఆర్ ఫండ్ ద్వారా మరమ్మత్తులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పిల్లలతో సరదాగా మాట్లాడి వారు తినే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అక్షయపాత్ర ద్వారా మరింత నాణ్యమైన భోజనం త్వరలో అందించే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. స్థానిక ప్రజల అవసరాల దృష్ట్యా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. వర్షాకాలం నేపథ్యంలో నిర్ణీత సమయంలో రోడ్లు, డ్రైన్ నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. అభివృద్ధి కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని ప్రజలు ప్రభుత్వ యంత్రాంగానికి సహకరిస్తే ఒక్కొక్కటిగా చేసుకుంటూ వస్తున్నామన్నారు. ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం సమవుజ్జీగా చేస్తున్నామని తెలిపారు. గడిచిన పదేండ్లలో అభివృద్ధి నిలిచిందని, కాలనీలలో డ్రైన్, సిసి రోడ్ల అవసరం ఉన్నదని క్రమేపీ మున్సిపల్ నుంచి ఆర్అండ్‌బి నుంచి నిధులను తీసుకుని వస్తు పనులను చేపిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జన్ను శీభారాణి అనిల్ కుమార్, కాంగ్రెస్ నాయకులు జన్ను అరుణాకర్, జన్ను సుధాకర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బోయిని ఐలయ్య, కాంగ్రెస్ నాయకులు బుద్దే పెద్దన్న, రైతు రాజు, బిజిలి సంపత్, ప్రజా ప్రతినిధులు, డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# క్రీడ

## తడబడుతున్న టీమిండియా..

### టీ బ్రేక్ సమయానికి స్కోర్ 182/3



ఇంగ్లాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియా తడబడుతున్నది. ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో తొలిరోజు టీ బ్రేక్ సమయానికి టీమిండియా మూడు వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. ప్రస్తుతం కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 42 పరుగులు, వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ 14 పరుగులతో క్రీజులో ఉన్నాడు. టాస్ ఓడిపోయి బ్యాటింగ్‌కు వచ్చిన టీమిండియాకు ప్రారంభంలోనే వోక్స్ షాక్ ఇచ్చాడు. టీమిండియా 15 పరుగుల వద్ద కేఎల్ రాహుల్ అవుట్ అయ్యాడు. కేఎల్ రాహుల్ కేవలం రెండు పరుగులకే పెవిలియన్ చేరాడు. ఇన్నింగ్స్ తొమ్మిదో ఓవర్‌లో వోక్స్ వేసిన బంతిని డిఫెండ్ చేసే ప్రయత్నంలో రాహుల్ క్లీన్ బౌల్ అయ్యాడు. ఆ తర్వాత కరుణ్ నాయర్ జైస్వాల్ కలిసి 90 బంతుల్లోనే 80 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ క్రమంలోనే జైస్వాల్ అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నారు. టీమిండియా స్కోర్ 95 పరుగులకు చేరిన సమయంలో బ్రైడన్ కార్స్ బౌలింగ్‌లో హ్యారీ బ్రూక్స్‌కు క్యాచ్ ఇచ్చి కరుణ్ నాయర్ అవుట్ అయ్యాడు. నాయర్ 50 బంతుల్లో ఐదు ఫోర్ల సహాయంతో 31 పరుగులు చేశాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, జైస్వాల్ ఇద్దరు కలిసి స్కోర్‌ను 150 దాటించారు. కొద్దిసేపటికే బెన్ స్టోక్స్ బౌలింగ్‌లో జైస్వాల్ అవుట్ అయ్యాడు. తృటిలో జైస్వాల్ సెంచరీని చేజార్చుకున్నాడు. 107 బంతుల్లో 13 ఫోర్ల సహాయంతో 87 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. జైస్వాల్‌గిల్ జోడీ మూడో వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ప్రస్తుతం గిల్, పంత్ క్రీజులో ఉన్నారు.

## వరుస పరాజయాలు..

### భారత ఫుట్‌బాల్ కోచ్‌పై వేటు!




భారత ఫుట్‌బాల్ టీమ్ వరుస పరాజయాల నేపథ్యంలో హెడ్ కోచ్ మనోలో మార్క్వెజ్ తన పదవికి రాజీనామా చేశాడు. ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్(ఏఐఎఫ్ఎఫ్) అంగీకరంతోనే మార్క్వెజ్ తన బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. ఏఎఫ్‌సీ ఆసియా కప్ 2027 క్వాలిఫయర్ మ్యాచ్‌లో భారత్ 01 తేడాతో హాంకాంగ్ చేతిలో ఓటమిపాలైంది. ఈ ఘోర పరాజయం ఎదురైన కొద్ది రోజులకే మార్క్వెజ్ కోచ్ బాధ్యతల నుంచి తప్పుకోవడం గమనార్హం. గతేడాది జూన్‌లో ఫుట్‌బాల్ కోచ్‌గా మార్క్వెజ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించాడు. ఒప్పందం ప్రకారం అతనికి ఇంకా ఏడాది సమయం ఉన్నా.. వరుస పరాజయాల నేపథ్యంలో తప్పుకున్నాడు. అతని అభ్యర్థనను భారత ఫుట్‌బాల్ సమాఖ్య అంగీకరించింది.

**ఆర్థిక ఇబ్బందుల తలెత్తకుండా..**

ఈ విషయాన్ని ఏఐఎఫ్ఎఫ్ డిప్యూటీ సెక్రటరీ సత్యనారయణ ధృవీకరించారు. 'కోచింగ్ బాధ్యతల నుంచి తప్పుకుంటానని మార్క్వెజ్ చేసిన అభ్యర్థనను ఏఐఎఫ్ఎఫ్ అంగీకరించింది. ఎలాంటి ఆర్థికరమైన చిక్కులు తలెత్తకుండా పరస్పర అంగీకారంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే భారత ఫుట్‌బాల్ కోచ్ పదవి కోసం నోటిఫికేషన్ విడుదల చేస్తాం.'అని సత్యనారయణ పీటీఐకి తెలిపారు. ఏఎఫ్‌సీ ఆసియా కప్ 2027 క్వాలిఫయర్ మ్యాచ్‌లో ఓటమి తర్వాత మార్క్వెజ్ తీవ్ర అసహనానికి గురయ్యాడు. 'ఈ ఓటమి తీవ్రంగా బాధించింది. ఈ ఓటమితో డ్రెస్సింగ్ రూమ్ స్మశానంలా మారింది. అయితే ఈ టోర్నీకి అర్హత సాధించే అవకాశాలు ఇంకా భారత జట్టుకు ఉన్నాయి. మా ఆటగాళ్ల ప్రదర్శన తీవ్ర నిరాశకు గురి చేసింది. నాకు చాలా కోపం వస్తుంది. నాకు మాటలు రావడం లేదు.'అని మార్క్వెజ్ ఆవేదన వ్యక్తం చేశాడు. మార్క్వెజ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత్.. 8 మ్యాచ్‌ల్లో ఒకే ఒక్కటి గెలిచింది.

**సునీల్ రీఎంట్రీ ఇచ్చినా..**

ప్రస్తుతం భారత ఫుట్‌బాల్ టీమ్ గడ్డు కాలం ఎదుర్కొంటుంది. గతేడాదిగా జట్టు ప్రదర్శన అధ్వాన్నంగా మారింది. గతేడాది ఖాతర్ వేదికగా జరిగిన ఏఎఫ్‌సీ ఆసియా కప్ 2024లో గ్రూప్ స్టేజ్ నుంచే భారత్ నిష్క్రమించింది. ఈ టోర్నీలో ఒక్క గోల్ కూడా చేయలేకపోయింది. 2023లో ఫిఫా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 99వ స్థానంలో ఉన్న భారత్.. పేలవ ప్రదర్శనతో ప్రస్తుతం 127వ స్థానానికి పడిపోయింది. మాజీ హెడ్ కోచ్ ఇగోర్ స్టిమాక్ ఆధ్వర్యంలో 2023 నవంబర్‌లో కువైట్‌పై విజయం సాధించిన తర్వాత భారత ఫుట్‌బాల్ టీమ్ మళ్లీ విజయం సాధించలేదు. భారత దిగ్గజ ఫుట్‌బాల్ ప్లేయర్ సునీల్ ఛెత్రి రిటైర్మెంట్ వెనక్కి తీసుకొని తిరిగి జట్టులోకి వచ్చినప్పటికీ, అది జట్టు అదృష్టాన్ని మార్చలేకపోయింది.

## ప్రతి నెలా భార్య, కూతురుకు 4 లక్షలు ఇవ్వండి..

### క్రికెటర్ షమీకి హైకోర్టు ఆదేశం



**కోల్‌కతా:** టీమిండియా క్రికెటర్ మొహమ్మద్ షమీకి.. కోల్‌కతా హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. భార్య హసిన్ జహాన్‌తో పాటు కూతురికి ప్రతి నెలా నాలుగు లక్షలు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. మెయింటెనెన్స్‌లో భాగంగా ఆ అమౌంట్ ఇవ్వాలని కోర్టు తన తీర్పులో పేర్కొన్నది. భార్యకు నెలా 1.5 లక్షలు, కూతురుకు 2.5 లక్షలు ఇవ్వాలని కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. జస్టిస్ అజయ్ కుమార్ ముఖర్జీ బెంచ్ ఈ తీర్పును వెలువరించింది. హసిన్ జహాన్ కోర్టులో పిల్ దాఖలు చేసింది. ప్రతి నెలా నాలుగు లక్షల మెయింటెనెన్స్ ఇవ్వడం వల్ల వాళ్లకు ఆర్థిక స్థిరత్వం ఏర్పడుతుందని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. జులై ఒకటో తేదీన ఈ తీర్పు వెల్లడైంది. తాము ఇచ్చిన ఆదేశాలతో పాటు కూతురు చదువు కోసం లేదా ఇతర ఖర్చుల కోసం షమీ డబ్బులు ఇవ్వవచ్చు అని కూడా కోర్టు తెలిపింది. 2023లో ఇదే కేసులో జిల్లా సెషన్స్ కోర్టును జహాన్ ఆశ్రయించింది. భార్యకు 50వేలు, కూతురికి 80 వేలు ఇవ్వాలని సెషన్స్ కోర్టు ఆదేశించింది. అయితే ఆ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టును జహాన్ ఆశ్రయించింది. ప్రతి నెలా తనకు ఏడు లక్షలు, కూతురికి మూడు లక్షలు ఇవ్వాలని జహాన్ కోర్టులో పిటీషన్ వేసింది.

# ఫోకస్ కళారంగం



తిరుపతిలో జూన్ 27, శుక్రవారం జరిగిన శ్రీనివాస నృత్య సంగీత నీరాజనంలో పాల్గొన్న కళాకారిణులు.




## బోనం.. గ్రామీణ కళలకు ప్రతిరూపం..

గోల్కొండలో శ్రీకారం చుట్టుకోవడంతో బోనాల సందడి ఇప్పటికే ప్రారంభమైంది. సికిందరాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో జరగనున్న వేడుకతో మరింత జోరందుకుంటుంది. 'లష్కర్ బోనాలు' అంటే తెలియనివారు ఉండరు. తెలంగాణలో బోనాల పండుగ కేవలం ఆధ్యాత్మిక అనుబంధానికి పరిమితమైనది మాత్రమే కాదు. ఇది సమాజంలోని సంప్రదాయాలను, స్థానిక కళా రూపాలను, గ్రామీణ జీవనశైలిని, మహిళా శక్తిని ప్రతిఫలింపజేసే గొప్ప సాంస్కృతిక వేదిక.

ఈ పండుగను 'కళలకు బోనం'గా పేర్కోవచ్చు. ఎందుకంటే గ్రామీణ కళారూపాలు బోనాల సమయంలోనే ఎక్కువగా ప్రదర్శనకు నోచుకుంటాయి. అనేక ప్రాంతీయ కళారూపాలు వెలుగులోకి వస్తాయి. అలాంటి కళారూపాల్లో పోతురాజులది అగ్రస్థానం. శరీరానికి నూనె రాసుకుని, మెడలో నిమ్మకాయలు కట్టుకుని, చేతిలో కొరడాలతో చేసే నాట్య ప్రదర్శనలు. పోతురాజులకు హావభావ ప్రదర్శనలతోపాటు, నాట్య నైపుణ్యాలు కూడా ఉండాలి. ఇక, డప్పు, బజాలు, డోలు ఉండనే ఉంటాయి. వీటి నాదమే ఊరంతా పండుగ శోభను చాటుతుంది. ఒక్కో వాయిద్యం ఒక్కో ప్రత్యేకతను సంతరించుకుంటుంది. బోనాలు ఎత్తుకున్న వారిని... పోతురాజులనే కాదు... చూసే వారిని కూడా నాట్యమాడేలా చేస్తాయి. గంగిరెద్దు కళాకారులు గ్రామీణ ప్రాంత బోనాల్లో ప్రత్యేక ఆకర్షణ. వారు గంగిరెద్దులను అలంకరించి ఊరూరా తిరుగుతారు. నాట్యం చేస్తారు. బుర్రకథలు, యక్షగాల ప్రదర్శనలు ఉంటాయి. బోనాల సందర్భంగా కొన్ని చోట్ల శక్తి దేవతల చరిత్రను బుర్రకథగా ప్రదర్శిస్తారు. ఈ కళలన్నీ స్థానిక ప్రజల జీవనంలో భాగమైనవే. అంతేకాదు, గ్రామీణ కళాకారులకు ఉపాధి కలిగించే అవకాశాలు కూడా. బోనాల సందర్భంగా మహిళలు లంగావోణీ, చీర, పట్టు వస్త్రాలు, పసుపుకుంకుమతో మునిగిన పట్టు చీరలు, తలపైన బోనం, చేతిలో లాటిమ్మ, కళ్లలో నమ్మకం, నడకలో భక్తి.. ఇవన్నీ కలిసి ఒక కళాత్మక రూపాన్ని సమర్పిస్తాయి. ఈ సంప్రదాయ దుస్తులు, అభరణాలు భారతీయ సౌందర్య సాంప్రదాయానికి నిదర్శనం. బోనాల్లో మహిళలే ప్రధాన పాత్రధారులు. వారు అమ్మవారికి బోనాలు సమర్పించడం, నైవేద్యం తయారీ, శోభాయాత్రల్లో పాల్గొనడం వంటి సమస్త కార్యాల్లో శక్తి అనే సిద్ధాంతానికి జీవితం పోసే పండుగగా ఇది విరాజిల్లుతుంది. మహిళల నిబద్ధత, భక్తి, కుటుంబ ఆధ్యాత్మికత బోనాల ద్వారా సామూహికంగా వ్యక్తమవుతాయి. జానపద కళలతోపాటు, జానపద సాహిత్యం కూడా బోనాల్లో జాలువారుతుంది. బోనాల సందర్భంగా పాడే పాటలు, నినాదాలు, ప్రజల సంభాషణలు, తదితరాలన్నీ తెలంగాణ భాషకు ప్రమాణికాలే. ప్రత్యేకంగా పల్లెటూర్ల భాషలో చెప్పే కథలు, శక్తి మాత వృత్తాంతాలు భాషా సంపదను గణనీయంగా భద్రపరుస్తున్నాయి. బోనాల సందర్భం స్థానిక భాషా సంస్కృతిని తిరిగి గుర్తు చేస్తుంది. బోనాలను సామాజిక ఐక్యతకు వేదికగా కూడా పేర్కోవచ్చు. పండుగకు కుల, మత, వర్గ భేదాలు ఉండవు. అందరూ ఒకే అమ్మవారికి బోనాలు సమర్పించడం, కలిసి ఊరేగింపులో పాల్గొనడం సామాజిక సమన్వయాన్ని చాటుతుంది. ఇది సమాజం మొత్తం ఒక కుటుంబంగా నడుస్తున్నదన్న బలమైన సంకేతం. నిన్న మొన్నటివరకు బోనాలు పూర్తిగా సంప్రదాయ పద్ధతుల్లో జరిగేవి. కానీ ఆధునిక కాలంలో దీన్ని సాంకేతిక పరిజ్ఞానంతో కలిపే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఫ్లెక్సీలు, ఆలయ లైవ్ ప్రసారాలు, సామాజిక మాధ్యమాల్లో బోనాల ఉత్సవాల ప్రచారం.. ఇవన్నీ ఈ సంప్రదాయానికి ఆధునికతను జత చేస్తున్నాయి. అంతేకాదు, యువత కూడా మరచిపోతున్న సంప్రదాయాలకు మరలా శ్రద్ధ చూపుతోంది. పర్యాటక అభివృద్ధికి ప్రేరణగానూ బోనాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. బోనాలను తిలకించడానికి, ప్రత్యేకించి ఈ సందర్భంగా ప్రదర్శించే కళారూపాలను చూడడానికి వివిధ ప్రాంతాల నుంచి ఎంతో మంది తెలంగాణకు, ప్రత్యేకించి హైదరాబాద్, వరంగల్ వంటి నగరాలకు తరలివస్తారు. హైదరాబాద్ నగరంలోని గోల్కొండ బోనాలు, ఉజ్జయిని మహంకాళి బోనాలు వంటి పండుగలు పర్యాటక ప్రాధాన్యత పొందాయి. దేశ విదేశాల నుంచి పర్యాటకులు వస్తున్నారు. ఇది ప్రాంతీయ సంస్కృతి, సంప్రదాయాలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొస్తోంది. బోనాల పండుగలో భౌతిక అలంకారాలు, ఆధ్యాత్మిక నమ్మకాలు, కళా రూపాలు.. ఇవన్నీ కలిసిపోయి భక్తి అనే అజస్ర నదిగా ప్రవహిస్తాయి. ఇది మన శరీర, మనోభావాల పునర్వ్యాఖ్యానమే కాదు, సంస్కృతి యొక్క శాశ్వతతకు సంకేతం. సూక్ష్మంగా చెప్పాలంటే, బోనాలు తెలంగాణ ప్రజల సాంస్కృతిక వారసత్వానికి నిలయం. బోనాల ద్వారా ప్రజలు తమ ఆత్మను, ఆరాధనను, కళను, భాషను, సమాజాన్ని జపించుకుంటారు. అందుకే ఈ పండుగను సాంస్కృతిక సంరక్షణకు వేదికగా పరిగణించవచ్చు.



## మహబూబాబాద్ మున్సిపాలిటీలో అత్యధిక స్థానాల్లో సిపిఐ


- వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారథి విజ్ఞప్తి
- ఘనంగా సిపిఐ మహబూబాబాద్ పట్టణ 14వ మహాసభ
- అరుణ పతాకాన్ని ఎగురవేసిన బి.నీరజారెడ్డి ధర్మన్న



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ అంతిమ లక్ష్యం కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టడమేనని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి విమర్శించారు. మహబూబాబాద్ పట్టణ సిపిఐ14వ మహాసభ పేరాల కట్టయ్య పంక్షన్‌హాల్‌లో అమరజీవి దాస్యం రామ్మూర్తి ప్రాంగణంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు వెలుగు శ్రావణ్, ఎండి ఫాతిమా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మహాసభనుద్దేశించి మాట్లాడుతూ దేశంలో పేద ప్రజల దేశ సంపదను దోచి కార్పొరేట్‌లైన అంబానీ, అదానీలకు దోచిపెట్టడానికే మూడవసారి ప్రధాని అయ్యావా మోదీ అని ఆయన ప్రశ్నించారు. గత 11ఏళ్ళలో దేశానికి మోదీ చేసింది ఏమీ లేదన్నారు. కేవలం 140కోట్ల ప్రజలను వదిలిపెట్టి ఊడిగం చేస్తోందన్నారు. దేశంలో మతోన్మాద రాజకీయాలుచేస్తూ విభజించి పాలిస్తూ దేశంలో అల్లర్లు సృష్టిస్తున్నారని అన్నారు. ఆర్ఎస్ఎస్ బిజెపి కలిసి దేవబూన్ని భ్రష్టు పట్టిస్తున్నారని, కమ్యూనిస్టులు నిజమైన దేశభక్తులని బిజెపి అరాచకాలను రానున్న కాలంలో ప్రజలు ఎండగట్టి వారిని ఇంటికి పంపించే రోజులు దగ్గరలోనే వస్తాయని విజయసారథి జోస్యం చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో అత్యధిక సీట్లు గెలిపించాలని మహాసభ ద్వారా ప్రజలకు పిలుపునిచ్చారు. అత్యధిక సీట్లు గెలిపించడం ద్వారా పట్టణంలో మెరుగైన పాలన సేవ ప్రజలందరికీ అందిస్తామని విజయసారథి తెలిపారు. గత పదేళ్ళలో మున్సిపాలిటీ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. శివారు కాలనీలో ఎక్కడ గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. సిసి రోడ్లు, డ్రైనేజీలు, సిసి కాల్వలు గత టిఆర్ఎస్ పాలనలో మున్సిపాలిటీలు అధ్వానంగా తయారయ్యాయని, నూతనంగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. రాబోయే మున్సిపాలిటీలో అధికస్థానాల్లో గెలిచి ప్రజలకు నిస్వార్థ సేవలు అందిస్తామని తెలిపారు. సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ గత 2014లో మూడు స్థానాలు, 2020లో రెండు స్థానాల్లో గెలిచి పట్టణంలో ఉన్న సమస్యలన్నిటిపై మున్సిపాలిటీలో చర్చించినట్లు, ఎప్పటికప్పుడుసమస్యలను మున్సిపల్ దృష్టికి తీసుకువవస్తూ పోరాటం చేశామన్నారు. పట్టణంలో గెలిచిన వార్డుల్లో వందశాతం అభివృద్ధి చేశామన్నారు. రానున్న కాలంలో అత్యధిక సీట్లలో గెలిపించాలని, సిపిఐ ప్రతినిధులుగా సేవ చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా వందేళ్ళ చరిత్రగల సిపిఐ దేవంలో ప్రజల కోసం ఉద్యమిస్తోందన్నారు. రాబోయే జూలై 5,6 తేదీల్లో జరుగుతున్న సిపిఐ జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సిపిఐ నాయకులు పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వీరవెల్లి రవి, నర్ర శ్రావణ్, తండ సందీప్, ఆబోతు అశోక్, వంకాయపాటి చిరంజీవి, అజ్మీర వేణు, ఎండి మహమూద్, చీదిరాల జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాల, రామకృష్ణాపూర్ మధ్య ఆర్‌టిసి బస్సులు నడపాలి

### సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి లక్ష్మణ్




**ప్రజాపక్షం /రామకృష్ణాపూర్ :** మంచిర్యాల, రామకృష్ణాపూర్ మధ్య ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ప్రజల రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే ఈ మార్గంలో బస్సులను నడపాలని కోరుతూ బుధవారం మంచిర్యాలలోని ఆర్‌టిసి డిపో మేనేజర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ రామకృష్ణాపూర్ పట్టణంలో సుమారు 40 వేల మంది జనాభా నివసిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు తరచూ వివిధ అవసరాల నిమిత్తం మంచిర్యాలకు ప్రయాణించాల్సి వస్తోందని, అయితే బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు భద్రతా సమస్యలను ఎదుర్కొంటున్నారని, వైద్యం కోసం వెళ్లేవారికి ప్రైవేట్ వాహనాల వల్ల ఖర్చులు పెరుగుతున్నాయన్నారు. గతంలో రైల్వే ఫ్లైఓవర్ వంతెన లేకపోవడం రవాణాకు అంతరాయంగా ఉండేదని, అయితే ప్రస్తుతం క్యాతనపల్లి వద్ద రైల్వే ఫ్లైఓవర్ వంతెన పూర్తయి ప్రారంభం కావడంతో ఆర్‌టిసి బస్సులు నడపడానికి ఎలాంటి ఆటంకం లేదని లక్ష్మణ్ స్పష్టం చేశారు. కాబట్టి ఆర్‌టిసి అధికారులు తక్షణమే బస్సు సర్వీసులు ప్రారంభించి ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన డిపో మేనేజర్ శ్రీనివాస్ స్పందిస్తూ, రామకృష్ణాపూర్ ప్రజల అవసరాన్ని గుర్తించామని, డిపో స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మిట్టపల్లి శ్రీనివాస్, ఇప్పకాయల లింగయ్య, నక్క వెంకటస్వామి, మిట్టపల్లి పౌల్, కాదండి సాంబయ్య, వనం సత్యనారాయణ, మామిడి గోపి, మొండి తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి


### ఎఐటియుసి ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లు, స్కావెంజర్లకు ఏడునెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. బుధవారం డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ములుగు జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ స్కావెంజర్లకు ఇచ్చేదే అరకొర వేతనాలు అవి కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉంటే వారు జీవించడం ఎలా అన్నారు. కనుక వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. అలాగే స్కావెంజర్ల వేతనాలు అమ్మ ఆధర్మ కమిటీల ద్వారా కాకుండా ప్రభుత్వమే నేరుగా చెల్లించాలని అన్నారు. స్కావెంజర్ల నియామకాన్ని కంటి తుడుపు చర్యగా కాకుండా వారి అవసరం తప్పనిసరి ఉన్నందున నియామక పత్రాలు అందించి కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వారి వేతనాలు వారి వారి ఖాతాలలో జమ చేయాలని అన్నారు. ఇంకా అనేక సమస్యలు పరిష్కారానికి గాను సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 9వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో భాగంగా ములుగు జిల్లా కేంద్రంలో జరిగే ప్రదర్శనలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసి జిల్లా అధ్యక్షుడు బండి నర్సయ్య, బిసి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ముత్యాల రాజు, ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల, సర్వీస్ వర్కర్స్, స్వీపర్లు, స్కావెంజర్స్ యూనియన్ నాయకులు, సామల రమ, మునెమ్మ, మాలగాని కమలక్క, ఎం రాజమ్మ, రమాదేవి, కె పద్మ, కె కుమారి, ఈ రమాదేవి, నిర్మల, కమల, తదితరులు పాల్గొన్నారు.




## పెట్టుబడిదారీ వర్గానికి కొమ్ముకాస్తున్న మోదీప్రభుత్వం

### దేశవ్యాపిత సమ్మెను విజయవంతం చేయాలి:గన్నారపు రమేష్




**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ కోరారు. కార్మిక రైతు సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ శివనగర్ తమ్మెర భవన్‌లో సమావేశం నిర్వహించగా రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసంపెల్లి బాబు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. కేంద్రం లో మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్మికుల పైన, రైతుల పైన, దాడి మొదలు పెట్టాడని కార్మికులు పోరాడి సాధించుకున్న 44 రకాల చట్టాలను పెట్టుబడిదారీ వర్గానికి కొమ్ముకాస్తూ నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మిక వర్గానికి తీవ్రమైన అన్యాయానికి గురిచేస్తున్నాదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రైవేటు సంస్థలకు అప్పనంగా అప్పజెప్పడం జరుగుతుందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, దానికి అనుగుణంగా కార్మికుల జీతభత్యాలు పెరగడం లేదని పెద్ద నోట్ల రద్దు జివిఎస్‌టి తీసుకురావడం వల్ల అనేక రకాల చిన్న మధ్యతరహా పరిశ్రమలు మూతపడి వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని, వారి జీవనం అస్తవ్యస్తంగా మారిపోయిందని, దానికి కారణం కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వమే అన్నారు. జూలై 9వ తేదీన దేశవ్యాప్త సమ్మె కు కేంద్ర కార్మిక సంఘాలు అన్ని ఒకే తాటిపైకి వచ్చాయని, ఈ సమ్మెలో కార్మికులు, కర్షకులు, ప్రజలు, రైతులు పార్టీ శ్రేణులు శ్రేయోభిలాషులు వేలాది అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులను కోరారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు గంగుల దయాకర్, జిల్లా ప్ర ధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, ఐఎన్‌టియుసి రవి తదితరులు పాల్గొన్నారు.


## ఎఐవైఎఫ్ నాయకుల అక్రమ అరెస్ట్

**ప్రజాపక్షం/మునుగోడు :** 140 కోట్ల ప్రజల ప్రయోజనాలను ట్రంప్‌కు తాకట్టు పెట్టిన మోదీ విధానాలు నశించాలని, అమెరికా చేతిలో తొత్తుగా మారిన నరేంద్రమోదీ అని, భారతీయులపై అమెరికా దుర్మార్గ చర్యలు ఆపాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఛలో అమెరికా రాయబార కార్యాల(అమెరికన్ కాన్సులేట్) ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన నాయకులను మునుగోడు పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి మునుగోడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దివాళా కోరు ఉగ్రవాద ప్రేరేపిత దేశం పాకిస్తాన్‌కు అమెరికా రెడ్ కార్పెట్ వేస్తూ తన సామ్రాజ్యవాద విష పోకడలను అనుసరిస్తుందని ధ్వజమెత్తారు. ఔర్ ఏక్ బార్ ట్రంప్ సర్కార్ అంటూ అమెరికాలో జరిగిన అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో మోదీ ట్రంప్ గెలుపు కోసం భారతీయులతో మీటింగ్ ఏర్పాటు చేసి ట్రంప్‌ను గెలిపించాలని మోదీ కోరడం సిగ్గు చేటు అన్నారు. అనంతరం ఎన్నికల్లో గెలిచిన ట్రంప్ భారతీయులపై తన కర్కషాన్ని ప్రదర్శించాడన్నారు. ఇటీవల కాలంలో జరిగిన భారత్, పాక్ యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ నిసిగ్గుగా మీడియాకు చెప్పినా, మోదీ ఖండించలేదన్నారు. ఇప్పటికైనా సామ్రాజ్యవాద అమెరికా నీచ పోకడలను మోదీ వ్యతిరేకించాలని వారు డిమాండ్ చేశారు.అరెస్ట్ అయిన వారిలో ఎఐవైఎఫ్ మునుగోడు మండల కార్యదర్శి బండారు శంకర్, ఉపాధ్యక్షులు గోస్కొండ మల్లేష్, నాయకులు కట్కూరి లింగస్వామి, కట్ట దశరథ, గోపగోని ఉదయ్,అందుగుల నరేష్, తదితరులు ఉన్నారు.



## 6న సిపిఐ నిర్మల్ జిల్లా మహాసభ

### కరపత్రాల విడుదల చేసిన సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లాలో భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) తమ నాలుగో జిల్లా మహాసభల ప్రచారాన్ని వేగవంతం చేసింది. ఈ రోజు సిపిఐ కార్యాలయంలో, మెడికల్ కాంట్రాక్టు వర్కర్లుతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి విలాస్ మాట్లాడుతూ, జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లాలో సిపిఐ ప్రజల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించిందని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో,ప్రజాస్వామ్య,లౌకిక,సోషలిస్టు పార్టీ అయిన కమ్యూనిస్టు పార్టీ మాత్రమే ప్రజల అవసరాలను ఖచ్చితంగా తీర్చగలదని ఆయన అన్నారు. జూలై 6వ తేదీన గాంధీ పార్క్ నుండి అంబేద్కర్ విగ్రహం మీదుగా పెన్షనర్ భవన్ వరకు భారీ ర్యాలీ ఉంటుందని ఆయన తెలిపారు. ఈ మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కళావేణి శంకర్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని విలాస్ వెల్లడించారు.ఈ సందర్భంగా ఎస్.ఎన్. రెడ్డి మాట్లాడుతూ, సిపిఐ సుదీర్ఘ చరిత్ర కలిగిన రాజకీయ పార్టీ అని అన్నారు. సిపిఐ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో రాథోడ్ పుండాలిక్, మల్లేష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్థానికం

REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్



## ప్రభుత్వ ఆసుపత్రిని డిప్యూటీ డిఎంహెచ్ఓ సందర్శన



**ప్రజాపక్షం/జన్నారం:**జన్నారం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం నాడు డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన టిబి, సికిల్ సెల్, సీజనల్ వ్యాధులపై ఓరియంటేషన్ శిక్షణ ఇచ్చారు. వర్షాకాలంలో సంభవించే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి కూడా డాక్టర్ సుధాకర్ నాయక్ వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉమాశ్రీ, డాక్టర్ లక్ష్మి, సూపర్వైజర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షంలోనూ విధులు.. హోం గార్డులకు ఉలెన్ జాకెట్లు



**ప్రజాపక్షం/బైంసా :**ప్రజల రక్షణలో అహర్నిశలు శ్రమించే హోం గార్డుల సంక్షేమం కోసం నిర్మల్ జిల్లా పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకొని,వర్షాకాలంలో విధులు నిర్వర్తించే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించేందుకు,జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న 208 మంది హోం గార్డులకు నేడు వులెన్ జాకెట్లను పంపిణీ చేశారు.బుధవారం బైంసాలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో,జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ స్వయంగా హోం గార్డులకు జాకెట్లను అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,పోలీసు వ్యవస్థలో హోం గార్డులు కీలకమైన భాగస్వాములని,వారి శ్రమ,నిబద్ధత,సేవా దృక్పథం ప్రశంసనీయమని కొనియాడారు.పోలీస్ శాఖ ఎల్లప్పుడు హోం గార్డుల సంక్షేమం పట్ల నిబద్ధతతో ఉంటుంది.ఈ జాకెట్లు వారి ఆరోగ్యాన్ని కాపాడుకుం టూ, మరింత సమర్థవంతంగా విధులను నిర్వహించేందుకు తోడ్పడతాయి అని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు.ఈ కార్యక్రమంలో హోం గార్డుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది.తమ శ్రమను గుర్తించి,అవసరమైన సమయంలో తోడ్పాటు అందించినందుకు జిల్లా ఎస్పీకి హోం గార్డులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్ తో పాటు ఆర్ఐ రామ్ నిరంజన్‌రావ్(అడ్మిన్)ఇతర హోం గార్డు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాల తనిఖీచేసిన జిల్లా మాధ్యమిక విద్యాధికారి



**ప్రజాపక్షం/ఖానాపూర్:**ఖానాపూర్ పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ను నిర్మల్ జిల్లా మాధ్యమిక విద్యా అధికారి జాదవ్ పరుశురాం బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కళాశాలను సందర్శించి అధ్యాపకులతో సమావేశాం ఏర్పాటు చేసి అడ్మిషన్ ప్రక్రియ మరింత వేగవంతం చేసి అడ్మిషన్ లు పెంచాలని సూచించారు అని.జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్,ఐఐటి,క్యాట్,వంటి పోటీ పరీక్షలకు ప్రభుత్వం అందించే ఉచిత ఆన్ లైన్ కోచింగ్ ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.విద్యార్థులను పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యే విధంగా పోత్సహించాలని అధ్యాపకులకు తెలిపారు.కళాశాలలో విద్యార్థులు త్వరగా అడ్మిషన్లు చేసుకునేలా అధ్యాపకులు విద్యార్థులకు తెలియజేయాలన్నారు అని ఈ సందర్భంగా కళాశాల పని తీరుపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు అని కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు.ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి కళాశాలల అధ్యాపకులు, పాల్గొన్నారు.

## వన మహోత్సవం పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/నందిపేట్:**నందిపేట్ మండలంలోని అన్ని గ్రామాలలో మొక్క లు నాటే పనులు మొదలయ్యాయి. గ్రామానికి 2850 మొక్కలు నాటాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు గ్రామాలలో ప్రభుత్వ భూముల్లో చె రువు గట్ల వెంబడి గుంతలను ఉపాధి కూలీలు తీస్తున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, అటవీ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు. అ టవీశాఖ పోడు భూముల్లో మొక్కలునా టడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఫీల్డ్ ఆఫీసర్లు, గ్రామ కార్యదర్శులు ఉపాధి కూలీలతో గుంతలు తీయిస్తున్నారు. మొక్కలు నర్సరీ నుంచి రాగానే నాటిస్తామని గ్రామ కార్యదర్శులు తెలిపారు. వన మహోత్సవం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

## ఆన్‌లైన్ మోసాలపై అవగాహన



**ప్రజాపక్షం/రామాయ ం-పేట:** ఆన్‌లైన్ మో సాలపై విద్యార్థులకు ఎస్ఐ బాల్ రాజ్ అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని లక్ష్మాపూర్ జిల్లా పరిషత్ ఉ న్నత పాఠశాలలో ఏర్పా టు చేసిన అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందనాన్నారు. అపరిచిత వ్యక్తులకు తమ ఖాతాల రహస్యాలు చెప్పవద్దన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు, బంధువులకు ఆన్‌లైన్ మోసాలపై వివరించాలని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు బ్యాంకుల నుండి మాట్లాడుతున్నామని పిన్ వివరాలు అడిగితే ఎలాంటి సమాచారం ఇవ్వవద్దని సూచించారు. ఈకార్యక్రమంలో పోలీసులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జూదగాళ్లకు అడ్డాగా ప్రైవేట్ గెస్ట్‌హౌస్‌లు

**ప్రజాపక్షం/పాపన్నపేట:**ఏడుపాయల లోని ప్రవేట్ గెస్ట్ హౌస్ లు జూదగాళ్లకు అడ్డగా మారాయి . పక్క సమాచారంతో దాడులు జరిపిన పాపన్నపేట పోలీసులకు పలువురు పాటుపడ్డారు. ఎందుకు సంబంధించి వివరాలు ఏడుపాయల్లోని గెస్ట్ హౌస్ లో జూదం ఆడుతున్న పలువురిని మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఏడుపాయల శివారులో ఉన్న ప్రైవేటు సత్రాల్లో పలువురు జూదం ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. ఈ మేరకు జూదం ఆడుతున్న జిల్లాలలోని వివిధ మండలాలకు చెందిన 10మందిని అదుపులోకి తీసుకోగా ఒకరు పారిపోయారన్నారు. వారి వద్ద నుండి రూ. 74,350నగదు, 9 సెల్ ఫోన్లు, 2 కార్లు, 5బైక్ లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడితేఆడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా జూదం ఆడుతున్నట్లు గుర్తిస్తే వారి గురించి సమాచారం అందించాలని సూచిస్తూ సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

## విద్యార్థుల ప్రాణాలకు ముప్పు
# ప్రమాదకర వాటర్‌వాల్స్

సిర్పూర్ టి బాలికల పాఠశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన

అధికారులు స్పందించాలంటూ డిమాండ్



**ప్రజాపక్షం/సిర్పూర్ టి:**మండలంలోని ఎంపిపిఎస్ బాలికల పాఠశాల ఎదుట ఉండే ప్రమాదకర వాటర్‌వాల్స్ విద్యార్థుల ప్రాణాలను బలితీసే స్థితికి దారి తీస్తున్నాయని తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో పాఠశాల ప్రధాన ద్వారం వద్ద ఉన్న రెండు వాటర్‌వాల్స్ పూర్తిగా నీటితో నిండిపోతున్నాయి. పిల్లలు జారిపడే ప్రమాదంతో పాటు విద్యుత్ షాక్‌లు వచ్చే ప్రమాదం కూడా ఉంది. లోతు ఎక్కువగా ఉండటంతో చిన్నారులు వాటిలో పడిపోతే ప్రాణహానికీ అవకాశం ఉంది. అయినా అధికారులు ఇప్పటికీ చర్యలు తీసుకోవడం లేదు అని తల్లిదండ్రులు మండిపడ్డారు. ఈ పాఠశాలలో ఉర్దూ మాధ్యమంలో 47 మంది, తెలుగు మాధ్యమంలో 67 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల వద్ద ప్రమాదకరంగా ఉన్న వాటర్‌వాల్స్‌ను చూసిన ప్రతి తల్లిదండ్రికి పిల్లల భద్రతపై భయం వేస్తోంది. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు గ్రామపంచాయతీ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూడా ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. అయినా ఇప్పటికీ స్పందన లేకపోవడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వాటర్ వాల్స్‌కి వెంటనే కప్పులు వేయాలని, గట్టి కంచె లేదా బారికేడ్ ఏర్పాటు చేయాలని, లోతు అధికంగా ఉంటే మూసివేయాలని, పిల్లలతో అవగాహన కల్పించాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భద్రతకు సంబంధించిన విషయంలో అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, స్థానికులు గట్టి డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే తల్లిదండ్రుల సంఘం, గ్రామస్థాయి ప్రజా ప్రతినిధుల సహకారంతో సమస్య పరిష్కారం దిశగా ముందడుగు వేస్తామని తల్లిదండ్రులు స్పష్టం చేశారు.

## పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు నడుం బిగించాలి

సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్ బాబు పిలుపు



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ ;**పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు నడుం బిగించాలని సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు పిలుపునిచ్చారు. కాగజ్‌నగర్ మండలంలోని బలగలలో ఉన్న మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల (బాలురు 2) లో బుధవారం విద్యార్థులతో కలిసి ఆయన 600 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ తల్లి పేరు మీద ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని కోరారు. అలాగే, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలకు వెళ్లే రోడ్డు మార్గం సరిగా లేదని ప్రిన్సిపాల్ తెలియజేయడంతో, ఆ సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యేహామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఎంపిడిఒకోట ప్రసాద్, ఆర్ఎల్‌సి పుష్పలత, డిఎండబ్ల్యూ నదీమ్, ప్రిన్సిపాల్ షగుఫ్తా, పంచాయతీ కార్యదర్శి హరీష్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థ పాఠశాలల భవనాలను కూల్చివేయాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి:**శిథిలావస్థ పాఠశాలల భవనాలను కూల్చివేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాల కూల్చివేతకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు.మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం లో శిథిలావస్థ పాఠశాల భవనాల కూల్చివేత ,ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపుదల,తదితర అంశాలపై విద్యాశాఖ అధికారులతో చర్చించారు. అన్ని మండలాల్లో తహసీల్దారులు కలిసి శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. అత్యంత ప్రమాదకరమైన భవనాలను మాత్రమే కూల్చివేతకు సిఫారసు చేయాలన్నారు.విద్యార్థులంతా భద్రతా వాతావరణంలో విద్యను అభ్యసించే విధంగా చర్యలు చే పట్టాలన్నారు.ఎట్టి పరిస్థితుల్లో శిథిలావస్థ భవనాల్లో విద్యార్థులు కూర్చోవద్దని తెలిపారు.ఇప్పటివరకు ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలు పొ ందిన విద్యార్థుల వివరాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు .అంగన్వాడి నుంచి వివిధ స్థాయిల్లో విద్యార్థులు డ్రాప్ అవుట్ అవ్వకుండా చూడాలన్నారు .గురుకులాలు,ఇతర సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు ప్రవేశ పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తూ,ఇప్పటికి కూడా తరగతులకు హాజరు కాని విద్యార్థులను గుర్తించి వారితో మాట్లాడి తరగతులకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.ఒకవేళ సీట్లు సాధిస్తే తిరిగి వారికి ఆయా విద్యాసంస్థల్లో చేరేందుకు అవకాశం కల్పిస్తామని భరోసా వారికి కల్పించాలన్నారు.ఈ సమేవేశంలో డిఇఒ పి.రామారావు,ఎసిజిఇపరమేశ్వర్,విద్యాశాఖ అధికారులు నరసయ్య,ప్రవీణ్,ఎం ఇఒ లు,ఇతరఅధికారులు,సిబ్బంది,తదితరులుపాల్గొన్నారు.

## ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



**ప్రజాపక్షం/వాంకిడి:**రైతుల సంక్షేమమే లక్ష్యంగా, ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే హెచ్చరించారు. బుధవారం వాంకిడి మండల కేంద్రంలోని రాయల్ ట్రేడర్స్ ఫర్టిలైజర్ దుకాణాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్, స్టాకు రిజిస్టర్‌తో పాటు అందుబాటులో ఉన్న నిల్వలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ జిల్లాలో రైతుల వ్యవసాయ అవసరాల కోసం ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు విక్రయించడం లేదా కృత్రిమ కొరత సృష్టించడం వంటివి చేస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ముఖ్యంగా యూ రియా, డిఎపి, ఇతర పురుగుమందుల విషయంలో ధరల పట్టిక ను, స్టాకు నిల్వల పట్టికను తప్పనిసరిగా షాపు ముందు ప్రదర్శించాలని దుకాణదారుల ను ఆదేశించారు. అధిక ధరలకు విక్రయి ంచినా, ఇతర మార్గాల ద్వారా తరలించినా, లేదా కృత్రిమ కొరత సృష్టించినా ఫిర్యాదులు అందిన వెంటనే చర్యలు తీసుకుంటామ ని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు మండలంలోని ప్రతి ఫర్టిలైజర్ దుకాణాన్ని క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, స్టాకు నిల్వల వివరాలను ప్రతి రోజూ సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని సూచించారు.

**వన మహోత్సవం – 2025 మొక్కలు నాటి సంరక్షించండి**

అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వన మహోత్సవం 2025 కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పాల్గొన్నారు. అధికారులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయా శాఖలకు కేటాయించిన మొక్కలు నాటే లక్ష్యాలను పూర్తి చేయాలని, నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. వర్షాలు విస్తారంగా కురుస్తున్నందున మొక్కలు నాటడానికి ఇది సరైన సమయమని, పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పండ్ల మొక్కలు, మునగ వంటివి నాటడం వల్ల పర్యావరణంతో పాటు ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుందని తెలిపారు. తహసీల్దార్ కవిత, వ్యవసాయ శాఖ అధికారి, కళాశాల ప్రిన్సిపాళ్ళు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో పురోగతి సాధించాలి: కలెక్టర్

మునిసిపల్ పరిధిలో అభివృద్ధి పనుల ప్రగతిపై సమీక్ష



**ప్రజాపక్షం / ఆర్మూర్:**పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో పురోగతి సాధించాలని కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఆర్మూర్ మున్సిపాలిటీని సందర్శించి, పట్టణంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, వన మహోత్సవం, సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం చేపడుతున్న ముందస్తు చర్యలు, ప్లాట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తుదారులకు అనుమతులు మంజూరు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష జరిపారు. 617 మందికి ఇళ్లను మంజూరు చేయగా, కేవలం 183 మాత్రమే గ్రౌండింగ్ జరిగాయని అధికారులు, వార్డు ఆఫీసర్ల పనితీరును ఆక్షేపించారు. అవసరమైతే ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుల సహకారం తీసుకోవాలన్నారు. ఆర్థిక స్థోమత లేని లబ్ధిదారులకు మెప్మా ఆధ్వర్యంలో రుణాలు ఇప్పించేలా చొరవ చూపాలన్నారు. ఒకవేళ ఎవరైనా మహిళా సంఘాలలో సభ్యులుగా లేనట్లయితే, వారిని సభ్యులుగా చేర్పించి రుణాలు మంజూరయ్యేలా కృషి చేయాలన్నారు. ఇప్పటికే సభ్యులుగా ఉన్న వారికి మూడురోజుల్లో కొత్తగా సభ్యత్వం కల్పించేవారికి వారం వ్యవధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంకోసం లక్ష రూపాయల వరకు రుణాలు మంజూరయ్యేలా చూడాలన్నారు. నర్సరీల్లో మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉంచాలని, వాటిని నాటి పరిరక్షించేలా అనువైన ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. మొక్కలను ఆయా కేటగిరిలుగా విభజిస్తు, పూలు, పండ్ల మొక్కలను నివాస గృహాల కోసం పంపిణీ చేయాలని, మూడు మీటర్ల వరకు ఎత్తు కలిగిన మొక్కలను అవెన్యూ, బ్లాక్ ప్లాంటేషన్‌ల కోసం వినియోగించాలని తెలిపారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. నివాస ప్రాంతాల నడుమ ఖాళీ ప్రదేశాలలో నిలువ నీరు ఉండకుండా చూడాలన్నారు. దోమల వ్యాప్తిని నిరోధించేందుకు మురికి గుంతలలో ఆయిల్ బాల్స్ వేయాలని, మంచినీటితో కూడిన వనరులలో గంబుషియా చేపపిల్లలు వదలాలని సూచించారు. ప్రతి శుక్రవారం అన్ని నివాస ప్రాంతాల్లో, వ్యాపార వాణిజ్య సంస్థల్లో విధిగా డ్రై డే పాటించేలా చూడాలన్నారు. ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం నిర్ణీత రుసుము చెల్లించిన వారికి త్వరితగతిన క్రమబద్ధీకరణ అనుమతి మంజూరు చేయాలన్నారు. రెండు పడక గదుల ఇళ్లను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కేటాయించేలా అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పోర్టల్‌లో లబ్ధిదారుల వివరాలు వెంటవెంటనే అప్‌డేట్ చేయాలన్నారు. సమీక్ష అనంతరం కలెక్టర్ ఆర్మూర్ పట్టణంలోని 11,12 వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనలబ్ధిదారులను వారి నివాసాల వద్దకెళ్లి కలిశారు. ఆర్థిక ఇబ్బందులు వంటి సమస్యలుంటే, మెప్మా ద్వారా రుణం ఇప్పిస్తామని, ఉచితంగా ఇసుక సరఫరా చేయిస్తామని, ఆయా దశల నిర్మాణాలను బట్టి వెంటనే రూ. 5 లక్షల ఆర్థిక సాయం ప్రభుత్వం అందిస్తోందని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా మలేరియా నియంత్రణ విభాగం అధికారి డాక్టర్ , ఆర్మూర్ మునిసిపల్ కమిషనర్ రాజు తదితరులున్నారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు

రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్,సిపి వెల్లడి



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందు కు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి, పోలీసు కమీషనర్ సాయిచైతన్య సంబంధిత అధికారులకు సూచించారు. సమీకృతజిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన రోడ్డు భద్రతా జిల్లా కమిటీ సమావేశం జరిగింది. పోలీసు, రవాణా, ఆర్అండ్‌బి పంచాయతీరాజ్, జాతీయ రహదారుల సంస్థ, జిల్లా వైద్యారోగ్య శాఖ ఆర్‌టిసిరెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొని రోడ్డు ప్రమాదాలను నిలువరించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. జిల్లా మీదుగా ప్రధాన 44, 66 ఎన్‌హెచ్ జాతీయ రహదారులు వెళుతుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాటికి ఆస్కారం లేకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జ రుగుతున్న ప్రదేశాలను ఇప్పటికే బ్లాక్ స్పాట్లుగా పరిగణిస్తూ చేపట్టాల్సిన చ ర్యలపై ఇదివరకటి సమావేశాల్లో తీసుకున్న అన్ని నిర్ణయాలు అమలయ్యేలా చూడాలన్నారు. రోడ్లను ఆక్రమించుకుని బోర్డులు వంటి వాటిని ఏర్పాటు చేసిన దుకాణ యజమానులకు నోటీసులు జారీ చేసి వాటిని తొలగించాలని రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేయకుండా చూడాలన్నారు. ప్రధాన రహదారులపై ధాన్యం, మొక్కజొన్న వంటి వ్యవసాయ పంటలను ఆరబెడుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నందున రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జాతీయ రహదారులు ప్రధాన మార్గాలలో ఎక్కడబడితే అక్కడ వాహనాలునిలుపకుండా పర్యవేక్షణ జరుపాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, రెడ్‌క్రాస్ ప్రతినిధి పాల్గొన్నారు.

## సిర్పూర్ టి ఆసుపత్రిలో అందని ప్రసూతి సేవలు

పేరుకే పెద్ద ఆసుపత్రి.. కోట్ల నిధులతో ప్లాంట్లున్నా వృథా,

సిబ్బంది కొరతతో ప్రజల ఆవేదన



**ప్రజాపక్షం/సిర్పూర్ టి:**మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి పేరుకే పెద్దదిగా మారింది. ప్రతిరోజు 100 నుంచి 200 మంది ఓపి పేషెంట్లు వస్తున్నప్పటికీ ఆసుపత్రిలో కనీసం ఒక్క ప్రసవం కూడా చేయడం లేదు. తగినంత మంది డాక్టర్లు, ముఖ్యంగా గైనకాలజిస్టులు, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది లేకపోవడం ప్రసవ సేవలు అందించకపోవడానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. ప్రస్తుతం కేవలం ఇద్దరు వైద్యులు మాత్రమే విధులలో ఉండటం గమనార్హం. ఈ పరిమిత సిబ్బందితో ఆసుపత్రి పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించలేకపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వనరులున్నా వృథా..**

**ప్రభుత్వ విధానాల అమలులో లోపం**

ప్రసవాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆపరేషన్ థియేటర్, మందులు, ల్యాబ్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని వినియోగించుకోవడం లేదు. కోట్ల రూపాయల నిధులతో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేసినప్పటికీ, ఇప్పటివరకు అది ప్రారంభానికి నోచుకోలేదు. ప్రసవాలు చేయకపోవడంతో పిల్లల వార్డులోని పరికరాలను కాగజ్‌నగర్ నూతన ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. పిహెచ్‌సిల్లో కూడా ప్రసవాలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, సిర్పూర్ (టీ) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో ఈ విధానం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని కొన్ని నివేదికలు సూచిస్తున్నాయి. ఈ సమస్యలన్నీ కలిసి సిర్పూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవ సేవలు అందుబాటులో లేకుండా చేస్తున్నాయి. దీనివల్ల గర్భిణులు, బాలింతలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుంది, ఇది వారికి ఆర్థికంగా పెద్ద భారంగా మారింది. ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు ఆసుపత్రిలో నెలకొన్న సమస్యపై దృష్టి సారించి, తగినన్ని నిధులు కేటాయించి, వైద్యులు, సిబ్బందిని నియమించి, మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, సమర్థవంతమైన పర్యవేక్షణను ఏర్పాటు చేయడం ద్వారా సిర్పూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవ సేవలను తక్షణమే పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

## బస్టాండ్ ఆవరణలో నిరుపయోగంగా మరుగుదొడ్లు



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** స్వచ్ఛతకు పెద్దపీట వేసేందుకు ప్రభుత్వాలు ఎక్కడికక్కడ ప్రజల అవసరాల కోసం మరుగుదొడ్లు ఏర్పాటు చేసి వాటిని సక్రమంగా నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండటం మనందరికి తెలిసిందే. కానీ ఇందుకు భిన్నంగా మంచిర్యాల పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో గత కొన్ని సంవత్సరాల కిందట మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేసి వాటిని వినియోగంలోకి తీసుకురాకుండానే నిర్లక్ష్యంగా వదిలేశారు. బస్టాండ్‌లో మున్సిపల్ అధికారులు బస్సులు బయటకు వెళ్ళే గేటు సమీపంలో మరుగుదొడ్లు, మూత్రశాలలు పురుషులకు, స్త్రీలకు వేర్వేరుగా ఏర్పాటు చేశారు. కానీ ఏర్పాటు చేసిన అధికారులు వాటిని ప్రజలు ఉపయోగించడానికి వీలుగా నిర్వహణ భాధ్యతను మాత్రం మర్చిపోయారు. దీని వల్ల ఈ మరుగుదొడ్లు నిరుపయోగంగా మారడంతో పాటు రాత్రిపూట అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారిందనే విమర్శలు ఉన్నాయి. దీంతో మంచిర్యాల ఆర్‌టిసి డిపో మేనేజర్, అధికారులు ఈ మరుగుదొడ్లను నిర్వహణ విషయంలో మున్సిపల్ అధికారులు విన్నవించినా ఫలితం లేకపోయిందని వెంటనే ఈ ప్రాంతం అపరిశుభ్రంగా మారుతుందని ఇక్కడి నుండి మరుగుదొడ్లు తొలిగించాలని మున్సిపల్ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు కూడా పలుమార్లు విన్నవించినట్లు తెలుస్తోంది. కానీ మున్సిపల్ అధికారు ఈ విషయంలో పట్టించుకోకపోవడం పట్ల ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వెంటనే బస్టాండ్ ఆవరణలో నిరుపయోగంగా, అపరిశుభ్రంత మారిన ఈ మరుగుదొడ్లు తొలిగించాలని ఆర్‌టిసి అధికారులు, ప్రజలు కోరుతున్నారు.

**మరుగుదొడ్లు పరిశీలించి త్వరలో చర్యలు తీసుకుంటాం: ఇన్‌చార్జి కమిషనర్ రాజమనోహర్ ...**

మంచిర్యాల ఆర్‌టిసి బస్టాండ్‌లో అపరిశుభ్రంగా, నిరుపయోగంగా మరుగుదొడ్లు ఉన్నాయని వాటిపై మంచిర్యాల మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ రాజమనోహర్‌ను ప్రజాపక్షం వివరణ కోరగా, అతి త్వరలో ఈ మరుగుదొడ్లును పరిశీలించి అవసరాల మేరకు ప్రజలకు అవసరమైనట్లుగా చర్యలు తీసుకోవడం జరుగుతుందనిజరుగుతుందని వివరణ ఇచ్చారు.



# స్థానికం REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## అక్రమంగా ఏర్పాటు చేసుకున్న షాప్‌లు తొలగింపు

### మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్

**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా ట్రాఫిక్ విరుద్ధంగా బ్రిడ్జి కింద షాపులను ఏర్పాటు చేసుకుని తెరవకుండా ఉన్న వాటిని బుధవారం మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ తొలగించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ ఫ్రీ వెండింగ్ జోన్ పరిధిలో లేని చోట్లలో అక్రమంగా షాపులను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న షాపులను, వేరే వారి నుంచి కిరాయికి తీసుకున్న షాప్‌లను తెరవకుండా, ఎటువంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసుకున్న షాపులను తొలగించడం జరిగిందని తెలిపారు. బ్రిడ్జి కింద వ్యాపారులు తాత్కాలికంగా షాపును ఏర్పాటు చేసుకోకుండా సిమెంట్‌తో నిర్మిస్తూ శాశ్వతంగా ఏర్పాటు చేసుకోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి.రాజిరెడ్డి, ఏఈలు నరేష్, వికాస్, టిపివో శ్రీధర్, టిపిబివో దీపిక, ఆర్ఐ భాస్కర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహేష్, సదానందం, శ్రీకాంత్, రామరాజు, రాజు, కార్మికులు, పలువురు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** అన్ని వర్గాల సంక్షేమం కోసమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని జగిత్యాల ఎంఎల్ఎ డా.సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలో 29, 30, 31, 3, 6, 8 వార్డులో బుధవారం 80 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్ల అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ సంజయ్‌కుమార్ భూమి పూజ కార్యక్రమం చేపట్టారు. 44వ వార్డులో 35 లక్షలతో వేస్తున్న సీసీ రోడ్డు పనులు ఎంఎల్ఎ పరిశీలించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పట్టణంలో అన్ని ఆలయాలు, మజీద్, చర్చ్‌లకు నిధులు మంజూర్ చేయడం జరిగిందన్నారు. పట్టణ పచ్చదనం పారిశుద్ధ్యనికి ప్రజల సహకారాం అవసరమన్నారు. జగిత్యాల పట్టణ అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా కృషి చేస్తానని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూర్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ స్పందన , మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, ఆడువాల లక్ష్మ ణ్, అబ్దుల్‌ఖాదర్, ముజాహిద్, డీఈ వరుణ్, ఏఈలు శరన్, అనిల్ నాయకులు క్యాదాసు నాగయ్య, దుమాల రాజ్‌కుమార్, పంబాల రాము, ఖాజీం అలీ, కొలగాని ప్రేమలత సత్యం, వరనాసి మల్లవ్వ తిరుమల్లయ్య, రంగు హమేష్, ఓరుగంటి ప్రభాకర్‌రావు, మహేంధర్‌రావు, మున్సిపల్ సిబ్బంది, మాజీ కౌన్సిలర్‌లు నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



**ప్రజాపక్షం/చొప్పదండి:** ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ కె.నాగరాజు కోరారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో బాగంగా బుధవారం పట్టణంలోని గుమ్లాపూర్ ఎక్స్ రోడ్ వద్ద వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంఅ కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాలని, భవిష్యత్ తరాలను కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రశాంత్ కుమార్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ స్వర్గం శివాణి, ఇంచార్జి సానిటరీ ఇన్స్‌పెక్టర్ ఎన్నం అంజయ్య, వార్డు అధికారులు, మెప్మా టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ ఎం.అనిత, ఆర్‌పిలు, తదితరులున్నారు.

## భార్య కాపురానికి రావట్లేదని ఆత్మహత్య



**ప్రజాపక్షం/ధర్మపురి:** పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి కాపురానికి రాక పోవడంతో మనస్తాపం చెంది వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ధర్మపురి మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై పులిచెర్ల ఉదయ్ కుమార్ కథనం ప్రకారం జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం తీగల ధర్మారం గ్రామానికి చెందిన ఆలకుంట రాజశేఖర్ ఉపాధి కోసం దుబాయి వెళ్లివస్తుంటాడు. ధర్మపురికి చెందిన జ్యోతితో 8ఏళ్ల క్రితం రాజశేఖర్ వివాహం జరిగింది. ఇటీవల రాజశేఖర్ దుబాయి వెళ్లగా జ్యోతి తల్లిగారింట ఉంటోంది. కాగా దుబాయి నుండి రావాల్సిందిగా భార్య జ్యోతి కోరగా 2 నెలల క్రితం స్వగ్రామం వచ్చాడు. ఈ క్రమంలో నెల రోజుల క్రితం భార్యా భర్తల మధ్య గొడవ జరగ్గా జ్యోతి మళ్లీ అమ్మగారి ఇంట్లో ఉంటోంది. కాపురానికి రావాల్సిందిగా ఈ నెల 1న రాజశేఖర్ భార్యకుఫోన్ చేసి కోరగా తిరస్కరించడంతో బ్రతికి ఉండటం వృధా అంటూ మామిడి తోటలో పురుగుల మందు సేవించాడు. అది గమనించిన అల్లెపు బాపు, మహేందర్‌లు హుటాహుటినా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తుది శ్వాస విడిచాడు. మృతుని తల్లి శంకరమ్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు.

## గుర్తుతెలియని వాహనం ఢీ కొని ఒకరు మృతి




**ప్రజాపక్షం/గొల్లపల్లి :** గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది .ఎస్ఐ కృష్ణ సాగర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన రాగం సత్తయ్య (44)మంగళవారం రాత్రి సుమారు 10:30 నిమిషాల ప్రాంతంలో గొల్లపల్లి గ్రామ శివారులో ఏదో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడని తెలిపారు . మృతుడి భార్య రాగం రాజవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ప్రమాదంలో ఇద్దరు యుకులు మృతి

**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నల్లగొండ ప్రధాన మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టడం వల్ల ఇద్దరు యువకులు అక్కడిక్కడే మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం మల్యాల పట్టణ కేంద్రానికి దయ్యాల రాజ్‌కుమార్, జడ గణేష్ స్కూటీపై వెళ్తుండగా ఈ ప్రమాదం చోటచేసుకుంది. ఇంకా వివరాలు తెలియాల్సింది ఉంది.

# పకడ్బందీగా నీటి వనరుల సంరక్షణ చర్యలు

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా... దేశాయిపల్లి కొత్తచెరువు పరిశీలన





**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** జిల్లా లో నీటి వనరుల సంరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. తంగళ్ళపల్లి మండలం దేశాయిపల్లి కొత్తచెరువు, కట్ట పరిసరాలను బుధవారం ఉదయం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. స్థానిక నక్కవాగు నుంచి దేశాయిపల్లి కొత్తచెరువులోకి వచ్చే ఫీడర్ చానల్ లో డీ సిల్టింగ్ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. నీటి వనరుల సంరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో డిస్ట్రిక్ట్ ఇరిగేషన్ ఆఫీసర్ కిషోర్, డివిజన్7 ఈ.ఈ.ప్రశాంత్, డీ.ఈ.ఈ. సత్యనారాయణ, సాగర్ తదితరులు ఉన్నారు. విద్యాలయాల్లో విద్యార్థులకు సరైన బోధన అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తంగళ్ళపల్లి మండలం పద్మనగర్ సమీపంలోని కేంద్రీయ విద్యాలయమును ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ విద్యాలయం లోని ప్రతి తరగతి గదిని తిరిగి పరిశీలించి 9వ తరగతి విద్యార్థులకు సంస్కృతం, హిందీ పాఠాలు చదివించారు. ఇందులో కొంత మంది విద్యార్థులు సంస్కృత పాఠాలను చదవ లేకపోవడం గమనించారు. 10వ తరగతి విద్యార్థులకు మ్యాథ్స్ సబ్జెక్టులో లెక్కలు ఇచ్చి వారితో చేపించారు. 7వ తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్, 8వ తరగతి విద్యార్థులకు సోషల్ బోధించారు. ప్రశ్నలు అడిగి వారి నుండి సమాధానాలు రాబట్టారు.కేంద్రీయ విద్యాలయంలో విద్యాబోధన దేశం మొత్తం ఒకే విధంగా ఉంటుందని పోటీ పరీక్షలకు ఎక్కువ మంది విద్యార్థులు హాజరవుతున్నందున ప్రతి సబ్జెక్టులో విద్యార్థులు అత్యున్నతమైన విద్యాభ్యాసన చేయాలని సూచించారు. అదే విధంగా పిల్లలకు సరైన విద్యాబోధన అందించాలని ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ శేష ప్రసాద్ పాల్గొన్నారు.

## యాదాద్రి నృసింహుడి సన్నిధిలో మంత్రి అడ్లూరి పూజలు



**ప్రజాపక్షం/ధర్మపురి:** రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జి మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ బుధవారం ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి శ్రీ లక్ష్మి నృసింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదాద్రి స్వామి వారి దర్శనం కోసం దేవాలయాన్ని సందర్శించిన మంత్రి లక్ష్మ ణ్ కుమార్ కు ఆలయ అర్చకులు అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి సన్నిధిలో మంత్రి ప్రత్యేక పూజలు జరిపించారు. దర్శనానంతరం ఆలయ అర్చకులు స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందించారు. అంతకుముందు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ హనుమంతరావు మంత్రి కి ఘనంగా స్వాగతం పలికారు

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

**ప్రజాపక్షం/కొహెడ:** తెలంగాణ మోడల్ స్కూల్, కాలేజీ నాగ సముద్రాల విద్యార్థులకు పలు అంశాల పై హుస్నాబాద్ ఏసిపి ఎస్ సదానందం, కొహెడ ఎస్ఐ అభిలాష్, హుస్నాబాద్ షీటీమ్ బృందం అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా హుస్నాబాద్ ఎస్ సదానందం మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, షీటీమ్ యొక్క ప్రాముఖ్యత నిర్వహించే విధుల గురించి, సైబర్ నేరాల గురించి, ఫోక్సో చట్టాలు, బాల్య వివాహాలు దాని యొక్క పరిణామాలు,ఇవి టీజింగ్, గుడ్ టచ్, బాడ్ టచ్, సోషల్ మీడియా, సైబర్ సెక్యూరిటీ, మైనర్ డ్రైవింగ్, డయల్ 100 ప్రాముఖ్యత, సమాజంలో జరుగుతున్న నేరాలు వాటి నుండి ఎలా రక్షణ పొందాలి అనే అంశాల గురించి, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, సెల్ఫ్ డిఫెన్స్, మహిళల పిల్లల రక్షణకు ఉన్న చట్టాలు, భరోసా సెంటర్లో ఫోక్సో కేసులలో 18 సంవత్సరాలు లోపు ఉన్న బాలికలకు అందిస్తున్న సేవల గురించి, గృహహింస, వరకట్నం,స్నేహిత మహిళా సెంటర్లో నిర్వహించే కౌన్సిలింగ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నరసింహులు, వైస్ ప్రిన్సిపల్ అన్నపూర్ణ, అధ్యాపకులు, హుస్నాబాద్ షీటీమ్ బృందం సదయ్య, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు స్వప్న, ప్రశాంతి, కృష్ణ, పాల్గొన్నారు.

## తల్లిదండ్రులను కోల్పోయిన వారికి ఆర్థిక ప్రయోజనాలు

### కలెక్టర్ పమేలా సత్పతి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కోవిడ్ కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన వారికి ఆర్థిక ప్రయోజనాలు అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కోవిడ్ సమయంలో తల్లి దండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన ఏడుగురు బాలబాలికలకు పిఎం కేర్ ద్వారా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆర్థిక సాయం అందజేస్తోంది. 18 సంవత్సరాల వయస్సు నిండేసరికి 10 లక్షల రూపాయల వారి ఖాతాలో జమవుతాయని పేర్కొన్నారు. జిల్లాలో కోవిడ్ కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన ఏడుగురు పిల్లలలో నలుగురికి 18 సంవత్సరాలు నిండినందున వీరితో కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అనాథ బాలబాలికతో మాట్లాడి వారి విద్య, జీవన విధానం తదితర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. కోవిడ్ కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహకరిస్తున్నామని అన్నారు. కష్టపడి చదివి జీవితంలో నిలదొక్కుకోవాలని, పలువురికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. చెడు ఆలోచనలు చేయవద్దని, మంచి మార్గంలో పయనించాలని సూచించారు. ఈ సంధర్భంగా పిల్లల సమస్యలను అడిగి తెలుసుకుని ఏం చదువుకోవాలన్నా ప్రభుత్వ సంస్థల్లో అడ్మిషన్లు ఇప్పిస్తామని సూచించారు. పిల్లలకు వారసత్వంగా వచ్చే ఆస్తులను వారికి సంక్రమించేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పిఎం కేర్ ద్వారా జమ చేసిన సొమ్మును విద్యా అవసరాలకు ఉపయోగించుకోవాలన్నారు. సమావేశంలో ఇంచార్జి డిడబ్ల్యూవో సబిత, సిడబ్ల్యూసి చైర్మన్ ధనలక్ష్మి, డిసిపివో పర్వీన్, పిఓలు తిరుపతి, శాంత, ఎల్ఒసిపివో రాజులు పాల్గొన్నారు.

## పిల్లలకు గుణాత్మక మైన బోధన అందించాలి

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** విద్యాలయాల్లో పిల్లలకు గుణాత్మకమైన బోధన అందించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఎలిగేడు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సుల్తాన్ పూర్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సుల్తాన్ పూర్ గ్రామం మాజీ సర్పంచ్ కీ.శే .తానిపర్తి కాంతా రావు జ్ఞాపకార్థం వారి 6 కుమారులు పాఠశాలకు అందించిన దాదాపు 5 లక్షల రూపాయల విలువ గల ఎలెక్ట్రిక్ ఆటో ను, 7వ తరగతి విద్యార్థులు అందించిన 2 లక్షల 16 వేల రూపాయల విలువ గల డైనింగ్ థ్నింగ్ సెట్ లను ప్రారంభించారు. సుల్తాన్ పూర్ జడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా 9 లక్షల రూపాయలతో శిథిలావస్థలో ఉన్న డైనింగ్ హాల్ రిన్నోవేషన్ పనులు, 5 లక్షల రూపాయలతో చేపట్టిన అంతర్గత రోడ్డు, గేటు ఏర్పాటు పనులను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలోని విద్యార్థులకు అవసరమైన షూస్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు సైకిల్స్ అందించేందుకు ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలకు దాతలు అందించిన కిచెన్ షెడ్డు కు అవసరమైన 9 డైనింగ్ థ్నింగ్, 18 బెంచీలను కలెక్టర్ పంపిణీ చేశారు. విద్యాలయాల్లో విద్యార్థులకు సరైన బోధన అందించేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని అన్నారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఎలిగేడు తహసీల్దార్ యాకన్న, ఎంపిడిఓ భాస్కర్ రావు, మండల విద్యాశాఖ అధికారి పాఠశాల హెడ్మాస్టర్ నరేంద్ర చారి, సంతోష్ రెడ్డి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు పక్ష పాతి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం

### ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాలరూరల్:** జగిత్యాల రూరల్ మండలానికి చెందిన 99 మందికి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 28 లక్షల 14వేల రూపాయల విలువగల చెక్కులను, 86 మంది ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మీ పథకం కింద మంజూరైన 86లక్షల 9 వేలరూపాయల విలువగల చెక్కులను బుధవారం రోజున పొన్నాల గార్డెన్స్ లో లబ్ధిదారులకు జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతు భరోసా నిధులు రైతుల ఖాతాలలో జమ అయ్యాయని, రైతు పక్ష పాతి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని రాష్ట్రంలో అత్యధిక ఇందిరమ్మ ఇండ్లను జగిత్యాల నియోజకవర్గానికి మంజూరు అయ్యే విధంగా కృషి చేస్తానని అన్నారు. సన్న బియ్యం, ఉచిత కరెంట్, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, రుణమాఫీ, మహిళ సంఘాల ఆర్థిక చేయుత వంటి పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక గోదాంల నిర్మాణం జగిత్యాల నియోజకవర్గంలో చేపట్టామని, జాబితాపూర్ లో 12 కోట్లతో నిర్మాణం చేస్తున్నామని, గోదాంల నిర్మాణంతో రైతులకు లాభ సాటి, ధర వచ్చే వరకు నిల్వ చేసుకోవచ్చు అని, హమాలీ కూలీలకు చాలా ప్రయోజనంకలుగుతుందని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రూరల్ ఎమ్మార్వో శ్రీనివాస్, నారాయణ రెడ్డి, చెరుకు జాన్, అధికారులు, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, మహిళలు, పాల్గొన్నారు.

## 4న హైదరాబాద్‌లో ఖర్గే సభ

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 4న హైదరాబాద్‌లో ఎల్‌బి స్టేడియంలో జరిగే ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సభకు సిద్దిపేట నియోజక వర్గం నుండి కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి అసదుద్దీన్ అన్నారు. బుధవారం సిద్దిపేట కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో జరిగిన నియోజక వర్గం ముఖ్య నాయకుల సమావేశంలో నియోజక వర్గం కాంగ్రెస్ ఇంచార్జీ పూజల హరికృష్ణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తుఇమామ్‌తో కలసి అసదొద్దీన్ మాట్లాడారు. హైదరాబాద్‌లో ఈనెల 4న మూడు గంటలకు సభ ప్రారంభవుతుందన్నారు. సిద్దిపేట నియోజక వర్గం నుండి ఉదయం 11 గంటల నుండి కాంగ్రెస్ క్యాంపు కార్యాలయం వద్దకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చేరుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొమ్మల యాదగిరి,ముద్దం లక్ష్మి , కలిమొద్దీన్, రియాజ్, ఆనంద్, వాహెబ్, వహిద్‌ఖాన్, సాయి ప్రతాప్, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై కేజ్ వీల్స్ ట్రాక్టర్లు తిప్పితే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** రోడ్లపై కేజీ వీల్స్ ట్రాక్టర్లను తిప్పినట్టయితే కఠిన తప్పవని సుల్తానాబాద్ తాసిల్దార్ బషీరుద్దీన్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రోడ్లపై తిరిగే కేజీ వీల్స్ ట్రాక్టర్ వాడకం నిషేధంపై ఎంపి డిఓ దివ్య దర్శన్ రావుతో కలిసి సంబంధిత అధికారులు, కేజ్ వీల్స్ ట్రాక్టర్ ఓనర్స్ తో సమావేశం నిర్వహించారు. తహసిల్దార్ బషీరుద్దీన్ మాట్లాడుతూ ఎవరు కూడా కేజ్ వీల్స్ తో ట్రాక్టర్ల ను రోడ్లపై నడపరాదనీ సూచించారు. కేజ్ వీల్స్ ట్రాక్టర్లతో రోడ్డుపై నడపడం వల్ల రోడ్లు శాశ్వతంగా పాడవుతున్నాయని, గుంతలు అధికంగా ఏర్పడటం వల్ల ప్రమాదాలు సైతం జరుగుతున్నాయని, అందు వలన రోడ్ల పై కేజీ వీల్స్ వాడకాన్ని పూర్తి స్థాయిలో నిషేధించడం జరిగిందని తెలిపారు. ఈ విషయంలో కేజ్ వీల్స్ యజమానులందరికీ సంబంధిత గ్రామ కార్యదర్శుల ద్వారా నోటీస్ కూడా జారీ చేయడం జరుగుతుంది అన్నారు. గ్రామ రోడ్ల పై కేజీ వీల్స్ ట్రాక్టర్ వాడుతూ దొరికితే మొదటిసారి 5000 రూపాయలు, రెండవసారి 10,000 రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందని, మూడవసారి దొరికిన వారికి 20 వేల రూపాయల జరిమానా విధించడంతో పాటు సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశం లో సుల్తానాబాద్ ఎంపీడీవో దివ్యదర్శనం రావు లతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## 'స్థానిక' ఎన్నికల బరిలో నిలిచేవారికి శిక్షణ తరగతులు

### అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో ఈ నెల 4న హైదరాబాద్ ఎల్‌బి స్టేడియంలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో బుధవారం నగరంలోని హోటల్ వి పార్క్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ సోదరుడిగా కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభకు తరలివెళ్లే వారికి తనవంతు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. మహిళలకు ఏసి బస్సులు, వాహనాలు ఏర్పాటు చేస్తానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో విభేదాలు ఉండకూడదని కోరారు. అందరికీ ముగ్గురు మంత్రులు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ బహిరంగ సభతో ప్రతిపక్షాలు కాంగ్రెస్ కార్యకర్తలంటే ఏమిటో నిరూపించాలన్నారు. ఏఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కాంగ్రెస్ సభకు వస్తున్న క్రమంలో ప్రతి కార్యకర్త బాధ్యతగా తరలిరావాలని కోరారు. ఈ సన్నాహక సమావేశంలో నాయకులు వైద్యుల అంజన్ కుమార్, కొరివి అరుణ్, బానోత్ శ్రావణ్ నాయక్, చాడగొండ బుచ్చిరెడ్డి, సరిల్ల ప్రసాద్, భూమాగౌడ్, పిట్టల శ్రీనివాస్, నేతికుంట యాదయ్య, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, చర్ల పద్మ, స్వామి గౌడ్, నిహాల్, పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలి



**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి :** తొగుట మండలం ఏల్లారెడ్డిపేట గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనలబ్దిదారుల ఇండ్లు నిర్మించే స్థలాలను జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణానికి ముగ్గు పోసిన తర్వాత వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. ఇంటి నిర్మాణం వేగంగా పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇంటి నిర్మాణం చేపట్టాలన్నారు. వివిధ స్థాయిల వారిగా ఎప్పటికప్పుడు పర్యావేక్షణ చేస్తూ ఫోటో క్యాప్చర్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని హౌజింగ్ ఏఈకి సూచించారు. ఇంటి నిర్మాణ,నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణిత కాలంలోపు పూర్తి చేయాలన్నారు. అప్పుడే త్వరగా నిధులు విడుదలవుతాయని లబ్దిదారులకు హామీనిచ్చారు. సీజనల్ వ్యాధులపై ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండ ఏలా ఎదుర్కోవాలో ప్రజల్లో చైతన్యం కల్పించాలని అధికారులకు తెలిపారు.

**కస్తుర్బా పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్**

తొగుట మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ యూనిఫాం పంపిణి ప్రకియ, భోజనంలో నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. కామన్ డైట్ కార్యక్రమంలో మెను తప్పనిసరిగా పాటించాలన్నారు. డిఈఓ శ్రీనివాస్‌రెడ్డి, గృహనిర్మాణ శాఖ పిడి దామోదర్‌రావు, ఎంపిడిఓ తదితరులు పాల్గొన్నారు.

# రీల్

## 'వార్ 2' కోసం విడివిడిగా ప్రమోషన్స్



'వార్ 2'లో హృతిక్ రోషన్, ఎన్టీఆర్ తొలి సారిగా తెరపైకి కలిసి రాబోతున్నారు. ఈ క్రమంలో వై ఆర్ ఎఫ్ సంస్థ ఇద్దరికీ సపరేట్‌గా ప్రమోషన్స్ చేయించాలని భావిస్తోంది. 'హృతిక్, ఎన్టీఆర్ కలిసి 'వార్ 2'ని ప్రమోట్ చేయరు. ఏ ఈవెంట్‌లో గానీ ఈ ఇద్దరూ కలిసి కనిపించరు. అసలు 'వార్ 2' చిత్రానికి ప్రత్యేక ఆకర్షణ ఆ ఇద్దరే. అలాంటిది ఆ ఇద్దరినీ ఒకే సారి చూడాలంటే అది తెరపైనే చూడాలి. అంతే గానీ ప్రమోషన్స్‌లో ఏ ఒక్క చోట కూడా ఈ ఇద్దరూ కలిసి కనిపించరు. నేరుగా తెరపైనే ఆ ఇద్దరినీ ఒకే సారి చూస్తేనే ఆ థ్రిల్ ఉంటుందని నిర్మాత ఆదిత్య చోప్రా తెలిపారు. 2025లో అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రంగా 'వార్ 2' నిలుస్తుంది. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన 'వార్ 2' ఆగస్ట్ 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతోంది. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తోంది.

## పాటకు పరుచూరి పచ్చజెండా



నల్ల పూసల బాబ్జీ దర్శకత్వంలో నిర్మించిన 'పోలీస్ వారి హెచ్చరిక' సినిమాలోని సామాజిక చైతన్య గీతాన్ని ఎర్ర అక్షరాల రచయిత, తెలుగు రచయితల సంఘం అధ్యక్షుడు పరుచూరి గోపాల కృష్ణ ఆవిష్కరించారు. ఈ చిత్రాన్ని తూలికా తనిష్క్ క్రియేషన్స్ పతాకంపై బెల్లి జనార్ధన్ నిర్మించారు. ఈ సందర్భంగా పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ చాలా రోజుల తరువాత వెండితెర పైన మళ్ళీ ఇటువంటి అభ్యుదయ గీతాన్ని చూస్తున్నాను, ఈ పాటలో ఉన్న గమ్మత్తు, వైవిధ్యం ఏమిటంటే ఇది ఏ పార్టీనో, ఏ సిద్ధాంతాన్నో ప్రచారం చేసే పాట కాదు, ఈ సినిమా కథ ప్రస్తావిస్తున్న ఒకానొక ఘోరాన్ని నిగ్గ దీసి ప్రశ్నించే పాట అన్నారు.

చిత్ర దర్శకుడు బాబ్జీ మాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమలో భుజం మీద ఎర్ర శాలువాను కప్పుకొని తిరుగుతున్న అభ్యుదయ అక్షరం పరుచూరి గోపాలకృష్ణ చేతుల మీదుగా ఈ ప్రశ్నించే పాట ఆవిష్కరించడం తమ యూనిట్ మొత్తానికి సంతోషాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. చిత్ర నిర్మాత బెల్లి జనార్ధన్ మాట్లాడుతూ.. సినిమాను జూలై మూడవ వారంలో విడుదల చేస్తున్నాము, త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాము, సమాజంలోని అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే పక్కా కమర్షియల్ సినిమాగా మేము ఈ చిత్రాన్ని రూపొందించామని వివరించారు.


## తప్పుడు ప్రచారం చేయకండి – కోమలి



కోమలి ప్రసాద్ నటిగా తెలుగు తెరపై తనకు వచ్చిన అవకాశాల్ని సద్వినియోగం చేసుకుంటూ మంచి నటిగా పేరు సంపాదించుకున్నారు. ఇక త్వరలోనే 'శశివదనే' చిత్రంతో తెర పైకి రాబోతోన్నారు. కోమలి ప్రసాద్ మీద సోషల్ మీడియా, మీడియాలో ఓ అసత్య ప్రచారం మొదలైంది. యాక్టింగ్ కెరీర్‌ను వదిలి పెట్టారని, డాక్టర్ వృత్తిలోకి వెళ్లారని కోమలి ప్రసాద్ మీద రూమర్లు క్రియేట్ చేశారు. దీంతో ఈ వార్తల్ని ఖండిస్తూ కోమలి ప్రసాద్ సోషల్ మీడియాలో పోస్ట్ వేశారు. నేను డాక్టర్ అయ్యానని, నటనకు పూర్తిగా దూరం అయ్యానంటూ అసత్య ప్రచారాలు, తప్పుదోవ పట్టించే వార్తల్ని ప్రచురిస్తున్నారు. ప్రముఖ మీడియా సంస్థలు కూడా ఈ రూమర్లను నిజం అన్నట్లుగా ప్రచారం చేస్తున్నాయి. కానీ ఇందులో ఎలాంటి నిజం లేదని స్పష్టంగా చెప్తున్నా. ఎన్నో కష్టాలు ఎదుర్కొని, ఎంతో కష్టపడి ఇప్పటి వరకు సినీ మాల్లో కెరీర్‌ను కొనసాగిస్తూ ఈ స్థాయి వరకు వచ్చాను. నాలో, నా శ్రేయోభిలాషులలో అనవసరమైన ఆందోళనలను రేకెత్తించేలా ఈ రూమర్లను ప్రచారం చేస్తున్నారు. ఇలా తప్పు దారి పట్టించే సమాచారం వ్యాప్తి చెందకూడదని నేను కోరుకుంటున్నాను. అందుకే ఈ స్పష్టతనిస్తూ పోస్ట్ చేశాను. చివరి శ్వాస వరకు నటిగా నా బెస్ట్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తూనే ఉంటాను. ఈ ప్రయాణంలో నా వెన్నంటే ఉన్న నా శ్రేయోభిలాషులందరికీ, నా కంటే నన్ను ఎక్కువగా నమ్మిన వారందరికీ ధన్యవాదాలు. నేను ప్రస్తుతం స్క్రిప్ట్‌లను జాగ్రత్తగా ఎంచుకుంటున్నాను. త్వరలో కొత్త ప్రకటనలతో మీ అందరినీ చాలా గర్వపడేలా చేస్తాను' అని కోమలి ప్రసాద్ అన్నారు.

## త్వరలోనే చిల్డ్రన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ చేస్తాం

### మీడియాతో దిల్ రాజు చిట్ చాట్



'తమ్ముడు' సినిమా ఈ నెల 4నగా థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ నేపథ్యంలో మూవీ హైలైట్స్ ను నిర్మాత దిల్ రాజు చిట్ చాట్ చేశారు. శ్రీరామ్ వేణు మా సంస్థలో ఆర్య నుంచి వర్క్ చేస్తున్నాడు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా, అసోసియేట్ డైరెక్టర్‌గా, స్క్రిప్ట్ రైటర్‌గా మాతోనే ట్రావెల్ చేస్తున్నాడు. శ్రీరామ్ వేణు మా దగ్గరనే ఉన్నాడంటే అందుకు మా మధ్య ఉన్న రిలేషన్ కారణం. ఇండస్ట్రీలో డబ్బుతోనే పనులు జరుగుతుంటాయి. నాది భిన్నమైన పద్ధతి. నేను వేవ్ లెంగ్త్ కలిసిన వాళ్లతోనే జర్నీ చేస్తుంటాను. అనిల్ రావిపూడి, శ్రీకాంత్ అడ్డాల, హరీశ్ శంకర్, వంశీ పైడిపల్లి, దశరథ్.. ఇలా డైరెక్టర్స్ మా సంస్థలో వర్క్ చేసి హిట్ చిత్రాలు ఇచ్చారు. శ్రీరామ్ వేణు మా సంస్థలోనే ట్రావెల్ అవుతున్నాడంటే అతనికి భారీగా డబ్బు ఇవ్వడం వల్ల కాదు. మాతో ఆయనకు ఒక కంఫర్ట్ ఉంటుంది. అనిల్ రావిపూడితో నాకొక బాండింగ్ ఉంది. ఆ బాండింగ్‌లో ఒక కంఫర్ట్ ఉంటుంది. 'తమ్ముడు' మూవీ మొదటి 20 నిమిషాల తర్వాత మిగిలిన కథంతా ఒక్కరోజులో జరుగుతుంది. ఐదారు యాక్షన్ ఎపిసోడ్స్ ఉంటాయి. వాటిలో రెండు యాక్షన్ ఎపిసోడ్స్ వైలెంట్‌గా ఉన్నాయని ఎ సర్టిఫికెట్ ఇస్తామని సెన్సార్ వాళ్లు చెప్పారు. ఆ రెండు ఎపిసోడ్స్ తీసేస్తే యు బై ఎ ఇస్తామని చెప్పారు. ఈ సినిమాను థియేటర్ ఎక్స్‌పీరియన్స్ కోసమే చేశాం కాబట్టి ఆ ఫైట్ సీక్వెన్సులు తీసేయకుండా ఎ సర్టిఫికెట్‌కు అంగీకరించాం. తమ్ముడు మూవీ యాక్షన్ ఓరియెంటెడ్ కంటెంట్ ఉన్న మూవీ. థియేటర్స్‌కు వచ్చిన వాళ్లనైనా సంతృప్తి పరచాలి కదా అని ఎ సర్టిఫికెట్ తీసుకున్నాం. ఈ చిత్రాన్ని 150 రోజులు చిత్రీకరించారు. 80 పర్సెంట్ మూవీ అడవిలో ఉంటుంది. విజువల్స్, సౌండింగ్ హై క్వాలిటీతో ఉంటూ థియేటర్‌లో ఎంజాయ్ చేసేలా రూపొందించారు దర్శకుడు శ్రీరామ్ వేణు. పైరసీ అరికట్టేందుకు ఇండస్ట్రీ నుంచి గట్టి చర్యలు తీసుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ విషయంలో సపోర్ట్ చేస్తోంది. థియేటర్స్‌లో కూర్చుని సినిమా రికార్డ్ చేస్తున్న నలుగురిని ఈ మధ్య పోలీసులు అరెస్ట్ చేశారు. ఇలా రికార్డ్ చేసిన సినిమాలను చిన్న సినిమాకు 400 డాలర్స్, పెద్ద సినిమాకు వెయ్యి డాలర్స్ చొప్పున అమ్ముతున్నారు. వాళ్లకు అదే పెద్ద అమౌంట్ కానీ, నిర్మాతలు కోట్ల రూపాయలు నష్టపోతున్నారు. పైరసీని అరికట్టే చర్యలు క్రమంగా కట్టుదిట్టం అవుతాయని ఆశిస్తున్నాం. 'తమ్ముడు' సినిమాకు ప్రీమియర్స్ వేసే విషయం ఆలోచిస్తున్నాం. ఎందుకంటే ప్రీమియర్స్ కోసం ప్రభుత్వం నుంచి పర్మిషన్ తీసుకోవాలి. నేను ఎఫ్ డీసీ ఛైర్మన్ గా ఒక హోదాలో ఉన్నాను కాబట్టి అన్నీ చూసుకుని చేయాలి. తమ్ముడు మూవీని నెట్ ఫ్లిక్స్ వాళ్లు చూసి నచ్చి తీసుకున్నారు. పైరసీ అయినా, ఈ నెగిటివ్ ప్రచారాన్ని అయినా క్రమంగా ఒక్కో స్టెప్‌తో ఎదుర్కొంటూ వెళ్లాల్సిందే. ఎవరైనా రివ్యూస్ రాసేప్పుడు నిర్మాత గురించి ఒక్క నిమిషం ఆలోచించాలి. ప్రతిభ గల కొత్త వాళ్లకు అన్ని విభాగాల్లో అవకాశాలు ఇవ్వాలనే దిల్ రాజు డ్రీమ్స్ స్టార్ట్ చేశాం. మొదటి రోజునే మాకు 12 వేల అప్లికేషన్స్ వచ్చాయి. అందులో స్క్రూటినీ చేసి 1400 అప్లికేషన్స్ తీసుకున్నాం. ప్రొడ్యూసర్‌గా 81 అప్లికేషన్స్ వస్తే వాటిలో వాళ్ల కంపెనీ హిస్టరీ ఏంటి అని డీటెయిల్స్ చూసి 7 అప్లికేషన్స్ తీసుకున్నాం. ఇందులో రెండు మోడల్స్ చేస్తున్నాం. ఒకటి కథ బాగుంటే మేమే ఫండింగ్ చేసి వాళ్లతో మూవీ చేయిస్తాం. రెండోది వాళ్లే సినిమా చేసుకుని మా ప్రెజెన్స్, మా గైడెన్స్‌లో రిలీజ్ చేస్తాం. ఈ క్రమంలో కొత్త నిర్మాతలు కూడా ఇండస్ట్రీకి వస్తారని ఆశిస్తున్నాం. ఎఫ్ డీసీ నుంచి గద్దర్ అవార్డ్స్ చేశాం. నెక్స్ట్ ప్రస్తుతం మన రాష్ట్రంలో ఆగిపోయిన చిల్డ్రన్స్ ఫిలిం ఫెస్టివల్ నిర్వహించాలని అనుకుంటున్నాం. ఆన్ లైన్ టికెటింగ్, రన్ ట్రాక్ తీసుకొచ్చే ప్రక్రియ కొనసాగుతోంది. ప్రస్తుతం మా సంస్థలో రౌడీ జనార్ధన, ఎల్లమ్మ, దేత్తడి ప్రొడక్షన్‌లో ఉన్నాయి. మరో ప్రాజెక్ట్ కూడా ఉంది. ఈ ఏడాది చేస్తున్న నాలుగు సినిమాలు వచ్చే ఏడాది రిలీజ్‌కు తీసుకొస్తాం.

## రేపు 'సోలో బాయ్' రిలీజ్



సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై విన్నది, బేబీ నేహా శ్రీ సమర్పణలో సెవెన్ హిల్స్ సతీష్ నిర్మాతగా నవీన్ కుమార్ దర్శకత్వంలో రేపు ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సోలో బాయ్. బిగ్ బాస్ సీజన్ 7 ఫేమ్ గౌతం కృష్ణ హీరోగా రమ్య పసుపులేటి, శ్వేత అవస్థి హీరోయిన్లుగా నటిస్తూ అనిత చౌదరి, పోసాని కృష్ణ మురళి, అరుణ్ కుమార్, భద్రం, షఫీ, ఆర్ఫీ మామ తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషించనున్నారు. త్రిలోక్ సిద్ధు ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా పని చేయగా ప్రవీణ్ పూడి ఎడిటింగ్ చేశారు. జుడా సంధ్య ఈ చిత్రానికి సంగీతాన్ని అందించారు. ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు వివి వినాయక్ ముఖ్య అతిథిగా హాజరు కాగా రఘు కుంచే, కేఎల్ దామోదర్ ప్రసాద్, ప్రసన్న కుమార్ తదితరులు హాజరైన సోలో బాయ్ చిత్ర రిలీజ్ ఈవెంట్‌ను గ్రాండ్ సక్సెస్ చేశారు. ఈ సందర్భంగా వివి వినాయక్ మాట్లాడుతూ సతీష్ బట్టల రామస్వామి బయోపిక్ ద్వారా నిర్మాతగా మారారు. చాలా సాధారణ స్థాయి నుండి నిర్మాతగా మారడానికి ఎంతో కష్టపడి సతీష్ ఇక్కడ వరకు వచ్చారు. ఈ చిత్రంలో నటించిన గౌతమ్ కృష్ణకు మంచి భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నాను అని అన్నారు.

## తెలుగు తెరపై ఘట్టమనేని మరో వారసుడు



తెలుగు తెరపై మరో వారసుడు పరిచయం కాబోతున్నాడు. సూపర్ స్టార్ క్రిష్ణ మనవుడు హీరోగా పరిచయం అయ్యేందుకు సిద్ధం అవుతున్నాడు. ఘట్టమనేని రమేష్ బాబు కుమారుడు ఘట్టమనేని జయ క్రిష్ణ త్వరలోనే హీరోగా పరిచయం కానున్నారు. నటనకు కావలసిన అన్ని విద్యలు నేర్చుకున్నారు. ఓం భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఘట్టమనేని జయ క్రిష్ణ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనుంది.

## 'మార్గన్'ను సక్సెస్.. ఆడియెన్స్‌కు థాంక్స్

– విజయ్ ఆంటోని



విజయ్ ఆంటోని నటిస్తూ, నిర్మించిన 'మార్గన్' చిత్రానికి లియో జాన్ పాల్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంతో తన మేనల్లుడు అయిన అజయ్ ధీషన్‌ను విజయ్ ఆంటోని తెరకు పరిచయం చేశారు. ఈ సినిమాను విజయ్ ఆంటోని ఫిలింస్ కార్పొరేషన్ నిర్మించగా, సర్వాంత్ రామ్ క్రియేషన్స్ బానర్ పై జె.రామాంజనేయులు సగర్వంగా సమర్పించారు. ఈ సినిమాను జూన్ 27న సురేష్ బాబు తెలుగులో రిలీజ్ అయిన ఈ చిత్రానికి మంచి రెస్పాన్స్ దక్కింది. ఈ క్రమంలో చిత్రయూనిట్ సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ ఆంటోని మాట్లాడుతూ 'మార్గన్' సినిమాను సురేష్ బాబు, రామాంజనేయులు చాలా గ్రాండ్‌గా తెలుగులో రిలీజ్ చేశారు. ఇకపై నా సినిమాల్ని తెలుగులో రిలీజ్ చేస్తానని సురేష్ బాబు అన్నారు. నాకు ఇంత మంచి మూవీని ఇచ్చిన లియో జాన్ పాల్‌కు థాంక్స్. అజయ్‌ను ఇంత బాగా లాంచ్ చేసినందుకు నాకు చాలా సంతోషంగా అనిపించింది. తెలుగు, తమిళంలో అజయ్‌కు మంచి పేరు వచ్చింది. అజయ్ ఇకపై ఇలానే మంచి కంటెంట్ చిత్రాల్ని చేస్తూ ఆడియెన్స్ నుంచి ప్రేమను సంపాదిస్తూనే ఉండాలి. బిచ్చగాడు 2, రోమియో చిత్రాలకు అజయ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా కూడా పని చేశారు. అజయ్‌తో కలిసి నేను ఇక స్ట్రెయిట్ తెలుగు సినిమాల్ని నిర్మిస్తాను. తమిళంలో ప్రస్తుతం ఏడు చిత్రాల్ని చేస్తున్నాను. అందులో తెలుగు డబ్బింగ్ కోసం మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటాను. త్వరలోనే 'భద్రకాళి' రానుంది. అదొక పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్. 'మార్గన్'ను ఇంత పెద్ద సక్సెస్ చేసిన తెలుగు ఆడియెన్స్‌కు థాంక్స్' అని అన్నారు.

## విద్యా విధానం

(మొదటి పేజీ తరువాయి)

ఇంటర్మీడియట్ దశ కీలకమని,ఆ దశలో విద్యార్థికి సరైన మార్గదర్శకత్వం లభించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇతర రాష్ట్రాల్లో 9వ తరగతి నుంచి 12వ తరగతి విధానం ఉన్నదని, తద్వారా ఆయా రాష్ట్రాలలో డ్రాపౌట్స్ సంఖ్య తక్కువగా ఉన్నదని అధికారులు సిఎం దృష్టికి తీసుకొచ్చారు. ఇంటర్మీడియట్‌లో విద్యార్థుల చేరికతో పాటు వారి హాజరుపైన కూడా దృష్టి పెట్టాలన్నారు. 'యంగ్ ఇండియా రెసిడెన్షియల్స్ స్కూళ్ల' నమూనాలను సిఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా పరిశీలించారు.

### ప్రతి పాఠశాల ఆవరణలో భారీ జాతీయ జెండా

ప్రతి పాఠశాల ఆవరణలో భారీ జాతీయ జెండా ఏర్పాటు చేయాలని సిఎం రేవంత్‌రెడ్డి సూచించారు. పాఠశాలల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్మాణాల ప్రగతిపై ప్రతి వారం తనకు నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో బాలురకు ఒకటి, బాలికలకు ఒకటి యంగ్ ఇండియా రెసిడెన్షియల్స్ స్కూళ్ల నిర్మాణాలను చేపడతామన్నారు. ఇప్పటికే ఒక్కో పాఠశాలకు సంబంధించి స్థల సేకరణ పూర్తయిన నేపథ్యంలో రెండో పాఠశాలకు సంబంధించిన స్థల గుర్తింపు, సేకరణ ప్రక్రియపై దృష్టి సారించాలని ఆదేశించారు. 'వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయ' నిర్మాణ నమూనాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. పలు మార్పులను సూచించారు. సాధ్యమైనంత త్వరగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని సిఎం ఆదేశించారు. ఈ సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిత, జెఎన్‌టియు రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ వైద్యులు.. సర్కార్ దవఖానాలో నెల రోజులు..

డిసెంబర్ 9 నాటికి 3 ప్రభుత్వ ఆసుపత్రులు

సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : కార్పొరేట్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు సామాజిక బాధ్యతగా ఏడాదిలో కనీసం ఒక నెల రోజుల పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిరుపేదలకు సేవలు అందించే ఆలోచన చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సామాన్య ప్రజలకు సేవలు అందించడం వల్ల వైద్య వృత్తిలో గొప్ప అనుభూతి, ఆత్మ సంతృప్తి లభిస్తుందన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఏఐజి నూతన ఆసుపత్రిని బుధవారం సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కార్పొరేట్ రంగంలో ఉన్న వైద్యులు, ముఖ్యంగా అమెరికాలో స్థిరపడిన మన రాష్ట్రానికి చెందిన డాక్టర్లు ఎప్పుడైనా ఇక్కడికి వచ్చినప్పుడు వారి సేవలను ప్రభుత్వం వినియోగించుకునేందుకు తగిన ప్లాట్‌ఫామ్ లేదని, ఇందుకు సంబంధించి ఒక వేదికను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వెళితే ప్రాణాలు పోతాయన్న అభిప్రాయం నుంచి దూరం చేయాలన్న ఆలోచనతో కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ రంగంలో వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. అందులో భాగంగానే వందేళ్ల ఉస్మానియా ఆసుపత్రికి 30 ఎకరాల స్థలం కేటాయించి రూ.3 వేల కోట్లతో కొత్త ఆసుపత్రి నిర్మిస్తున్నామని, నిమ్స్‌లో మరో 2 వేల పడకల విభాగం ప్రారంభించబోతున్నామని తెలిపారు. అదేవిధంగా వరంగల్, అల్వాల్, ఎల్‌బి నగర్, సనత్‌నగర్ తదితర ప్రాంతాల్లో కార్పొరేట్‌కు దీటుగా రాష్ట్రంలో 7 వేల పడకలతో ఆసుపత్రులను వచ్చే డిసెంబర్ 9 నాటికి అందుబాటులోకి తేవాలని నిర్దేశించామని సిఎ తెలిపారు. మహిళలు అధికంగా కాన్సర్ భారిన పడుతున్న నేపథ్యంలో నివారణ చర్యల్లో భాగంగా రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల్లో కోటి మంది సభ్యులహెల్త్ ప్రొఫైల్ తయారు చేసి వారివారి హెల్త్ ప్రొఫైల్స్‌తో ఒక యూనిక్ ఐడీ నంబర్‌తో కార్డులను జారీ చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నమని వెల్లడించారు. రాబోయే వంద సంవత్సరాలు లక్ష్యంగా తెలంగాణ రైజిం గ్ 2047 విజన్ డాక్యుమెంట్‌లో ఒక చాప్టర్ ఆరోగ్య రంగమని, ఇందుకు డాక్టర్ నాగేశ్వర రెడ్డి భాగస్వామ్యం అందించాలన్నా రు. హైదరాబాద్ నగర ప్రజలకు రెండో అతిపెద్ద ఆసుపత్రిని అందుబాటులోకి తెచ్చినందుకు డాక్టర్ నాగేశ్వరరెడ్డిను సిఎం అభినందనలు. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 65 దేశాల నుంచి చికిత్స కోసం ఏఐజీ ఆసుపత్రికి వస్తున్నారంటే అది రాష్ట్రానికి గర్వకారణమని సిఎం పేర్కొన్నారు.



## అమర్‌నాథ్ మొదటి బ్యాచ్ యాత్ర ప్రారంభం

జమ్మూ : అమర్‌నాథ్‌కు వెళ్ళే మొదటి బ్యాచ్ యాత్రీకుల ప్రయాణానికి జమ్మూ కశ్మీరు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కశ్మీరులోని రెండు బేస్ క్యాంపుల నుండి ప్రారంభోత్సం చేశారు. ఈ మొదటిబ్యాచ్‌లో 5,880మంది యాత్రికులు బయలుదేరి వెళ్ళారు. వారికి బహుముఖ వలయాల భద్రత సమకూర్చారు. భారీ భద్రత మధ్య భగవతి నగర్ బేస్‌క్యాంప్ వద్ద ఆయన పూజలు జరిపారు. తర్వాత జెండా ఊపి యాత్ర ప్రారంభించారు. భారీ వర్షాల నడుమ భం..భం.. భోలే.. హర హర మహాదేవ్ అని యాత్రికులు నినాదాలు చేస్తుండగా, ఎంతో ధైర్యసాహసాలతో జమ్మూ నుండి యాత్రికుల వాహనాలు బయలుదేరాయి. యాత్రికుల నినాదాలతో జమ్మూ నగరం ఎంతో పవిత్రతను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో గవర్నర్‌తోపాటు స్థానిక శాసనసభ్యుడు, వివిధ మతాధికారులు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భద్రతాధికారులు ఈ యాత్రను, యాత్రికులను ఇరవైనాలుగు గంటలూ కంటికిరెప్పలా కాపాడేందుకు సన్నద్ధమయ్యారు. రాజ్‌భవన్ వద్ద పోలీసు కంట్రోల్ రూమ్ వద్ద సమగ్ర కమాండ్ కంట్రోల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆర్‌ఎఫ్ ఐడి ఆధారిత ట్రాకింగ్ వ్యవస్థను కూడా అనుసంధానం చేశారు. జులై మూడో తేదీ గురువారంనాడు రెండు మార్గాలలో కశ్మీరు లోయ నుండి యాత్ర మొదలవుతుంది. సంప్రదాయంగా అనంత్‌నాగ్ జిల్లాలో ఉన్న నున్వాన్–పహల్గామ్ మార్గంలో 48 కి.మీ ప్రయాణం చేసి అమర్‌నాథ్‌కు చేరుకుంటారు.

## హస్తం... సమాయత్తం...

(మొదటి పేజీ తరువాయి)

ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఎఐసిసి రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సహా పలువురు ముఖ్య నేతల సమక్షంలో కీలక సమావేశాలను నిర్వహించారు. ఇప్పటికే టిపిసిసి పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పిఎసి) సమావేశంలో రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ పనితీరు, ప్రతిపక్షాల వైఖరిపై ప్రధానంగా చర్చించారు. టిపిసిసి అడ్వైజరీ కమిటీ సమావేశంలో పార్టీకి సంబంధించిన కీలక అంశాలపై పార్టీ సీనియర్ నాయకులతో సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఇటీవల కొత్తగా నియమితులైన టిపిసిసి నూతన ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులతో కూడిన కార్యవర్గ సమావేశం కూడా నిర్వహించింది. ప్రభుత్వం, పార్టీ మధ్య సమన్వయం సాధించడం, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లడం లాంటి అంశాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.

టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలో జిల్లాల వారీగా పార్టీ సమావేశాలను, ముఖ్య నేతల సమావేశాలను, ప్రజాసంఘాల సమావేశాలను నిర్వహిస్తూ పార్టీ సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై చర్చలు జరుపుతున్నారు. తాజాగా కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుల సమ్మేళనాన్ని ఈ నెల 4న హైదరాబాద్‌లో నిర్వహించనుంది. గ్రామ స్థాయి నేతలతో నేరుగా ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గే సమావేశం దేశంలోనే మొదటి సారి తెలంగాణతో శ్రీకారం చుట్టింది. తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్‌ను నింపేందుకు కాంగ్రెస్ చర్యలు చేపట్టింది. దాదాపు పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ (గతంలో టిఆర్‌ఎస్) ఉండడంతో స్థానిక సంస్థల లో కూడా బిఆర్‌ఎస్ పార్టీదే ఆధిపత్యం కొనసాగింది. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మొత్తం 535 జెడ్‌పిటిసి స్థానాలలో బిఆర్‌ఎస్ 446 స్థానాలను కైవసం చేసుకోగా, కేవలం 76 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచింది. మొత్తం 5,738 ఎంపిటిసి స్థానాలలో 3,556 స్థానాలను బిఆర్‌ఎస్ గెలుచుకోగా 1,377 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచింది. ఇక గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో కూడా బిఆర్‌ఎస్ హవా కొనసాగింది. మొత్తంగా స్థానిక సంస్థలలో బిఆర్‌ఎస్ పార్టీ పెత్తనమే కొనసాగింది. వాటి పదవి కాలం ముగిసిపోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ప్రభుత్వం, పార్టీ మధ్య సమన్వయం సాధించడం, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఆధిపత్యాన్ని సాధించాలని కాంగ్రెస్ పట్టుదలతో పనిచేస్తున్నది.



'జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమంలో భాగంగా రే ఎల్‌బి స్టేడియంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ(టిపిసిసి) ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన 'క్షేత్రస్థాయి కార్యకర్తల సమ్మేళనం' కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎఐసిసి ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ తదితరులతో కలిసి పరిశీలించి... దిశా నిర్దేశం చేసిన మంత్రి శ్రీధర్ బాబు.

## విజయవంతం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో బుధవారం భట్టి విక్రమార్క ఎఐసిసి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుదిళ్ళ శ్రీధర్‌బాబు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, డిసిసి అధ్యక్షుడు రోహిన్ రెడ్డిలతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రామ శాఖ అధ్యక్షులతో అఖిలభారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేరుగా సమావేశం కావడం దేశంలోనే ఇది మొదటిసారి అని డిప్యూటీ సిఎం వివరించారు. తెలంగాణ రాష్ట్రం అనంతరం దేశవ్యాప్తంగా ఈ తరహా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న సభ నేపథ్యంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు డిప్యూటీ సిఎం వివరించారు. నాలుగో తేదీన సాయంత్రం మూడు గంటలకల్లా రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, మండల శాఖ అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎంఎల్‌ఎలు, ఎంపిలు, మంత్రులు సమన్వయంతో సభను విజయవంతం చేయాలని డిప్యూటీ సిఎం పిలుపునిచ్చారు. గ్రామ శాఖ అధ్యక్షులతో ఎఐసిసి అధ్యక్షుడు మాట్లాడే కార్యక్రమానికి మొదటి అవకాశం తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చినందుకు ఎఐసిసికి ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం కృతజ్ఞతలు తెలిపారు.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com